HETU VADI

# హేతువాది

Monthly Journal devoted to Science, Rationalism & Humanism

## ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘ

# రజతోత్సవ సంచిక

## (1979-2004)

233

సంపుటి : 22

సంచిక : 9

జూన్, 2004

వెల : రు. 30/-

ప్రధాన సంపాదకులు : రావిపూడి వెంకటాద్రి

## హేమా పబ్లికేషన్స్, చీరాల - 523 155. (ఫోన్ 08594-33403)

మా వద్ద ప్రస్తుతం లభించే ఈ క్రింది హేతువాద -మానవవాద సాహిత్యం మొత్తం సెట్టుకు 50%, రు. 500/- లపై మొత్తం ఖరీదుకు 40% రాయితీ వుంటుంది. డబ్బు మొత్తం ముందుగా పంపితే, పోస్టు ఖర్చులకు వి.పి.లు పంపబడతాయి.

**రావిపూడి వెంకటాద్రి గారి రచనలు:**

| | |
|---|---|
| జీవమంటే ఏమిటి? | రు. 10 |
| రాడికల్ హ్యూమనిస్టు దర్శనం | 25 |
| నాస్తికులున్నారు జాగ్రత్త! | 15 |
| హేతుత్వం-మతత్వం | 10 |
| భావవిప్లవం-వర్గచైతన్యం | 25 |
| ఎం.ఎన్.రాయ్-భారతకమ్యూనిజం | 100 |
| కళ-శాస్త్రం-తత్వం-హేతువాదం | 20 |
| వైదికఛాందసం-మతపునరుజ్జీవనప్రమాదం | 25 |
| శాస్త్రం-అశాస్త్రం | 40 |
| సత్యాన్వేషణ | 30 |
| స్వామినేని హితసూచని | 20 |
| సెక్యులరిజం-హ్యూమనిజం | 40 |
| అడుగుజాడలు | 30 |
| కార్యకారణత - నియతివాదం-మానవవాదం | 40 |
| హేతువాదం-నైతికవిప్లవం | 20 |
| వాస్తువు శాస్త్రమా? | 60 |
| బైబిలు సృష్టివాదం | 20 |
| కమింటరన్‌లో ఎం.ఎన్.రాయ్ | 10 |
| ఎం.ఎన్.రాయ్ దర్శనం | 15 |
| మనుధర్మశాస్త్రం మానవధర్మశాస్త్రమా? | 40 |
| హేతువాదం-అజ్ఞేయవాదం | 20 |
| బైబిలు గణాచారం | 10 |
| మార్క్సిజం-హ్యూమనిజం | 25 |
| నియతివాదం-అనిశ్చయసూత్రం | 10 |
| చార్వాకుల చర్చ | 10 |
| డార్వినిజం-హేతువాదం | 10 |
| కవిరాజు పీఠికలు | 60 |
| వివేకం - అవివేకం | 10 |
| శంకరాచార్యుడి హత్య | 10 |
| రినైజాన్స్ | 5 |
| లయ - అవలయ | 60 |
| మనం ఏమి చేయాలి? | 40 |
| మనదేశంలో పూర్వం విమానాలుండేవా? | 2 |
| ఎం.ఎన్.రాయ్ రాడికల్ హ్యూమనిజమం | 20 |
| Life and Soul | 10 |
| Reason and unreason | 10 |
| Rationalism | 35 |
| Why Rationalism? | 10 |

**ఇతరుల రచనలు:**

| | | |
|---|---|---|
| ఆధునిక విజ్ఞానం ఏమి చెపుతోంది? | ఆరమళ్ళ పూర్ణచంద్ర | రు. 90 |
| నరహంతకులు | డా॥ఎన్.ఇన్నయ్య | 10 |
| రాధాకృష్ణన్‌కు తత్వం వుందా? | డా॥ఎన్.ఇన్నయ్య | 10 |
| మహాత్మాగాంధీ -ఎం.ఎన్.రాయ్ | శిబ్‌నారాయణ్ అను॥ప్రఫుల్ల | 10 |
| రాడికల్ హ్యూమనిజం:సిద్ధాంతం-ఆచరణ | (ఎం.ఎన్.రాయ్) అను॥సి.రాజారెడ్డి | 10 |
| The Rhythm of the Cosmos | M.N.Roy | 10 |
| సాహసించండి | పాల్‌కర్జ్ (అను - డా॥ ఎన్. ఇన్నయ్య) | 30 |
| శుక్రనీతి - మానవనీతి | కొల్లా సుబ్బారావు | 10 |
| Humanist Way | Innaiah & babu | 75 |
| నేను ముస్లింనుకాను, ఎందుకని? | ఇబ్న్‌వరాక్ - అను॥ఇన్నయ్య | 200 |
| మతాలచిత్రహింసలో చిన్నారులు | డా॥ఎన్.ఇన్నయ్య | 20 |
| Rationalism | Dr.D.D.Bandiste | 60 |
| ఇదీ, గీతా రహస్యం | వి.ఆర్.నార్ల (అను) డా॥ ఇన్నయ్య | 40 |
| హ్యూమనిస్టు మేనిఫెస్టోలు | అను॥ ప్రఫుల్లచంద్ర | 40 |

కాపీకి రు 75/- చొప్పున హేతువాది సంపుటాలు నెం. 2,5,9,12,13,14,15 -రాయితీ లేదు.

KRSA 102 M341

# విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| కృతజ్ఞతలు | | ... | 2 |
| సందేశాలు | | ... | 3 |
| ఎడిటోరియల్ | రావిపూడి | ... | 9 |
| మతగ్రంథ స్థానములో భారత సంవిధానముపై ప్రమాణము చేయుట | ఎన్. కె. ఆచార్య | ... | 10 |
| ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘ కార్యక్రమాల సమీక్ష | పెన్మెత్స సుబ్బరాజు | ... | 12 |
| హేతువాదం - విజ్ఞానశాస్త్రం | ప్రఫుల్లచంద్ర | ... | 26 |
| హేతువాదం పిల్లలకు చెప్పొచ్చా? | డా॥ ఎన్. ఇన్నయ్య | ... | 34 |
| స్వకీయం - రావిపూడి | రావిపూడి | ... | 37 |
| విద్యావిధానం - హేతువాదం | పసల భీమన్న | ... | 43 |
| హేతువాదం - నాస్తికత్వం | గుమ్మా వీరన్న | ... | 47 |
| దేవుడున్నాడు! | డి.వి. నరసరాజు | ... | 52 |
| హేతువాదమంటే స్వేచ్ఛావాదమే | కుర్రా హనుమంతరావు | ... | 55 |
| మతం మూఢనమ్మకాలకు మూలకారణం | ప్రొ॥ కె. శేషాద్రి | ... | 61 |
| విద్యావంతులుగా వివేచనా జ్ఞానం పెంచుకోండి | సంకతాల రామయ్య | ... | 63 |
| వేదాల్లో అంతా ఉందిష? | రావిపూడి | ... | 65 |
| ఆలోచించండి | తుమ్మా భాస్కర్ | ... | 67 |
| ఎన్నాళ్ళు చెబుతాం ఈ విశ్వతత్వం | ప్రఫుల్లచంద్ర | ... | 69 |
| సాంఘిక న్యాయం | జి.సి. హెచ్. వీరాస్వామి | ... | 73 |
| ఆత్మజ్ఞానం | జి.సి. హెచ్. వీరాస్వామి | ... | 75 |
| హేతువాదమా, నాస్తికత్వమా, ఏదిముందు? | రావిపూడి | ... | 78 |
| ఒకే ఒక్కరు | రజనీకాంత్ | ... | 80 |
| ఇప్పటి దేశపరిస్థితి | డి.వి. నరసరాజు | ... | 86 |
| చుండూరు జీవిత విశేషాలు | సత్యం | ... | 88 |
| "హేతువాది" వ్యాసాల్లో రావిపూడి భావాలు | రావిపూడి | ... | 92 |
| ప్రకటనలు | | ... | 98 |
| VIOLENCE ON WOMEN | G. Radha Rani | ... | 127 |

# కృతజ్ఞతలు

ఈ స్వర్ణోత్సవాలు విజయవంతం కావడానికి సహకరించిన వదాన్యులకూ,
హేతువాద ప్రముఖులకూ, కార్యకర్తలకూ
ఈ స్వర్ణోత్సవ సంచికకు వ్యాపార ప్రకటనలిచ్చి సహకరించిన వదాన్యులకూ
చక్కని రచనలందించిన మిత్రులకూ, పెద్దలకూ
ఈ స్వర్ణోత్సవాలు విజయవంతం కావాలని కోరుతూ సందేశాలు పంపించిన పెద్దలకూ
అధ్యయన శిబిరాల్లో ఉత్తమ ప్రసంగాలు చేసిన వక్తలకూ,
చర్చల్లో పాల్గొన్న ఆసక్తి పరులకూ శ్రోతలుగా సహకరించిన కార్యకర్తలకు,
ఇతర మిత్రులకూ
ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘ రజతోత్సవ మహాసభను ప్రారంభించిన పెద్దలకూ,
ముఖ్య అతిథులకూ, వక్తలకూ
భారతహేతువాద సంఘ 74వ జాతీయ వార్షిక మహా సభను ప్రారంభించిన
పెద్దలకూ, వక్తలకూ
ఇతర రాష్ట్రాల నుంచి వ్యయ ప్రయాసల కోర్చి వచ్చిన
భారత హేతువాద సంఘ ప్రతినిధులకు
ఈ స్వర్ణోత్సవ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించిన
ప్రకాశంజిల్లా హేతువాద సంఘ ప్రతినిధులకూ,
ఈ స్వర్ణోత్సవ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించిన
ప్రకాశం జిల్లా హేతువాద సంఘానికీ
ఇతర జిల్లాల నుంచి వచ్చిన ప్రతినిధులకూ
ఈ సభలకు సుహృద్భావ ప్రతినిధులుగా హాజరైన సారూప్య భావాలు గల
సోదర సంఘాల ప్రతినిధులకూ
ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘం కృతజ్ఞతలు చెప్పుకుంటున్నది.

**పెన్మెత్స సుబ్బరాజు**
అధ్యక్షులు
ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘం

**మేడూరి సత్యనారాయణ**
ప్రధాన కార్యదర్శి
ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘం

# Message – I

Dear Friends and colleagues in Andhra Pradesh Rationalist Association!

As the APRA celebrates its Silver Jubilee this June, please accept my personal respectful and grateful congratulations!

The achievements of the APRA are considerable – of achieving ideological clarity and promoting a clear conception of rationalism and humanism and that of the creation of a dedicated group of selfless and visionary leaders intent on creating a modern society which cherishes modern values in Andhra Pradesh. The APRA has helped promote widely the understanding that the rationalist movement need not confine itself to debunking superstition, but that it has a role beyond this to empowering humanity with the tools of learning, understanding and implementing Human knowledge in a rational manner. And in playing this role, the importance of the APRA is not merely regional, it is indeed national! As the APRA is celebrating its 25 years of significant contributions, I would also like to pay tribute to the singular contributions of one individual; the prolific and articulate Sri Ravipudi Venkatadri whose intellectual contributions have been the identifying mark of the Association.

I hope that at this Silver Jubilee celebrations, the Association members will aim to create plans for the next several years so that the APRA's reach will go beyond its present membership. It seems important to reach out more than has been done so far to children, schools, professional associations and the public in general.

With every good wish to the APRA, not only on behalf of IHEU but also on my own personal behalf for having been an important part of my personal education.

**Babu Gogineni**
Executive Director, IHEU
International Humanist and Ethical Union
London.

# Message – II

Dear Fellow Rationalists.

I am extremely delighted to learn that APRA will be celebrating its Silver Jubilee in June 2004. My delight is all the more greater, since I was associated also with its inauguration in 1979. My only regret is that on account of my ill health, I will be missing the Silver Jubilee celebrations. I therefore hereby Convey my best wishes for the Grand success of the functions.

I do know, how difficult it is to run any association for 25 years – not to speak of a rationalist organization. I convey my congratulations to those who have been running APRA from time to time against all odds.

The rationalist movement is the most unpalatable one with the targeted beneficiaries themselves opposing it. Resistance to change may be a natural emotional phenomenon, but it is all the more acute, when it comes to the question of introspection of one's own religious and traditional beliefs.

It is, therefore, imperative that the hard-core rationalists in the movement move forward very slowly and steadily to bring about the desired changes in the minds of the innocent and ignorant people and thereby in the society at large. For this purpose, it is essential that the message of rationalism is gradually brought down to the door steps of the common man from the present level of a handful of intellectuals. The battle is, no doubt a long drawn out one and calls for a sustained, intensive and extensive efforts and sacrifices on the part of all the confirmed rationalists. THE ULTIMATE VICTORY WILL, HOWEVER, BE OURS IN THE LONG RUN.

Madras
18-05-2004

Yours' in the cause of rationalism
**A.Suryanarayana**
Ex. General Secretary,
Indian Rationalist Association (IRA)

# సందేశం - 3

**ఆంధ్ర ప్రదేశ్ హేతువాద సంఘ రజతోత్సవాల శుభవేళ సభ్యులందరికీ శుభాకాంక్షలు.**

మఘలో పుట్టి పుబ్బలో కనుమరుగవుతున్న అభ్యుదయ సంఘాలకు భిన్నంగా గత 25 సంవత్సరాలుగా వన్నె తరగని రీతిలో, క్రియాశీలంగా, సజీవంగా సాగుతూ సామాజిక రుగ్మతలపై రాజీలేని పోరాటం చేస్తున్న మీ కృషి విలక్షణం, అభినందనీయం.

భిన్న విలువల సమాజం మనది. ఆ విలువలకు పునాది కులం, మతం, ఆచార సాంప్రదాయాలే గాని మనిషి మాత్రం కాలేదు. విలువలు ఉన్నతంగా ఉండాలనే వాదాలు వస్తున్నా, అవి మానవికం కావాలనే స్పృహ మేధావులు, నాయకులలో నేటికీ అంకురించలేదు. అంకురించి ఆచరించే ప్రయత్నం కొందరు చేసినా అవి సంప్రదాయ పరిధిని దాటక మానవికం కాలేకపోయాయి. మూలాన్ని గుర్తించక, అడ్డ దిడ్డంగా పరుగెడుతున్న ఉద్యమాలు అభ్యుదయం ముద్రవేసుకున్నా, చివరకు ఏదో ఒక కశ్మలాన్ని నింపుకొని అదృశ్య మవుతున్నాయి.

సమాజ రుగ్మతలను, మనిషి అధీనతకు– నిస్సహాయతకు మూలాన్ని గుర్తించ టంలోనే హేతువాద ఉద్యమం విజయవంతమైంది. ఆధునిక విజ్ఞానశాస్త్ర ఆవిష్కరణలు ఆలంబనగా జీవన తత్వాన్ని అందించాలనే అవగాహన దీని హోదాను పెంచింది. శాస్త్రీయ పునాది, అవగాహన లేని ఉద్యమాలు ఆచరణలో విఫలమయ్యేవే గాని మానవాభ్యుదయానికి ఉపకరించలేవు. భావవాదాలు 'మనిషి' ని ప్రాతిపదిక చేసుకోతేదు కాబట్టి అవి సత్యానికి దరిదాపులకే చేరలేవు. అందుకే అవి అజ్ఞానంలో కూరుకుపోయాయి. హేతువాదం భౌతిక వాస్తవికత ఆధారంగా సాగే ఆలోచనా వైఖరిగాన ఇందులో పొరపాట్లు ఉండవచ్చుగాని అజ్ఞానం ఉండదు. నిరంతరం మార్పునాహ్వానించేది గాన మానవజీవనం నిత్యనూతనంగా కొనసాగటానికి ఉపకరిస్తుంది.

జీవన రంగాలన్నింటిలో మత శక్తులు పునరుజ్జీవనం పొంది కలుషితం చేశాయి ఈనాడు. మతాభిమాన స్థాయిని దాటి దురభిమానంతో ఛాందసాన్ని ప్రదర్శిస్తున్నాయి.మత ఛాందసం వ్యక్తులను అజ్ఞానంలోకి నెట్టడమే గాక సామూహిక జనసంహార దిశలోకి నడుస్తున్నది. శాస్త్రీయ దృష్టి కొరవడి అదంటే ఏమిటో కూడా అర్థం కాని పాలకులు, ప్రజలుఉన్న సమాజం మన కార్యక్షేత్రం. మనది ఎదురీత. ఎవరి సంక్షేమానికి మనం పాటు పడుతున్నామో వారే ఆలకించని స్థితి నేటిది. దీనికి మూలం సాంస్కృతిక వెనుకబాటు తనం, అంధమూఢ మతవిశ్వాసాల ఆధిక్యత. వాటిని ఏ మేరకు పలుచన చేయగలుగుతామో ఆ మేరకు సామాజికులను మనుషులను చేసినట్లే.ఆ మేరకు మన ఉద్యమం సఫలమైనట్లే.

ఈ స్థితికి కావలసింది సాంస్కృతిక క్షాళన. దానికి మనం సాధనంగా ఉపయోగించాల్సింది భావవిప్లవం. మనిషిని మార్చితే మార్పు సాధ్యం కాని, అధికారాన్ని మార్చితే మన లక్ష్యం సాకారం కాదు. మనకు అధికార రాజకీయాల కన్నా సాంస్కృతిక భావవిప్లవం ప్రధానం కావాలి. మనం నేడు ఆ దిశలోనే నడుస్తున్నాం. 'దైవ వ్యతిరేకతకే పరిమితమైంది హేతువాద ఉద్యమమనే' సంకుచిత ఆరోపణను దాటి ఎంతో ముందుకు జరిగాం. మానవవాదమే హేతువాద లక్ష్యమనే భావాన్ని సఫలీకృతంగా గుర్తింపచేయగలిగాం. అది మన మనో స్థైర్యాన్ని

ఎంతో పెంచింది.

ప్రజాస్వామ్య, లౌకిక స్ఫూర్తి కొరవడిన నేటి మత సమాజంలో మన వంటి సంప్రదాయ విరుద్ధ ఉద్యమాలకు ప్రతిఘటన అధికం. వివేకోద్యమాలకన్నా, అధికార, ఆర్థిక లబ్ధి చేకూర్చే ఉద్యమాల పట్ల అధికంగా ఆకర్షితులయ్యే సమాజంలో మన మనుగడ ఇతరులు ఊహించినంతగా ప్రజాదరణ పొందలేక పోవచ్చు. రాశికన్నా వాసి ముఖ్యమనే అవగాహనతో మనం ముందుకు సాగాలి గాని నిరాశతో చతికిలపడరాదు. పురాణాలనే శాస్త్రాలుగా, శాస్త్రాలను బూతులుగా భావించే విద్యాధికులలో వాస్తవరీతిలో ఆలోచించే శాస్త్రీయ దృక్పధాన్ని కల్గించాలి. నిరంతర ఆర్థిక సమస్యలతో సతమత మయ్యే మధ్య తరగతి జీవులను మన ఉద్యమం పట్ల సానుకూలురయ్యే వాతావరణం సృష్టించుకోవాలి. అపుడే మన ఉద్యమాలకు పునాది ఏర్పడినట్లు.

మన ధ్యేయం మానవవాదం. మనిషి స్వేచ్ఛా పరుడుగా ఏ మేరకు మారుతాడో ఆ మేరకు సమాజం పురోగమించినట్లే. స్వేచ్ఛ అంటే మన భావనలో మతం, కులభావాలనుండి విముక్తులై స్వతంత్ర ఆలోచన చేయగల స్థితి. అంటే భౌతిక బానిసత్వంతో పాటు 'భావ బానిసత్వం' నుండి బయట పడాలి. ఆలోచన మతస్థునిగా గాక 'మనిషి' గా చేయగలిగించాలి. అప్పుడే విలువలు మానవికాలవుతాయి. నీతి మానవనీతి అవుతుంది. సమాజం లౌకిక సమాజమౌతుంది. మన ధ్యేయం లౌకిక సమాజమేగాని లౌకిక రాజ్యం కాదు. ఆ స్థితిని చేరినపుడే మనం మన లక్ష్యాన్ని సాధించటంలో విజయవంతమైనట్లు.

జ్ఞానం, సత్యం, స్వేచ్ఛ, లౌకికనీతి మానవ విలువలుగా నడవాలి. స్వేచ్ఛా పిపాస ప్రజలలో కలిగించాలి. ఆనాడు ఎవ్వరూ ఎవ్వరికీ ఓటు బ్యాంకులుగా, ప్రాణత్యాగం చేసే వీరులుగా ఉండరు.సామాజిక న్యాయం , లౌకిక సమాజం, మానవనీతి, శాస్త్రీయ దృక్పధంతో కూడిన జీవనతత్వం, భిన్న విలువలు విశ్వమానవ సమాజ విలువలతో నడిచి మానవస్వామ్యాన్ని సాధించాలి. అది ఎంతో దూరంలో లేదనే ధృడచిత్తంతో ముందుకు నడుద్దాం.

భారతహేతువాద సంఘానికి వెన్నెముకగా,విశేష విజ్ఞానాన్ని, సాహిత్యాన్ని సృష్టించి మేధావుల నిలయంగా ఉంది నేటి ఆంధ్రప్రదేశ్ హేతువాదసంఘం. స్థాపక అధ్యక్షులు ఉద్యమ సారథి రావిపూడి వెంకటాద్రి ఉద్యమ వ్యాప్తికి చేసిన సేవ వెలకట్టలేనిది. వారి మార్గదర్శకత్వం ఈ సంఘ పటిష్టతకు ఎంతో దోహద పడింది.ఎంతో మానసిక శ్రమ కోర్చి 'హేతువాది' పత్రిక నిర్వహణే ఉద్యమానికి జీవం పోస్తుంది. వారికి ధన్యవాదాలు అందిద్దాం.

గత 25 సంవసత్సరాలలో ఉద్యమవ్యాప్తికి విశేష కృషి చేసిన పెద్దలకు, బాధ్యులకు నేడు ఎంతో క్రియాశీలంగా సంఘానికి సారధ్యం వహిస్తున్న అధ్యక్షులు పెన్మెత్స సుబ్బరాజు గారికి, ప్రధాన కార్యదర్శి మేడూరి సత్యనారాయణ గారికి ఇతర సంఘ బాధ్యులకు- ఆర్థిక, హార్దిక మేధోపర సహకారం అందించి సంఘ పటిష్టతకు ఊతం అందిస్తున్న మిత్రులకు, కార్యకర్తలకు అభినందనలు.

**ఈ సంఘం ద్విగుణీకృతం, బహుదిగుణీకృతం కావాలని ఆశిస్తూ నమస్సులతో**

**కుర్రా హనుమంతరావు**, అధ్యక్షులు, భారత హేతువాదసంఘం.

# సందేశం - 4

హేతువాదమన్నా "హేతువాది" పత్రిక అన్నా ముందుగా గుర్తు వచ్చేది రావిపూడివెంకటాద్రి గారు అవి రెండూ, వారి జీవితంతో ముడిపడివున్న చారిత్రకాంశాంలే. ఆయన లేకుండా అవి లేవు. 1944నుండి, అనగా పాఠశాల విద్యార్థి దశనుండి - 2004 వరకు, 60 సం॥లుగా ఆయన రచనలు చేస్తూనే వున్నారు. ఒక వైపు ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ పరిస్థితుల వత్తిడులు, మరోవైపు హేతువాద సంఘ పురోభివృద్ధి- "హేతువాది" ప్రచురణ, ఇంకో వైపు, హేతువాద, మానవవాద సాహిత్య సృష్టి, శరపరంపరగా వెలువరిస్తూ, వెంకటాద్రిగారి 80 సం॥ల జీవిత కాలంలో మనం జరుపుకునే, నేటి రజతోత్సవం, కేవలం ఒక మైలురాయి, మాత్రమే. కానీ, వారు సాహిత్య జీవితంలో ఎన్నో మైలురాళ్ళను అధిగమించారు. అవార్డులు అందుకున్నారు. అనేక సభలు జరిపారు జరిపించారు. అన్నింటిలో ఆయన కేంద్ర బిందువుగా వ్యవహరించారు. అలాంటి మహా మనిషి ఈ నాడు మన మధ్య ఒక సాదాసీదా వ్యక్తిగా మనకు దర్శనమిస్తాడు. అదే వారి విశిష్ట వ్యక్తిత్వం. తాను గొప్పవాడినని ఎప్పుడూ చెప్పుకోలేదు. ఆయనకు సిరిసంపదలు లేవు. సర్కారు హోదాలులేవు. కానీ, రాష్ట్రస్థాయిలోనేగాక, భారతహేతువాద సంఘాలతో కీలకపాత్రలు పోషించి దేశంలోనూ, విదేశాలలోను, హేతువాద, మానవవాద భావజాలాన్ని పదిలపరచి, సజీవంగా నిలిపి వుంచిన అతికొద్దిమంది మేధావుల సరసన, రావిపూడి వెంకటాద్రిగారు ప్రముఖంగా కనిపిస్తారు. వారు వెలువరించిన సాహిత్యంతో ప్రభావితులైన వారే నేటి హేతువాద సంఘ సభ్యులంతాను. వారి సాహిత్యమంతా మానవ సమాజ వికాసానికి ఎంతగానో తోడ్పడిదంటే, అతిశయోక్తి కాదేమో.

వేల సంవత్సరాలుగా సమాజాన్ని పట్టిపీడిస్తున్న అన్ని మత శక్తులపై కత్తులు నూరారు. బైబిలు, ఖురానులపై విమర్శనా గ్రంథాలు అందుకు సాక్ష్యం."వాకొక బాకుగా విసరి" పుక్కిటి పురాణాలకు పుటం బెట్టి, బ్రాహ్మణ సాహిత్యంపై తిరుగుబాటు బావుటా ఎగురవేసిన కవిరాజు త్రిపురనేని రామస్వామి మొదటి వ్యక్తికాగా, రావిపూడిగారు మొత్తం హైందవ సాహిత్యాన్ని హేతుబద్ధ విమర్శకు గురిచేసి,శాస్త్రీయ దృక్పథంతో, సహేతుక విమర్శనాగ్రంథాలు చాలా వ్రాశారు. ఎన్నో విజ్ఞాన శాస్త్రగ్రంథాలను మాతృ భాషలో భావితరాలకందించిన ఘనత వారికే దక్కుతుంది. ఇవిగాక సిద్ధాంత పరమైన గ్రంథాలు ఎన్నో వారి కలం నుండి వెలువడ్డాయి.

మానవసమాజం, హేతుబద్ధ ప్రయాణానికి - మార్గం సుగమం చేసిన, ఆ మహా ఋషి - మన వెంకటాద్రి."ఎందెందు వెదకి చూచిన, అందందే గలడన్న నానుడి - వెంకటాద్రిగారి రచనలంతటా వారి హేతువాద దృక్పథం - వారి సొంతమైన ప్రత్యేకమైన శైలిలో మనకు కొట్టవచ్చినట్లు కనిపిస్తుంది. హేతువాద సంఘ రజతోత్సవ వేడుకల సందర్భంగా ఈ మహామనీషి సేవలకు అభినందనలు అర్పించకుండా వుండలేము. వారికివే మన అభివందనాలు. ఈ వివేకసాహిత్య పథంలో వారికెందరో హేతువాద మిత్రులు అండగా నిలిచారు. వారందరి సేవలు ఈ సందర్భంగా కొనియాడదగియున్నవి.

రాష్ట్ర హేతువాద సంఘం, నేడు యువకుల సారథ్యంలో మరింత వేగంగా, ముందడుగు వేస్తూనే వుంటుందని ఆశిద్దాం. హేతువాద మిత్రులందరికి అభినందనలు.

చుండూరు వెంకటేశ్వర్లు.

# సందేశం - 5

హేతువాద మిత్రులారా!

ఆంధ్రప్రదేశ్ హేతువాదసంఘం రజతోత్సవ సభలు 2004 జూన్ 4,5,6 తేదీల్లో ఒంగోలు పట్టణాన జరుగుతవని 'హేతువాది'లో చూసి ఆనందించి, ముందస్తుగా మీకు నా అభినందనలు అందజేస్తున్నా...

డా॥ మలయశ్రీ
కరీంనగర్,

---


**రజతోత్సవాల తరుణంలో విడుదల అవుతున్న రావిపూడి రచనలు**

1. **హేతువాదం** రూ. 150/-
   **సిద్ధాంత సంబంధమైన రచనల సంపుటి**
   **పేజీలు. 352**

2. **మనుస్మృతి మైనస్ అశుద్ధం** రూ. 75/-
   **మనువాదులపై తీవ్రమైన విమర్శ**
   **పేజీలు. 152**

3. **REASON AND UNREASON** Rs. 50/-
   **Collection of Lecturers**
   **Pages. 90**

**హేమా పబ్లికేషన్స్, చీరాల - 523 155.**

కాపీలకు: **రావిపూడి వెంకటాద్రి**
**ఎడిటర్, హేతువాది, చీరాల - 523 155.**
**ఫోన్ : 08594 - 233403**

ఎడిటోరియల్

ఆంధ్రప్రదేశంలో కనీసం మూడు నాలుగు శతాబ్దాలుగా హేతువాద పునాదులుంటూ వచ్చాయి. గత శతాబ్ది ప్రథమ పాదంలోని మేధావులు దాన్ని నిలదొక్కడానికి ప్రయత్నించారు. భారతహేతువాద సంఘం డా॥ఎ.టి. కోవూర్ పర్యటనను ఏర్పాటు చేయడంతో ఇక్కడి హేతువాదులు కదలబారారు. చార్వాక పత్రిక అధ్వర్యాన తోటకూర వెంకటేశ్వర్లు విజయవాడలో అధ్యయన తరగతులు నిర్వహించడంతో సంఘం యేర్పాటుకు భూమిక ఏర్పడింది. ఫలితంగా ఏలూరులో భారీస్థాయిలో జరిగిన మహాసభలో భారతహేతువాద సంఘానికి అనుబంధంగా ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘం ఉనికిలోకి వచ్చింది. రాజమండ్రిలో ద్వైవార్షిక మహాసభల సందర్భంగా సోకిన బాలారిష్టాన్ని చీలిక శస్త్ర చికిత్సతో నివారించుకున్న ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘం నిర్నిరోధకంగా వివేక పథాన నడుస్తూ 2004 జూన్ 4,5,6 తేదీలలో రజతోత్సవాన్ని జరుపుకోవడం ప్రగతి కాముకులందరూ సంతోషించదగిన విషయం. ఇది ఇంతటితో ఆగక, స్వర్ణోత్సవాలతో, వజ్రోత్సవాలతో సరిపెట్టుకోక, చిరకాలం కొనసాగాలని నేను కోరుకుంటున్నాను.

ఆంధ్రప్రదేశ్ హేతువాదసంఘం హ్యూమనిస్టు మార్గాన్ని ఎన్నుకొన్నది. మానవుడి విజ్ఞానం వికసించే కొలది హ్యూమనిస్టు మార్గం కూడా పరిణామం చెందుతుంది. నేనులోగా చెప్పుకుంటూ వస్తునట్లు "ఏదీ తుదిమాటకాదు". హేతువాదం చిరంతనమైన మెధడాలజీ - ఆలోచనా విధానం మాత్రమే. దీన్ని కొనసాగించడానికి ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘానికి చేదోడు వాదోడుగా "హేతువాది" మాసపత్రిక నడుస్తోంది. హేతువాద మానవవాద రచయితల గ్రంథాలను ప్రచురించడానికి "హేమాపబ్లికేషన్స్" ఉంది. ముఖ్యంగా ప్రచురణలకు ఆర్థిక సహాయం అందించడానికి "హేమా ఫౌండేషన్" ఉంది. కార్యాలయ కేంద్రంగా, రికార్డురూమ్‌గా ఉపయోగపడగల "రాడికల్ హ్యూమనిస్టు సెంటర్" ఇంకొల్లు (ప్రకాశంజిల్లా)లో ఉంది. వీటన్నిటినీ సమర్ధవంతంగా నిర్వహించుకోగల సారథులు ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘంలో ఉన్నారు. ఈ సంఘంలో జిజ్ఞాసువులకు, రచయితలకు, వక్తలకు, కార్యకర్తలకు కొరతలేదు. మానవసంఘాన్ని క్రింది నుంచి మరమ్మత్తు చేయాలనీ, అందుకు తగిన సమయం తీసుకోవాలనీ, హేతువంతంగా ఆలోచించగల శక్తీ మానవతతో నడుచుకోగల తీరూ ప్రతిమనిషిలోనూ కలదనీ, ఎవరి భవిష్యత్తుకు వారు కర్తలుగా - ఎవరి చర్యలకు వారు బాధ్యులుగా మనుషుల్ని తీర్చడం కష్టమైనా, అసాధ్యం కాదనీ, అందువల్ల ఆ బాధ్యతను హేతువాదులు స్వీకరించడం వారి చారిత్రక బాధ్యత అనీ నేను భావిస్తున్నాను. మనముందటి వారు మనకెంతో విజ్ఞానాన్ని, సుహృద్భావాన్ని అందించారు. మన వారసులకు కూడా అలాంటి దాన్నే అందించడం ప్రతి మానవుడి బాధ్యత కాగా, అది హేతువాద మానవవాదుల బాధ్యత మాత్రం ఎందుకు కాదు?

- రావిపూడి వెంకటాద్రి.

# మతగ్రంథ స్థానములో భారత సంవిధానముపై ప్రమాణము చేయుట

భారత సంవిధానం 1950 ఒక మతాతీత గ్రంథము. సంవిధానం అమలుకు వచ్చినప్పటినుంచి అందులోని విషయములే దేశప్రజాజీవిత విధానాన్ని ప్రభావితం చేయుచున్నవి.

భారత సంవిధానములో 22 భాగములు ఉన్నవి. మొదటి భాగము దేశవిస్తరణను గురించినదైతే, రెండవ భాగము పౌరసత్వం గురించినదై ఉన్నది. మూడవ భాగము చాలా ప్రధానమైనది. ప్రజలకు ఉండు ప్రాథమిక హక్కులనన్నింటిని ఉదహరించిన ఈ భాగమందలి హక్కులను ప్రభుత్వములు విధిగా పరిరక్షించవలెను. ఆ విధముగా పరిరక్షింపక పోయినా లేక ప్రాథమిక హక్కులకు భిన్నముగా ఎవరైనా ప్రవర్తించినా సర్వోన్నత న్యాయస్థానము మరియు రాష్ట్ర హైకోర్టులు వాటిని అమలుపరచవలసినదిగా ప్రభుత్వములను ఆదేశించగలవు. నాల్గవ భాగములో ప్రభుత్వములు ప్రజల సంక్షేమం కొరకు అనుసరించవలసిన చర్యలకు సంబంధించిన మార్గదర్శక సూత్రములు కలవు. అయితే, దేశ సుపరిపాలన విధములో ప్రజల బాధ్యతలను గుర్తింపు చేయు భాగము 4 (ఎ) తదుపరి భాగములు 5,6 ల యందు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వముల స్వభావం, పార్లమెంట్ కూర్పు మరియు బాధ్యతలు, అదే విధముగా రాష్ట్రశాసన సభల కూర్పు, వాటి బాధ్యతలు, ఆ సభలు అనుసరించవలసిన విధానములు బడ్జెట్ ఆమోదం మరియు సర్వోన్నత న్యాయస్థానము, రాష్ట్ర హైకోర్టుల విచారణా పరిధుల మొదలైన అంశములుకాగా 7వ భాగములో యూనియన్ టెరిటరీల పరిపాలన సంబంధించిన అంశములు ఉన్నవి. 9 మరియు 9(ఎ) భాగములు, పంచాయితీలు, మునిసిపాలిటీల పరిపాలనకు సంబంధించినవై ఉన్నవి. పదవ భాగములో షెడ్యూల్డ్ ప్రాంతమునందలి షెడ్యూల్డ్ తరగతుల వారి సంక్షేమం కొరకు నిర్దేశించిన అంశములు ఉన్నవి. ఇక, 11,12 భాగములలో రాష్ట్రములకు, యూనియన్‌కు పరిపాలనా విధానంలో ఉండు సంబంధములు వివరణ ఉండగా 12వ భాగములో ఆర్థిక అంశములపై వివరణలు ఉన్నవి. 13వ భాగములో అంతర్ రాష్ట్ర వ్యాపార సరళిని గురించి, 14వ భాగములో కేంద్ర, రాష్ట్రముల ప్రభుత్వోద్యోగుల గురించిన అన్ని వివరములు ఉన్నవి. 15వ భాగములో ఎన్నికలను గురించి వివరములు, ఎన్నికల ముఖ్య అధికారికి గల బాధ్యతలు, హక్కుల వివరములు ఉన్నవి. 16వ భాగములో షెడ్యూల్డ్ కులముల, షెడ్యూల్డ్ తెగలవారికి, ఆంగ్లో ఇండియన్స్‌కు కల్పించవలసిన ప్రత్యేక రిజర్వేషన్స్‌కు సంబంధించినవై ఉన్నవి. అత్యవసర పరిస్థితులకు గురించిన అంశములు 18వ భాగములో ఉన్నవి. మిగతా భాగములలో రాష్ట్ర భాషలను గురించి రాజ్యాంగ శాసనాన్ని మార్పుచేయు అధికారములను గురించి మరికొన్ని ఇతర విషయములను గురించి అంశములు ఉన్నవి. ఈ అంశములు అమలులో అన్ని సందర్భములలోను 3వ భాగములోని ప్రాథమిక హక్కులు, 4వ భాగములోని మార్గదర్శక సూత్రములు అన్నిటి ప్రభావం, స్ఫూర్తివిధిగా ఉండవలెను. పరిపాలనా విధానములో ఎక్కడా ప్రాథమిక హక్కులు అనగా వాక్ స్వాతంత్ర్యము, వృత్తి

స్వాతంత్ర్యం దేశములో ఎక్కడైనా నివసించు అర్హత మొదలైన వాటికి ఏ మాత్రమూ భిన్న స్వరూపములుగా ఉండరాదు. వ్యక్తుల మధ్య వివక్షత పూర్తిగా నిషేధించబడినది. మతస్వాతంత్ర్యం మతాచారములకు, మత ప్రచారమునకు పరిమితమై ఉండుట గమనార్హము. మతమౌఢ్యమునకు సంవిధానములో తావులేదు. పైగా, శాస్త్రీయ దృక్పదంను ప్రోత్సహించుట ప్రభుత్వము పై ఉన్న బాధ్యత అని గుర్తించుట జరిగినది. కనుక, సంవిధానమును మతాతీతమైన గ్రంథముగా పరిగణించవలెను.

ఉన్నత అధికార బాధ్యతలను స్వీకరించు సమయమందు, కోర్టులలో సాక్ష్యమిచ్చు సమయమందు మతగ్రంథము పై ప్రమాణము చేయుట జరుగుచున్నది. కొందరు మహానుభావులు మనసాక్షిగా ప్రమాణములు చేయుటకూడా జరుగుచున్నవి. ఇపుడు, మతగ్రంథస్థానములో రాజ్యాంగ శాసన గ్రంథములను ఆదర్శముగా ఉంచుకొని ప్రమాణములను చేయుట ఉచితమై ఉన్నది.

మతగ్రంథములన్నీ పురాతన కాలమందలి దేశానికి పరిస్థితులను స్ఫృహకు తెచ్చునవే కాని ప్రస్తుత పరిస్థితులకు ఏమాత్రము సంబంధము ఉన్నవి కావు. ప్రజాతంత్ర విధానము, మానవ హక్కులు అప్పటి విధానములు కావు. ఆర్థిక, సామాజిక, సాంఘిక బానిసత్వమునకు చిహ్నములైన అప్పటి దోపిడి పరిస్థితులకు అనుగుణ్యమైన సంస్కృతిని ప్రోత్సహించునవై ఉన్నవి. అందుచేత వాటినన్నింటిని చారిత్రక గ్రంథములుగా పరిగణించవలెనేకాని పవిత్ర గ్రంథములని పూజించుట ఉచితము కాదు. ఈ కారణముల వలన కూడా ప్రమాణములు చేయు అన్ని సందర్భములందు భారత సంవిధాన ప్రాధాన్యతను గుర్తింపుచేయుట ఆవశ్యకమై ఉన్నది.

మరియు మతగ్రంథములలోని మనవాతీత, మాజిక్కులు, ప్రజల మనోభావములన న్నింటిని ప్రక్కదోవ పట్టించుటను ప్రోత్సహించును. కనుక, ఆ గ్రంథములపై ప్రమాణము చేయువారి దృష్టి అంతయు అనూహ్యమైన, అసాధ్యమైన ఊహలకూ, ప్రలోభాలకు లోబడువారినిగా చేయునేకాని సంవిధానానుసరముగా ప్రజల ఉజ్వల భవిష్యత్తుకు కార్యాచరణ రూపులుగా చేయవు.

మతగ్రంథములలో ఎక్కడా ప్రజల సమస్యల పరిష్కారములకు సహేతుకమైన సూచనలు లేవు. పైగా, వీలువెంట ధర్మాధర్మకృత్యములను ప్రోత్సహించుట తర్కశాస్త్రము సూత్రములకు ఉదాహరణములై ఉన్నవి. ఏ విధముగా ఆలోచించినా మతగ్రంథములు ఏ అంశముపైనా ప్రమాణాలుగా స్వీకరించుట సాధ్యపడదు.

పై ప్రస్తావన దృష్ట్యా ప్రమాణములు చేయవలసి ఉన్న సందర్భములన్నింటిలోను మతగ్రంథస్థానములో భారత సంవిధానమును ఉంచుట లౌకిక విధానమునకు అనుగుణ్యమై ఉన్నది. భగవత్ సాక్షిగా కాక మనఃసాక్షిగా ప్రమాణము చేయువారికి కూడా సంవిధాన స్ఫృహతో ప్రమాణము చేయుటకు అభ్యంతరం ఉండరాదు.

- యన్. కె. ఆచార్య, అడ్వకేట్, హైద్రాబాదు
భారత హేతువాద సంఘ మాజీకార్యదర్శి

# ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘ కార్యక్రమాల సమీక్ష (1979-2004)

- పెన్మెత్స సుబ్బరాజు

ఆంధ్రప్రదేశ్ హేతువాదసంఘ రజతోత్సవాలు ఒంగోలులో జరుపుకుంటున్న సందర్భంగా సంఘం ఇప్పటి వరకు నిర్వహించిన కార్యకలాపాలను క్లుప్తంగా సమీక్ష చేసుకోవడం సముచితం. ఆంధ్రప్రదేశ్‌లో హేతువాద సంఘ స్థాపనకు 50 సంవత్సరాల ముందే భారత హేతువాద సంఘ స్థాపన1931 లో జరిగింది. 1979 మే నెలలో ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘం పూర్తి స్థాయిలో ఏర్పడినప్పటికీ, అంతకుముందు పనిచేస్తున్న భారత హేతువాదసంఘంలో తెలుగువారు క్రియాశీల పాత్ర పోషిస్తూ వచ్చారు. భారత హేతువాద సంఘానికి అనుబంధంగా పనిచేస్తున్న రాష్ట్ర సంఘాల్లోను మన సంఘానిదే కీలకపాత్ర.ఇతర రాష్ట్రాల్లోని సంఘాలతో పోల్చి చూసినా అన్నింటా మనమే మెరుగ్గావున్నాం. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘ స్థాపన నాటి నుంచి నేటి వరకు సంఘ చరిత్రను, కార్యకలాపాలను పర్యావలోకనం చేద్దాం.

ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘ ఆవిర్భావం 1979లో జరిగినప్పటికీ, 1973లోనే దాన్ని లాంఛనంగా విజయవాడలో స్థాపించడం జరిగింది.విజయవాడలో స్థాపించిన సంఘానికి అధ్యక్షుడిగా లవణం, కార్యదర్శిగా ఎ.జి.కె. (అవుల గోపాలకృష్ణమూర్తి కాదు), కోశాధికారిగా బి. వేణుగోపాలరావు ఎన్నికైనప్పటికీ, కార్యకలాపాలేమీ లేక అది కాగితాలకే పరిమితమై పోయింది. అయినప్పటికీ 1975-1976 మధ్య డా॥ఎ.టి.కోవూర్ ఆంధ్రాలో జరిపిన పర్యటన వెనుక బి. వేణుగోపాలరావు కృషి వుండటంతో సంఘాన్ని వ్యాపితం చేయాలన్న అభిలాష కొద్దీ ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘం పేరు మీదనే కోవూర్ కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది. 1975-1976ల మధ్య చీరాల, విజయవాడ, వరంగల్, హైదరాబాద్, కాకినాడ, ఒంగోలు, తెనాలి, విశాఖపట్టణం, గుడివాడ, చిలకలూరిపేట మొదలైన పట్టణాల్లో జరిగిన కోవూర్ సభలకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. కోవూర్ పర్యటనకు ఏర్పాట్లు చేసి వెన్నంటి తిరిగిన వారిలో అప్పటి భారతహేతువాద సంఘ ప్రధానకార్యదర్శి అత్తలూరి సూర్యనారాయణ, ఆయన భార్య వసుంధర, బి.వేణుగోపాలరావు, తోటకూర వెంకటేశ్వర్లు, ఎమ్.వి.రామమూర్తి, మల్లాది సుబ్బమ్మ, సి.హెచ్. రాజారెడ్డి, బచ్చు వెంకటేశ్వర్లు, లవణం, విజయం, రావిపూడి వెంకటాద్రి, జయగోపాల్, గురిజాల సీతారామయ్య, పి.రాఘవరావు వంటి ముఖ్యులున్నారు. డా॥కోవూర్ ఉపన్యాసాలు, స్వామినాధన్ మ్యాజిక్, ప్రొఫెసర్ హిప్నో హిప్నాటిజం ప్రదర్శనల ఫలితంగా బాబాలు, అమ్మల మహత్యాలలోని గుట్టు బయట పడటమే గాక, మతతత్వ శక్తులకు కొంత దెబ్బ తగిలింది. ఫలితంగా ప్రజల్లో హేతువాదం పట్ల అభిమానం పెరిగింది.

1974లో ఎమ్.వి.రామమూర్తి సంపాదకత్వంలో ప్రారంభమైన 'వికాసం', 1976లో తోటకూర వెంకటేశ్వర్లు సారథ్యంలో ప్రారంభమైన 'చార్వాక' పత్రికలు ప్రజల్లో లౌకిక, హేతువాద, మానవవాద భావాల వ్యాప్తికి దోహదం చేశాయి. ఉద్యమ భావాల వ్యాప్తిలో చార్వాక పత్రిక

అమితమైన ప్రభావాన్ని చూపింది. రావిపూడి వెంకటాద్రి, సి.వి., వెనిగళ్ల సుబ్బారావు, ఈశ్వర ప్రభు, గురుకుల మిత్రా గార్ల వ్యాసాలు 'చార్వాక' పాఠకుల స్థాయిని పెంచడానికి ఉపకరించేవి. వేల సంఖ్యలో అమ్ముడు పోయిన ఆ పత్రిక రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలకు కూడ చేరింది. ఫలితంగా, 1976లోనే గుంటూరు, వనపర్తి (మహబూబ్‌నగర్‌జిల్లా), విజయవాడ, హైదరాబాదు, నెల్లూరులలో పట్టణ హేతువాద సంఘాలస్థాపన జరిగింది. చార్వాక ఆధ్వర్యంలో 1977, 1978, 1979 సంవత్సరాలలో జరిగిన అధ్యయన తరగతులు రాష్ట్రంలోని హేతువాదులందరినీ సమీకరించాయి. ఈ స్ఫూర్తితో ప్రకాశం జిల్లాలోని రావినూతల, కారంచేడు, పశ్చిమగోదావరి జిల్లాలోని ఏలూరు,గుంటూరు జిల్లాలోని పొన్నూరు, కృష్ణాజిల్లాలోని గుడివాడలలో హేతువాద అధ్యయన తరగతులు జరిగాయి. హేతువాద అధ్యయన తరగతులు జరిగాయి. 1978 నాటికి రాష్ట్రం నలుమూలలా హేతువాద సంఘాల స్థాపన జరిగి స్థానికంగా కార్య కలాపాలు సాగించనారంభించాయి.

**ఏలూరులో ప్రథమ రాష్ట్రమహాసభ (1979):**

భారత హేతువాద సంఘ ప్రధాన కార్యదర్శి అత్తలూరి సూర్యనారాయణ చేసిన కృషికితోడు, రాష్ట్ర సంఘస్థాపన అనంతరం అధ్యక్ష బాధ్యతలు స్వీకరించమని రావిపూడి వెంకటాద్రిని ఎమ్.వి. రామమూర్తి ఒప్పించడంతో ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘ స్థాపనకు మార్గం సుగమం అయింది. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన గుడిపాటి సాంబశివరావు (గుసాశి), పువ్వుల భాస్కరరావు, యాగాటి కనకరావు, ఎస్.ఆర్.సూరి, పి. హెచ్.వి.సోమయాజులు గార్ల కృషితో రాష్ట్ర స్థాయి ప్రథమ హేతువాద సంఘ సమావేశం 1979 మే 6న ఏలూరులోని వై.ఎమ్.హెచ్.ఎ. హాలులో జరిగింది. రాష్ట్రంలోని తొమ్మిది జిల్లాల నుంచి 250 మంది ప్రతినిధులు ఆ సభకు హాజరయ్యారు. ఉదయం జరిగిన సమావేశానికి పి. హెచ్.వి.సోమయాజులు అధ్యక్షత వహించగా, బెంగుళూరు యూనివర్శిటీ మాజీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ హెచ్. నరసింహయ్య ప్రారంభోపన్యాసం చేశారు. అనంతరం భారత హేతువాద సంఘ ప్రధాన కార్యదర్శి ఎ. సూర్యనారాయణ హేతువాదం అవశ్యకతపై ప్రసంగించారు. మధ్యాహ్నం జరిగిన సభకు భారత హేతువాద సంఘ ఉపాధ్యక్షుడు ఎమ్.వి.రామమూర్తి అధ్యక్షత వహించగా వివిధ జిల్లాల ప్రతినిధులు తమ కృషిని వివరించారు. సాయంత్రం జరిగిన బహిరంగసభలో ఎమ్.వి.రామమూర్తి, రావిపూడి వెంకటాద్రి, కత్తిపద్మారావు, వెనిగళ్ల సుబ్బారావు,గోడా సత్యనారాయణమూర్తి, ఎమ్.వి.రమణారెడ్డి తదితరులు ఉపన్యసించారు. ఆ ప్రథమ మహాసభకు రాష్ట్రం నలుమూలల నుంచే గాక కర్ణాటక, తమిళనాడు వంటి పొరుగురాష్ట్రాల నుంచి కూడ ప్రతినిధులు హాజరయ్యారు. రావిపూడి వెంకటాద్రి అధ్యక్షుడిగా,పువ్వుల భాస్కరరావు ప్రధాన కార్యదర్శిగా కొత్తగా స్థాపించిన ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘాన్ని భారత హేతువాద సంఘానికి అనుబంధంగా నడపాలని ఆనాడే నిర్ణయించడం జరిగింది.

రాష్ట్ర సంఘ ఏర్పాటు అనంతరం నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణా, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, మెదక్‌జిల్లా సంఘాల నిర్మాణం జరిగింది. నరసరావుపేట హేతువాద

సంఘం తరుపున నజీర్ అహ్మద్ 'హేతువాదదర్శిని' పేరుతో సైక్లోస్టయిల్ పత్రికను నడిపారు. ఇలా ఎందరో కృషి చేయగా కార్యకర్తల ఉత్సాహంతోడై ఉద్యమం బలపడింది.

**ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘ ప్రథమ కార్యవర్గం:**

గౌరవ అధ్యక్షుడు: **డా॥ పి.యం. భార్గవ**, హైదరాబాదు.

కార్యనిర్వాహక అధ్యక్షుడు: **రావిపూడి వెంకటాద్రి**, నాగండ్ల.

ఉపాధ్యక్షులు: **శ్రీమతి మల్లాది సుబ్బమ్మ**, హైదరాబాదు. కత్తి పద్మారావు, పొన్నూరు.

ప్రధాన కార్యదర్శి: **పువ్వుల భాస్కరరావు**, ఏలూరు.

సంయుక్త కార్యదర్శులు: **శివలెంక వెంకటేశ్వర్లు**, ఏలూరు, **ఎన్.రామారావు**, రామచంద్రపురం.

**కార్యవర్గ సభ్యులు:**

1. ఎన్.చలమయ్య, కొడిపల్లి (మెదక్)
2. గుడిపాటి సాంబశివరావు (గుసాశి), ఏలూరు.
3. వెనిగళ్ల సుబ్బారావు, రేపల్లె.
4. గణేశ్వరం బాబూరావు, గుడివాడ.
5. ఎస్.విజయరత్నకుమారి, నిడదవోలు.
6. తుమ్మల గోపాలకృష్ణయ్య, సత్తెనపల్లి.
7. కొండవీటి వెంకట కవి, నిడుబ్రోలు.
8. పి.హెచ్.వి. సోమయాజులు, ఏలూరు.
9. గోడా సత్యనారాయణమూర్తి, ఏలూరు.
10. అట్లూరి పూర్ణచంద్రరావు, నిడదవోలు.
11. పి.భీమన్న, నెల్లూరు.
12. ఎ.వసుంధర, మద్రాసు.
13. శివలెంక గిరిజ, ఏలూరు.
14. ఎం.వి.రమణారెడ్డి, ఏలూరు.
15. కదలి శ్రీరామమూర్తి, భీమవరం.
16. పి.ఆశాలత, వీరుళ్లపాడు.
17. ఇ.రుక్మిణమ్మ, గరికపాడు (గుంటూరుజిల్లా)

వీరు కాక భారత హేతువాదసంఘ ఉపాధ్యక్షుడు ఎం.వి. రామమూర్తి, ప్రధాన కార్యదర్శి ఎ.సూర్యనారాయణ గార్లను ఎక్స్ అఫీషియో సభ్యులుగాను, ప్రకాశంజిల్లా నాగులపాలెంకు చెందిన కొల్లా సుబ్బారావును జీవితకాల సభ్యుల ప్రతినిధిగాను ఎంచడం జరిగింది.

ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘ ఆవిర్భావానికి అంతకు ముందు జరిగిన పలు అధ్యయన తరగతుల్లో పాల్గొన్న రావిపూడివెంకటాద్రి, కత్తి పద్మారావు, ఈశ్వరప్రభు, సి.వి., ఎన్.వి. బ్రహ్మం, బి.వి. నరసింహారావు, త్రిపురనేని వెంకటేశ్వరరావు, ఏటుకూరి బలరామమూర్తి, కల్లూరి బసవేశ్వరరావు, జ్వాలాముఖి, వెనిగళ్ల సుబ్బారావు, కొండవీటి వెంకటకవి, డా॥జి.విజయం, ఎమ్.వి.రామమూర్తి, టి.ఎల్. నారాయణ, కదలి శ్రీరామమూర్తి, గణేశ్వరం బాబూరావు, డా॥ఎన.ఇన్నయ్య, ఎస్.ఎ.బక్ష్, ఎన్.కోమల; ఎం. బసవపున్నారావు, కె. విజయలక్ష్మి, లవణం, హేమలతా లవణం, జి. సూర్యకుమారి, పోలు సత్యనారాయణ, వాసమూర్తి, మల్లాది సుబ్బమ్మ, కోగంటి రాధాకృష్ణమూర్తి, కొల్లా సుబ్బారావు, గామాగో (సుబ్బారెడ్డి), శ్రీశ్రీ, తుమ్మల గోపాలకృష్ణయ్య, డా॥జి. సమరం, గోపరాజు సాంబశివరావు వంటి పలువురు ప్రముఖుల ప్రసంగాలు ప్రేరణగా నిలిచాయి. రావిపూడి వెంకటాద్రి ఉపన్యాసాలు పట్టణ ప్రాంత ప్రజలను, కత్తి పద్మారావు ఉపన్యాసాలు గ్రామీణ ప్రాంత ప్రజలను బాగా ఆకట్టుకొనేవి. వెనిగళ్ల సుబ్బారావు ప్రసంగాలు మిశ్రమ ఫలితాల నిచ్చేవి.

## ద్వితీయ రాష్ట్ర మహాసభ - రాజమండ్రి:

1981మే, 9,10 తేదీలలో తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో రాష్ట్ర ద్వైవార్షిక మహాసభలు విజయవంతంగా జరిగాయి. వీటి నిర్వహణలో గాదె పుల్లేశ్వరరావు, నందెపు వెంకటరావు, ఎస్.ఎ.బక్ష్, జిల్లా సంఘ అధ్యక్షుడు ఎన్.రామారవుగార్ల కృషి వుంది. ఈ సభలకు రావిపూడి వెంకటాద్రి అధ్యక్షత వహించగా, అప్పటి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి బి.పి.జీవన్‌రెడ్డి మహాసభను ప్రారంభించారు. భారత హేతువాద సంఘ ఉపాధ్యక్షుడు జోసెఫ్ ఎడమరుకు ఎస్.వి.రావు సంపాదకత్వాన వెలువడిన "హేతువాదం" మాసపత్రిక తొలిసంచికను ఆవిష్కరించారు.

రెండో రోజు జరిగిన సభలో రావిపూడి వెంకటాద్రి సంఘ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, ప్రధాన కార్యదర్శి పదవి కోసం రెండు వర్గాలు తలపడ్డాయి. రాజీ ప్రతిపాదనలో భాగంగా గాదె పుల్లేశ్వరరావు (రాజమండ్రి)ను కార్యనిర్వాహక కార్యదర్శిగాను, కత్తిపద్మారావు (పొన్నూరు)ను ప్రధాన కార్యదర్శిగాను ఎన్నుకోవడం జరిగింది.

## సంఘంలో చీలిక:

రావిపూడి వెంకటాద్రి మార్క్సిస్ట్ వ్యతిరేక రచనలపై రాజమండ్రి సభలో కొంత వివాదం తలెత్తింది. 1981 సెప్టెంబరు 27న విజయవాడలో జరిగిన కార్యవర్గసమావేశంలో ఆవివాదం పెద్దదైంది. తన రచనలపై వచ్చిన విమర్శలకు రావిపూడి వెంకటాద్రి "తన రచనల పట్ల ఎవరికైనా అభ్యంతరాలుంటే ప్రతి విమర్శ చేయవచ్చునీ, హేతువాదులు మార్క్సిజాన్ని విమర్శించరాదని పరిమితులు విధించడమంటే ఏ గ్రంధాన్ని విమర్శించడానికైనా హేతువాదులకు హక్కులేనట్లే" అని సమాధానమిచ్చారు. అంతటితో ఆ సమావేశం ముగిసినా వివాదం మాత్రం సద్దుమణగలేదు.

ఆ రోజుల్లో హేతువాద ఉద్యమం పట్ల యువకులు ఎక్కువగా ఆకర్షితులవడం చూసిన కొందరు మార్క్సిస్టులు తమ అనుచరులు కొందరు దూరమయ్యే ప్రమాదాన్ని శంకించి తమ ఉపన్యాసాల్లోను, వ్యాసాల్లోను, పుస్తకాల్లోను హేతువాదాన్ని, నాస్తికత్వాన్ని ఘాటుగా విమర్శించనారంభించారు. హేతువాద, నాస్తిక సంఘాల్లోని కొందరు అంతే ఘాటుగా వాళ్లకు సమాధానాలు వ్రాశారు. ఆ విమర్శలూ, ప్రతి విమర్శలూ కూడ మార్క్సిస్టు దృకోణం నుంచే జరిగాయి. భారత హేతువాద సంఘం ఏర్పడిన తొలిరోజుల్లో దానిలో ఒక్క మార్క్సిస్టూ లేదు. కమ్యూనిస్టు పార్టీల్లోను, రాజ్యాల్లోను నియంతృత్వమే కనిపిస్తుంది. హేతువాదం దానికి పూర్తి వ్యతిరేకం. హేతువాదానికి ప్రాణం స్వేచ్ఛ. దాని లక్ష్యం మానవవాదం. స్వేచ్ఛా వాదానికి అనుగుణమైన మానవవాదం నియంతృత్వానికి అనుకూలమైన మార్క్సిజాన్ని ఆమోదించడానికే వీలులేదు. భారత హేతువాద సంఘం 1974లో అంతర్జాతీయ మానవవాద నైతిక సంఘానికి అనుబంధమైంది. భారత హేతువాద సంఘ ప్రధాన కార్యదర్శి అత్తలూరి సూర్యనారాయణ 1976లో ఎమర్జన్సీని సమర్థిస్తూ 'ఫ్రీథాట్' పత్రికలో సంపాదకీయం వ్రాసినందువల్ల ఆ అనుబంధం 1978లో రద్దయింది. రావిపూడి వెంకటాద్రి చొరవ తీసుకొని కృషి సల్పడంతో

కొద్ది కాలానికి ఆ అనుబంధం పునరుద్ధరించబడి, భారత హేతువాద సంఘానికి అంతర్జాతీయ మానవవాద నైతిక సంఘంలో ఓటు హక్కుతో కూడిన పూర్తి స్థాయి సభ్యత్వం లభించింది.

రావిపూడి వెంకటాద్రి మార్క్సిస్టు వ్యతిరేక రచనలపై అసంతృప్తి వ్యక్తం చేసిన ఒక వర్గం రాజమండ్రి సమావేశాల్లోనే సంఘాన్ని చీల్చడానికి చేసిన ప్రయత్నం విఫలమైంది. విజయవాడ సమావేశం అనంతరం అసమ్మతి వాదులంతా 1982 జూన్ 4న గుంటూరులో మరో సమావేశం నిర్వహించి పోటీ సంఘాన్ని స్థాపించారు. రెండో సమావేశం జరిగే నాటికి కొందరూ, మూడో సమావేశం జరిగేనాటికి మరికొందరూ దానికి దూరమై పోగా, ఇంకొందరు తటస్థంగా వుండిపోయారు. మార్క్సిస్టు అనుకూల ధోరణితో ఆంధ్రప్రదేశ్ హేతువాదసంఘంలో చీలిక తెచ్చిన గ్రూపులో ఇతర రాజకీయ పార్టీల వారు కూడా వుండటం, మార్క్సిజం కొమ్ముకాసి సంఘాన్ని చీల్చిన నాయకులు తదనంతరం ఇతర రాజకీయ పార్టీల్లోకి వలసలు పోవడం మరో విచిత్రం. ఈ చీలిక కారణంగా రావిపూడి వెంకటాద్రి తన సంపాదకత్వంలో **'హేతువాది'** పేరుతో 1982లో పత్రిక స్థాపించి దాన్ని ఉద్యమ పత్రికగా తీర్చి దిద్దారు. 1981లో ఎస్.వి.రావు సంపాదకత్వాన ప్రారంభమైన 'హేతువాదం' పత్రిక నరసరావుపేట,పొన్నూరు, విజయవాడ, ఖమ్మం, భద్రాచలం వంటి పలు ఊళ్లు తిరిగి అనేక మంది సారథ్యంలో నడిచి కొద్ది నెలల విరామంతో ప్రచురిత మవుతూ ఆగిపోయింది. 'హేతువాది' పత్రిక మాత్రం 1982 నుంచీ క్రమం తప్పకుండా వెలువడుతూనే వుంది. తెలుగు అకాడమీ వారి కోరిక మేరకు "ఆంధ్రప్రదేశ్‌లో హేతువాద, మానవవాద ఉద్యమాల చరిత్ర" పుస్తకం వ్రాసే క్రమంలో ఆనాటి చీలిక వర్గంలో ప్రముఖుడైన ఈశ్వరప్రభును విజయవాడలోని ఆయన స్వగృహంలో ఈ వ్యాసకర్త కలవడం జరిగింది. సంఘంలో చీలిక తేవడంతాము చేసిన తప్పిదమనీ, చీలిక వర్గాన్ని నడిపించిన కొందరు నాయకులు ఆనాడు రావిపూడి వెంకటాద్రితో జరిపిన ఉత్తర ప్రత్యుత్తరాలను తమకు పూర్తిగా చూపకుండా లేనిపోనివి కల్పించి చెప్పి, తమరిని తప్పుదోవ పట్టించారని ఆయన మాతోచెప్పి బాధ పడ్డారు. (ఆనాడు నాతోపాటు ఈశ్వరప్రభును కలిసిన వారిలో మిత్రులు చార్వాక వెంకటేశ్వర్లు, ఎం.బసవపున్నారావు ఉన్నారు.) మొత్తం మీద ఆనాడు హేతువాద సంఘంలో కొందరు తెచ్చిన చీలిక రాష్ట్ర స్థాయిలో సంఘం కొంత బలహీనపడి, కార్యకలాపాలు కొద్దిగా కుంటుపడటానికి కారణమైంది. చీలిక సమయంలో ముఖ్యపాత్ర పోషించిన అప్పటి ప్రధాన కార్యదర్శి కత్తి పద్మారావును తాత్కాలిక ప్రధాన కార్యదర్శిగా ఎంపిక చేయడం జరిగింది. కమ్యూనిస్టుల ఎత్తుగడలపై పూర్తి అవగాహన వున్న మాజీ సోషలిస్టు కావడంతో జాన నాగేశ్వరరావు సంఘ అధ్యక్షుడు రావిపూడి వెంకటాద్రి సహకారంతో చీలిక వర్గం వారి దురుద్దేశాలను, సమావేశాల నిర్వహణ ద్వారా సంఘానికెదురైన ఇబ్బందికర పరిస్థితులను అధిగమించి పలువురి మన్ననలందుకున్నారు. అప్పట్లో జాన నాగేశ్వరరావును హేతువాద ఉద్యమానికి పరిచయం చేసిన ఘనత పశ్చిమ గోదావరిజిల్లా, పాలకొల్లు పట్టణ హేతువాద సంఘ స్థాపకుల్లో ఒకరైన టి.ఎస్.రాజుకే దక్కుతుంది.

రాష్ట్ర సంఘ తృతీయ ద్వైవార్షిక సభలు పశ్చిమ గోదావరిజిల్లా భీమవరం పట్టణంలో

1983 మే 14,15 తేదీలలో జరిగాయి. ప్రముఖ రచయిత్రి వాసిరెడ్డి సీతాదేవి ముఖ్య అతిధిగా హాజరైన ఆ సమావేశాల్లో నా॥ఆవుల సాంబశివరావు, డా॥డి.బాలసుబ్రహ్మణ్యం, బి.ప్రేమానంద్ (తమిళనాడు), ఎమ్.వి. రామమూర్తి, రావిపూడి వెంకటాద్రి ఉపన్యాసకులుగా పాల్గొన్నారు. ఆ రాష్ట్ర సభల సందర్భంగా ప్రముఖుల వ్యాసాలతో "హేతువాద దర్శిని" పేర సావనీర్ విడుదల చేయడం జరిగింది. కామన్ క్రిమినల్ కోడ్ తరహాలో కామన్ సివిల్ కోడ్ రావాల్సిన ఆవశ్యకతలను వివరిస్తూ ఎమ్.వి.రామమూర్తి వ్రాసిన "సర్వులకూ ఒకే ఒక రకపు వ్యవహారసంహిత" బుక్‌లెట్‌ను పాలకొల్లు పట్టణ హేతువాదసంఘం పేరు మీద ప్రచురించి రాష్ట్ర వ్యాప్తంగా పంపిణీ చేశారు. ఆ ద్వైవార్షిక సభల్లో రావిపూడి వెంకటాద్రి మరల రాష్ట్ర సంఘ అధ్యక్షుడిగా ఎన్నిక కాగా, అప్పటి వరకు తాత్కాలిక ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించిన జాన నాగేశ్వరరావు (పాలకొల్లు) ప్రధాన కార్యదర్శి పదవికి ఎంపికయ్యారు.

నాలుగో ద్వైవార్షిక సభ 1985 జూన్ 2వ తేదీన **విజయవాడలో** జరిగింది. ఆ సభకు భారత హేతువాద సంఘ అధ్యక్షుడు సనాల్ ఎదమరుకు, కేరళ హేతువాద సంఘ అధ్యక్షుడు అబ్దుల్లా మెప్పయార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. రావిపూడి వెంకటాద్రి, కొల్లాసుబ్బారావు, జాన నాగేశ్వరరావు, గుమ్మా వీరన్న, పసల భీమన్న, మల్లాది సుబ్బమ్మ గార్లు పలు అంశాలపై ప్రసంగించారు. రావిపూడి వెంకటాద్రి తిరిగి అధ్యక్ష్యుడిగా ఎన్నిక కాగా, బి.ఎల్.ఎస్. వరప్రసాద్ (పెదన) ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు.

ఐదో ద్వైవార్షిక సభలు 1987 జూన్ 13,14 తేదీల్లో **గుంటూరులో** జరిగాయి. హైదరాబాదు సి.సి.ఎం.బి కి చెందిన సీనియర్ సైంటిస్టుగా డా॥జె.గౌరీశంకర్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఆవులసాంబశివరావు,తోటకూర ప్రభాకరరావు, మల్లాది సుబ్బమ్మ, రావిపూడి వెంకటాద్రి, గుమ్మావీరన్న, బి.ఎల్.ఎస్.వరప్రసాద్‌గార్లు వివిధ అంశాలపై ప్రసంగించారు. అధ్యక్ష కార్యదర్శులుగా తిరిగి రావిపూడి వెంకటాద్రి, బి.ఎల్.ఎస్.వరప్రసాద్‌లు ఎన్నికయ్యారు. కొద్ది కాలానికి భారత హేతువాదసంఘ అధ్యక్ష పదవికిని స్వీకరించాల్సి రావడంతో రావిపూడి వెంకటాద్రి రాష్ట్ర సంఘ అధ్యక్ష పదవి నుంచి తప్పుకోగా, 1988 ఆగస్టు 14 నుంచి రావూరి అర్జునరావు(గుడివాడ) తాత్కాలిక అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు.

ఆరో ద్వైవార్షిక సభలు 1989 మే 11 నుంచి 15 వరకు **ఒంగోలులో** జరిగాయి. బొంబాయి హైకోర్టు మాజీ న్యాయమూర్తి వి.ఎమ్.తార్కుండే వాటికి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. చుంచు శేషయ్య, ఎం. బసవపున్నారావు, అంచా బాపారావు,రావిపూడి వెంకటాద్రి, పసల భీమన్న గార్లు పలు అంశాలపై ప్రసంగించారు. సి.శేషయ్య(ఒంగోలు) రాష్ట్ర సంఘ అధ్యక్షుడిగా ఎన్నిక కాగా బి.ఎల్.ఎస్.వరప్రసాద్ తిరిగి ప్రధాన కార్యదర్శిగా ఎంపికయ్యారు. అనంతరం కొద్ది కాలానికి వ్యక్తిగత కారణాలతో సి.శేషయ్య అధ్యక్ష పదవికి రాజీనామా చేయడంతో, 1990 సెప్టెంబరు 23 నుంచి మరల తాత్కాలిక అధ్యక్షుడిగా రావూరి అర్జునరావు బాధ్యతలు చేపట్టారు.

ఏడో ద్వైవార్షిక సభలు 1991 మే 8 నుంచి 11 వరకు ప్రకాశం జిల్లా **పర్చూరులో**

జరిగాయి. ఢిల్లీ సెంట్రల్ యూనివర్శిటీకి చెందిన ప్రొ॥కె.శేషాద్రి ఆ సమావేశాలకు ముఖ్య అతిథిగా విచ్చేశారు. డా॥ఎన్.ఇన్నయ్య, గుమ్మావీరన్న, రావిపూడి వెంకటాద్రి, వై.దుర్గాప్రసాద్,కొల్లాసుబ్బారావు, అంచా బాపారావు తదితరులు వివిధ అంశాలపై ప్రసంగించారు. డా॥ఎన్.ఇన్నయ్య రాష్ట్ర సంఘ అధ్యక్షుడిగా ఎన్నిక కాగా బి.ఎల్.ఎస్. వరప్రసాద్ తిరిగి ప్రధాన కార్యదర్శిగా ఎంపికయ్యారు.

ఎనిమిదో ద్వైవార్షిక సభలు **సికింద్రాబాదులోని లోతుకుంటలో** 1993 మే 6 నుంచి 9 వరకు జరిగాయి. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలరు యం. వి.రావు ముఖ్య అతిధిగా విచ్చేశారు. డా॥పి. ప్రసంగి, డా॥ఎన్.ఇన్నయ్య, రావిపూడి వెంకటాద్రి ఎన్.కె.ఆచార్య, మల్లాది సుబ్బమ్మ, ఎస్.ఎమ్. చెల్లప్ప, ఎమ్.వి.రామమూర్తి, ప్రొ॥జె.డి.గౌడ్, డా॥ఎన్.జయప్రకాష్ నారాయణ, ఆవుల సాంబశివరావు, కోటపాటి మురహరిరావు,గుమ్మావీరన్న, బి.ఎల్.ఎస్.వరప్రసాద్, ఎన్.విక్రం గార్లు పలు అంశాలపై ఉపన్యసించారు. డా॥ఎన్.ఇన్నయ్య, బి.ఎల్.ఎస్.వరప్రసాద్‌గార్లు మరల అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికయ్యారు. కొద్ది కాలానికి డా॥ఎన్.ఇన్నయ్య అమెరికా వెళ్లాల్సి రావడంతోను, బి.ఎల్.ఎస్.వరప్రసాద్ వృత్తి పరంగా బిజీ అవడంతోను అధ్యక్ష,కార్యదర్శి పదవులనుంచి తప్పుకోవడంతో రావూరి అర్జునరావు మరల తాత్కాలిక అధ్యక్షుడిగాను, ఎస్.సిద్ధార్థ బక్ష్ తాత్కాలిక ప్రధాని కార్యదర్శిగాను 1994 నవంబరు 20 నుంచి బాధ్యతలు స్వీకరించారు.

తొమ్మిదో ద్వైవార్షిక సభలు 1995 జూన్ 2 నుంచి 4 వరకు **గుంటూరులో** జరిగాయి. రాజ్యసభ మాజీ సభ్యుడు, ఈస్టిండిస్‌లో పనిచేసిన భారత మాజీ రాయబారి ప్రొ॥సి.లక్ష్మన్న వీటికి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. రావిపూడి వెంకటాద్రి, ఎస్.రాఘవరావు, అంచాబాపారావు, పెన్మెత్స సుబ్బరాజు, ఎం.బసవపున్నారావు, ఎస్.జయరామరెడ్డి,గుమ్మావీరన్న, డా॥తోటకూర ప్రభాకరరావుగార్లు అనేక అంశాలపై ప్రసంగించారు. రాష్ట్ర సంఘ అధ్యక్ష కార్యదర్శులుగా పెన్మెత్స సుబ్బరాజు (జిన్నూరు), మేడూరిసత్యనారాయణ (ఇంకొల్లు) ఎన్నికయ్యారు.

పదో ద్వైవార్షిక సభలు 1997 జూలై 18నుంచి 20 వరకు **చీరాలలో** జరిగాయి. ప్రముఖ పత్రికాసంపాదకుడు ఎ.బి.కె. ప్రసాద్, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥జయప్రకాష్ నారాయణ ఆ సమావేశాలకు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. రావిపూడి వెంకటాద్రి, ఎన్. చక్రధరరెడ్డి, డా॥ జి.విజయం, ఎస్.రాఘవరావు, గుమ్మావీరన్న, పెన్మెత్స సుబ్బరాజు, మేడూరి సత్యనారాయణ,కుర్రా హనుమంతరావు, పసల భీమన్నగార్లు వివిధ అంశాలపై ప్రసంగించారు. రాష్ట్ర సంఘ అధ్యక్ష కార్యదర్శులుగా పెన్మెత్స సుబ్బరాజు, మేడూరి సత్యనారాయణ తిరిగి ఎన్నికయ్యారు.

పదకొండో ద్వైవార్షిక సభలు 2000 జూలై 8,9 తేదీలలో మరల **చీరాలలో** జరిగాయి. ప్రొ॥సి.లక్ష్మన్న మరో పర్యాయం ముఖ్య అతిధిగా విచ్చేశారు. కోటపాటి మురహరిరావు, మేడూరి సత్యనారాయణ. రావిపూడి వెంకటాద్రి, పెన్మెత్స సుబ్బరాజు,డా॥ మలయశ్రీ,

డా॥జి.విజయం, బి.సాంబశివరావు ప్రభృతులు వివిధ అంశాలపై ప్రసంగించారు. పెన్మెత్స సుబ్బరాజు, మేడూరి సత్యనారాయణ తిరిగి అధ్యక్ష కార్యదర్శులుగా ఎన్నికరయ్యారు.

పన్నెండో ద్వైవార్షిక సభలు 2002 సెప్టెంబరు 14,15 తేదీలలో కాకినాడలో జరిగాయి. తెలుగు అకాడమీ డైరెక్టరు డా॥డి.మంజులత, ఢిల్లీ సోషల్ డెవలప్‌మెంట్ సెంటర్ డైరెక్టరు వి.బి.రావత్, తూర్పుగోదావరిజిల్లా పరిషత్ ఛైర్మన్ దున్నా జనార్ధనరావు ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. పెన్మెత్ససుబ్బరాజు, కు(రాహనుమంతరావు, మేడూరి సత్యనారాయణ డా॥ఎన్.ఇన్నయ్య, ఎ.ప్రఫుల్లచంద్ర, ఇసనాక మురళీధర్, డా॥జి.విజయం, ఎన్.వెంకటసుబ్బయ్య, గుమ్మావీరన్న తదితరులు వివిధ అంశాలపై ప్రసంగించారు. పి.సుబ్బరాజు, మేడూరి సత్యనారాయణ గార్లనుఅధ్యక్ష కార్యదర్శులుగా తిరిగి ఎన్నుకోవడం జరిగింది.

పదమూడో ద్వైవార్షిక సభలను 2004 జూన్4,5,6 తేదీలలో రజతోత్సవ సభలుగా ఒంగోలులో జరుపుకొంటున్నాం. ద్వైవార్షిక సభల సందర్భంగానే గాక వివిధ సందర్భాల్లో పలుచోట్ల అధ్యయన తరగతులు, బహిరంగ సభలు నిర్వహించడం, అనేక సమస్యలపై తీర్మానాలు చేయడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘ స్థాపన నాటి నుంచీ వాటి వివరాలను క్లుప్తంగా చూద్దాం.

**<u>అధ్యయన తరగతుల్లో చర్చించిన అంశాలు</u>:**

హేతువాదం - మతత్వం, విశ్వతత్వం - హేతుత్వం, మతవాదం - హేతువాదం - మానవవాదం, భావవిప్లవ ఉద్యమ ఆవశ్యకత, మానవ పరిణామం - మానవవాదం, నీతి, విశ్వతత్వం-హేతువాదం, జీవమంటే ఏమిటి? జీవపరిణామ వాదం,భారతదేశంలో మతం, హేతువాదం - స్త్రీలు, లౌకికవాదం,ఇస్లాం - పరిశీలన, మూఢనమ్మకాలు- హేతువాదం, బైబిలు.బాలలు-హేతువాదం, పూజల్లో బూతు, బైబిలు - క్రైస్తవం, మతభావన - నష్టాలు, వివాహ(శ్రాద్ధ, పూజాది కర్మకాండలు, ఆధునిక విజ్ఞానం, హేతువాద ఉద్యమ స్థితిగతులు, పునర్వికాసం, దైవం-ఆత్మ, శాస్త్రీయదృక్పధం, హిందూమత విమర్శ, సైన్సు-హేతువాదం, సైకాలజీ - పారాసైకాలజీ, కలలు- వాటి ప్రాముఖ్యం, భావోద్యమాల చరిత్ర,హేతువాదుల జీవనవిధానం - కర్తవ్యం, ఆస్తిక, నాస్తిక, హేతువాద, మానవవాదాలు, హేతువాద వైఖరి, భారతీయ తత్వశాస్త్ర పరిణామం, ఇస్లాం ఆచారాలు - స్త్రీల స్థితిగతులు; హిందూ పురాణాలు - కర్మకాండలు; మానసిక రుగ్మతలు; వేమన - హేతువాదం; బైబిలు-సృష్టి సిద్ధాతం; ఏది మతం - ఏదిశాస్త్రం? వర్ణ, కులవ్యవస్థ - స్వరూప స్వభావాలు; భావగమనం - సామాజిక ఆచరణ;హేతువాదం -సెక్సు; హేతువాదం -విద్య -మూఢనమ్మకాలు; హేతువాదం - ఇతరవాదాలు-నీతి; శాస్త్రీయ పద్ధతి; హేతువాద అవగాహన, ఆర్థిక నియతివాదం - హేతుత్వం, కవిరాజు త్రిపురనేని సాహిత్యం, సమకాలీన సమస్యలు - హేతువాదం;సెక్యులర్ భారతంలో కులమత ఔచిత్యం; సామాజిక విప్లవం; హిందూ మత పునరుజ్జీవతత్వం; ఇండియాలో సెక్యులరిజం; మూఢవిశ్వాసాలు; నూతన విద్యావిధానం; విశ్వతత్వం- సృష్టివాదం; హేతువాదం - భౌతికవాదం; ఖురాను -ఇస్లాం; రాజకీయాలు -హేతువాదం; దివ్యజ్ఞానం-నాస్తికత్వం; శాస్త్రం -మతం; ఇండియన్ రినైజాన్స్; యూరోపియన్ రినైజాన్స్; మానవ విలువలు; తెలుగుసాహిత్యంలో హేతువాదం; హేతువాదం- ప్రాచ్యం - పాశ్చాత్యం; శంకరుడి తత్వం - చెప్పిందీ - చేసిందీ; విద్యారంగంలో శాస్త్రీయత; మత మౌఢ్యం -ఆధునికవిజ్ఞానం - వక్రభాష్యాలు; రామజన్మభూమి - బాబ్రీమసీదు వివాదం; విశ్వతత్వం-హేతువాద మౌలిక స్వరూపం; మతఛాందసం - ఆధునిక విజ్ఞానం; ప్రకృతి పరిణామం -సృష్టి సిద్ధాంతాలు; రాజకీయాల్లో టెర్రరిజం; వైజ్ఞానికి స్వభావం; భావవిప్లవం - వర్గచైతన్యం; పార్టీరహిత రాజకీయాలు;

రాజకీయాలు - ప్రభుత్వం - పార్టీలు; హైందవం; సత్యశోధన; రాజకీయాలు-మతం; దక్షిణ భారతంలో హేతువాదం; హేతువాదం - మహిళోద్యమం; కులం-శాస్త్రీయ పరిశీలన; హేతువాదం- మానవ విలువలు; మతం - మానవహక్కులు; బాబాలు-అమ్మలు; నైతిక విలువలు; ఇంద్రజాలం; మూఢనమ్మకాలు -శాస్త్రీయ విజ్ఞానం; విశ్వం - విశ్వంలో మానవుడి స్థానం; భావవాదం - భౌతికవాదం - ఇతర సారూప్య వాదాలు; ఆధునికవిజ్ఞానం -భౌతికవాదం; మతాలు - వాటి తాత్వికలోపాలు; జ్యోతిష్యం -వాస్తు; కార్యకారణత - భౌతిక,నాస్తిక, హేతువాదాలు; నియతివాదం - హేతువాదం; నేటిరాజకీయాల తీరుతెన్నులు; మతాల చిత్రహింసలో చిన్నారులు; మహిళాభ్యుదయం; జన్యుశాస్త్రం - హ్యూమన్‌జినోమ్ ప్రాజెక్ట్; వర్తమాన రాజకీయ, ఆర్థిక, సాంఘిక సంక్షోభం -నాస్తిక, హేతువాద, మానవవాదపరిష్కారం; పాఠశాలల్లో మ్యాజిక్ కోర్సులు ప్రవేశపెడితే మూఢనమ్మకాల నిర్మూలనకు దోహదం చేస్తుందా?; మతం లేకుంటే మానవుడు నీతిమంతంగా మనలేడా?; ఎం.ఎన్‌రాయ్ నవ్యమానవ వాదం - జ్ఞాన పునర్వికాసోద్యమం; ఉగ్రవాదం- మానవ విలువలు- మతం; ప్రపంచీకరణ - ప్రపంచ మానవీకరణ; భారత సమాజ మతీకరణం, వెర్రివేషాలు, కాషాయీ కరణం; జీవం-ఆత్మ -పునర్జన్మ సమస్య; ఆధునిక యుగంలో హేతువాద దృక్పథం ఆవశ్యకత; విజ్ఞానశాస్త్రం -తత్వం; సామాజిక సమస్యలు - పరిష్కారం; యోగం మోక్షానికా? ఆరోగ్యానికా?; సాంస్కృతిక విప్లవోద్యమాలు - రాజకీయోద్యమాలు -మత పునరుజ్జీవనోద్యమాలు - మన కర్తవ్యం; ప్రజలకు అధికారం- పార్టీలపాత్ర; ముదురుతున్నమత ఛాందసం.

**<u>అధ్యయన తరగతులు నిర్వహించిన ప్రాంతాలు:</u>**

విజయవాడ, వెంకటగిరి, మండపేట, ఏలూరు, ఒంగోలు, తెనాలి, తణుకు, రాజమండ్రి, పాలకొల్లు, నెల్లూరు, హైదరాబాదు, విశాఖపట్టణం, మచిలీ పట్టణం, ప్రత్తిపాడు, ముమ్మిడివరం, వెంప, ఇంకొల్లు,పర్చూరు, గుంటూరు, రామచంద్రాపురం, రాజాపూర్, సీతానగరం, లోతుకుంట,, గూడవల్లి, చీరాల, కారంచేడు, తాటిపాక, టంగుటూరు, కోదాడ, గుడివాడ, భీమవరం, కాకినాడ, ఇంకా-

**<u>అధ్యయన తరగతుల్లో వివిధ అంశాలపై ప్రసంగించిన ప్రముఖులు:</u>**

రావిపూడి వెంకటాద్రి, ఎమ్.వి.రామమూర్తి,కత్తి పద్మారావు, ఆవుల సాంబశివరావు, వెనిగళ్ల సుబ్బారావు, బి.రామకృష్ణ, ఈశ్వరప్రభు, ఎన్.వి.బ్రహ్మం, జ్వాలాముఖి, కె.వి.రమణారెడ్డి, సి.వి. జయగోపాల్, కొల్లాసుబ్బారావు, కొండవీటి వెంకటకవి, త్రిపురనేని వెంకటేశ్వరరావు, ఎస్.వెంకటేశ్వరారవు,హజరత్ ఆలీ, డా॥వి.రామకృష్ణ, డా॥జి.విజయం, బి.వి.నరసింహారావు, ఎ.సూర్యనారాయణ, పి.మధుసూదనరావు, కె.విజయలక్ష్మి,డా॥ఎన్.ఇన్నయ్య, ఎస్.సిద్ధార్థబక్ష్, పసల భీమన్న, మాదేప్రభాకరరావు, ఎస్.నాగేశ్వరరావు, గోపరాజు సాంబశివరావు, జి.వెంకటస్వామి, మల్లాది సుబ్బమ్మ, గుమ్మావీరన్న, కోగంటి రాధాకృష్ణమూర్తి, ఎ.పూర్ణచంద్ర, డా॥వై. వెంకటేశ్వరరావు, డా॥ఎస్.సంజీవదేవ్, అన్నపురెడ్డి వెంకటేశ్వరరెడ్డి, డి.వి.ఎల్.ఎన్.శర్మ, జాన నాగేశ్వరరావు, డా॥ఎర్నేని వెంకటేశ్వరరావు, టి.విశ్వం, డా॥జయనాగరాజు, ఎస్.కె.ఎస్. దావులూరి, ఆలూరి ప్రఫుల్లచంద్ర, ఎం.బసవపున్నారావు, అంచా సీతారామయ్య, ఎం.వి.రావు, పెన్మెత్ససుబ్బరాజు, డా॥కె.ఎస్.చలం, జి.పార్థసారథి, డా॥తోటకూరప్రభాకరరావు, ప్రొ॥ ఆదేశ్వరరావు, మహీధర రామమోహనరావు, డా॥ఎన్.జయప్రకాష్ నారాయణ, ఎస్. రాఘవరావు, అంచాబాపారావు, మేడూరి సత్యనారాయణ, ఆరీజ్, కుర్రాహనుమంతరావు, జి.రాధారాణి, డా॥కొత్తపల్లి విల్సన్, డా॥కె.వెంకటరెడ్డి, వై.దుర్గాప్రసాద్, జి.ఆర్.రామనాధబాబు, ప్రొ॥సి. రాఘవులు, ఎన్.యాదగిరిరెడ్డి, ఎమ్.ఎ.ఆర్.షరీఫ్, జి.లవణం, సి.ఫ్రాన్సిస్, ఎన్.కె.ఆచార్య, ఎస్.ఎమ్.చెల్లప్ప, ప్రొ॥జె.డి.గౌడ్, కోటపాటి మురహరిరావు, ఎన్.విక్రం, బి. ప్రేమానంద్, ఎన్.చక్రధరరెడ్డి, రావెల సాంబశివరావు, డా॥పి. దక్షిణామూర్తి, డా॥బి. సాంబిరెడ్డి, కె.జనార్ధనాచారి, కొత్తపల్లి రవిబాబు, కొడాలి శ్రీనివాస్ ప్రభృతులు.

**<u>వివిధ సభలు, సమావేశాలు, కార్యవర్గ సమావేశాల్లో చేసిన ముఖ్యతీర్మానాలు:</u>**

❋ రావిపూడి వెంకటాద్రి సారధ్యంలో ప్రారంభమైన 'హేతువాది' పత్రికనుఉద్యమపత్రికగా తీర్చిదిద్దాలి.

* పాఠ్యగ్రంథాలలోని లౌకిక వ్యతిరేక భావాల అధ్యయనానికి కమిటీ నియమించాలి. ఆకాశవాణి, దూరదర్శన్‌లలో హేతువాదులకు అవకాశం ఇవ్వాలి.
* కామన్ సివిల్‌కోడ్ ఆవశ్యకత గురించి విరివిరిగా బహిరంగ సభలు నిర్వహించాలి.
* కామన్ సివిల్‌కోడ్ (ఉమ్మడి పౌరస్మృతి) తీసుకురావాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి.
* హేతుబద్ధమైన రాజకీయాల గురించి చర్చ జరగాలి.
* సంఘం తరుపున ప్రచురించిన 'హేతువాద వ్యాసవాణి' పంపిణీకి చర్యలు తీసుకోవాలి.
* మత విశ్వాసాలతో పాటు గాంధీయిజం, మార్క్సిజం మొదలైన రాజకీయసిద్ధాంతాలను ఇతర తాత్విక వైఖరులను విశ్లేషించి, పరిశీలించి నిర్ణయాలు తీసుకొనే విధానమే హేతువాదమనీ, దీని లక్ష్యం మానవ వాదమనీ, ఈ లక్ష్యంతో పనిచేయగల వ్యక్తులంతా హేతువాద సంఘ వేదికలో చేరి సమాజ శ్రేయో సాధనలో పాలు పంచుకోవాలని ఆహ్వానం.
* మత పునరుజ్జీవన శక్తులకు తోడ్పడరాదని రాజకీయవాదులకు, ప్రజలకు పిలుపు.
* దేశంలోజాతి, మతం, కులం, వగైరా పేర్లతో విద్వేషాలు పెరిగి అత్యాచారాలు, దోపిడీలు,హత్యలు కొనసాగడాన్ని, రాజకీయాలలో రౌడీయిజం ప్రవేశాన్ని గర్హించింది. వీటి నివారణకు ప్రగతి కాముకులంతా హేతువాద భావవ్యాప్తి కోసం ముందుకు రావాలని పిలుపు.
* సాల్మన్ రష్దీ 'శటానిక్ వర్సెస్' నిషేధంపై నిరసన.
* భారత రాజకీయాలు లౌకికవాద దృక్పథం నుంచి వైదొలగినందునే బాబ్రీమసీదు రామజన్మభూమి వివాదం ముదురుతోందని ఆవేదన. వివాదస్పద స్థలంలోకి ఇరు వర్గాల వారు ప్రవేశించకుండా కట్టడి చేసి, దాన్నిపర్యాటక స్థలంగా ప్రకటించాలని ప్రభుత్వానికి సూచన.
* కేంద్రప్రభుత్వ ఉద్యోగాలలో వెనుకబడిన వర్గాలకోసం ప్రవేశపెట్టిన 27% రిజర్వేషన్లు బలపరుస్తూ దిగువ సూచనలు చేసింది.

  అ) ఉన్నతోద్యోగాలు చేస్తున్నవారి కుటుంబాలను మినహాయించాలి.

  ఆ) ఒక కుటుంబంలో ఇద్దరికి మించి రిజర్వేషను సౌకర్యం ఇవ్వరాదు.

  ఇ) రిజర్వేషన్లకు కాలపరిమితి విధించాలి.

  ఈ) వెనుకబడిన వర్గాల సాంఘిక హోదా పెంపుకు తగిన కార్యక్రమాలు చేపట్టాలి.

  ఉ) సెకండరీ విద్య వరకూ నిర్బంధ, ఉచిత విద్యకల్పించాలి.
* సామాజిక చైతన్యం కోసం కలసి పనిచెయ్యడానికి భావ సారూప్యం వున్న సంఘాలకు పిలుపు.
* తెలుగు విశ్వవిద్యాలయంలో ప్రవేశపెట్ట దలచిన జోతిష్యం కోర్సును హేతువాదుల విజ్ఞప్తిమేరకు రద్దు చేస్తానన్న వైస్‌ఛాన్సలర్ డా॥సి.నారాయణరెడ్డికి అభినందన.
* పత్రికలలో రాశిఫలితాలు ప్రకటించినపుడు "కేవలం వినోదం కోసం" అని ప్రకటించాల్సిందిగా పత్రికలకు విజ్ఞప్తి.
* రేడియో, టెలివిజన్లలో మత ప్రచారం పెరగడం పట్ల నిరసన.
* గారడీ ట్రిక్కులు చేస్తూ, మతం పేరిట వ్యాపారం సాగిస్తున్న సత్యసాయిబాబా కార్యక్రమాలకు ఉన్నతహోదాల్లో ఉన్న మంత్రులు, అధికారులు హాజరుకావడం పట్ల తీవ్ర నిరసన.
* బాబ్రీమసీదు కూల్చివేత నేపధ్యంలో పెరిగిపోతున్న మతఛాందసం పట్ల నిరసన.
* మతాల కతీతంగా కామన్ సివిల్ కోడ్ రూపొందించి అమలు చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి.
* సాయిబాబా శయన మందిరంలో జరిగిన హత్యలపై సమగ్ర దర్యాప్తునకు ప్రభుత్వానికి విజ్ఞప్తి.
* నాగార్జున విశ్వవిద్యాలయంలో ఎం.ఎ.తెలుగువారికి 5వ పేపరు కింద'హేతువాదం' ప్రవేశపెట్టి, మూడేళ్ల అనంతరం తొలగించడం పట్ల నిరసన. ఆప్షనల్ సబ్జెక్టుగా తిరిగి ప్రవేశపెట్టమని విజ్ఞప్తి.

* హేతువాద, మానవవాద సాహిత్య ప్రచురణకు ఏర్పాటు చేయబోయే 'హేమా ట్రస్టు' నియమ నిబంధనలు ఖరారు.
* వార్త దినపత్రికలో భారతనాస్తిక సమాజం కార్యదర్శి జయగోపాల్ ఇస్లాంలోని స్త్రీల స్థితిగతులపై వ్యాసం వ్రాసినందుకు బందులు నిర్వహించడంపై ఖండన.
* డిసెంబరు 6న హిందుత్వవాదులు అయోధ్యలో తలపెట్టిన కరసేవ అభినందన కార్యక్రమాలను నిషేధించాల్సిందిగా రాష్ట్ర,కేంద్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి.
* నైతిక విలువల పేరుతో లౌకికవాదానికి విరుద్ధంగా ప్రాథమిక స్థాయినుంచి హిందుత్వ విద్యావిధానంలో ప్రవేశపెట్టజూస్తున్న కేంద్రప్రభుత్వ విధానం పట్ల నిరసన.
* ప్రార్ధనాలయాలోని మైకులు వ్యాప్తి చేస్తున్న శబ్దకాలుష్యాన్ని నివారించే చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రభుత్వానికి విజ్ఞప్తి.
* వినోదం పేరుతో మాయలు,మంత్రాలు, క్షుద్రవిద్యలు వగైరా మూఢనమ్మకాలను వ్యాప్తి చేసే రీతిలో సినిమాలు, టివీ సీరియల్స్ రావడాన్ని గర్హించి,వివేక పథంలో నడవమనికోరింది.
* జనాభా పెరుగుదలను ప్రధాన సమస్యగా గుర్తించి, జననాల రేటు మైనస్ శాతానికి తగ్గేటట్లుగా చర్యలు తీసుకోమని కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి.
* జ్యోతిషం, వాస్తు, పౌరోహిత్యం లాంటి అశాస్త్రీయ అంశాలను యూనివర్శిటీ స్థాయిలో కోర్సులుగాప్రవేశపెట్టి, విద్యను కాషాయీకరించడాన్ని ఖండిస్తూ కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు తమ వైఖరిని పునస్సమీక్షించుకోవాలని విజ్ఞప్తి.
* అమెరికాలోని ప్రపంచ వాణిజ్య కేంద్రం,పెంటగాన్ కార్యలయాలపై తీవ్రవాదులు జరిపిన దాడిపై ఖండన. యుద్ధాన్ని నివారించాలని అమెరికాతో సహా ప్రపంచ దేశాలన్నింటికీ పిలుపు.
* అన్ని ప్రభుత్వశాఖలలో 'కాషాయీకరణ' కు కేంద్రప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపట్ల ఖండన.
* భారత్‌లోని విశ్వవిద్యాలయాలలో వేద విజ్ఞానాన్ని, సంస్కృత బోధన , పురోహిత్ కోర్సులను ప్రవేశపెట్టి,విద్యావిధానాన్ని మధ్య యుగాల నాటికి తీసుకెళ్లే ప్రయత్నాల పట్ల నిరసన.కామన్ సివిల్ కోడ్‌ను రూపొందించి చట్టబద్ధతను కల్పించలేని కేంద్రప్రభుత్వ నిస్సహాయత పట్ల అసంతృప్తి.
* లౌకిక వివాహాల ద్వారా పుట్టిన పిల్లలు ఆర్థికంగా వెనుకబడిన వారైతే వారికులం, మతంతో నిమిత్తం లేకుండా ఉద్యోగాలలో రిజర్వేషన్లు కల్పిచాలి. దీని అమలుకు తక్షణమే ఒక జాతీయ స్థాయి కమిటీని కేంద్రం నియమించాలి.
* ప్రస్తుత ప్రపంచీకరణ విధానం పేదదేశాల దోపిడికి దారితీస్తోంది.సంపన్న పాశ్చాత్యా దేశాలు తమ ఆయుధసంపత్తిని అమ్ముకోవడానికి తద్వారా పేద దేశాల మధ్య యుద్ధాలకు దోహదం చేస్తోంది. 'మానవీకరణ' దిశలో 'ప్రపంచీకరణ'కు బదులుగా 'విశ్వజనీకరణ' సాధించాలి.

(సంస్థాగత విషయాలపై చేసిన తీర్మానాలు,నిర్ణయాలు ఇక్కడ ప్రస్తావించలేదు.)

<u>బహిరంగ సభలు జరిగిన ప్రదేశాలు:</u>

ఏలూరు, బ్రాహ్మణకోడూరు, తూములూరు, చీరాల, వెంకటగిరి, ఒంగోలు, కొడిపల్లి, పొన్నూరు,బాపట్ల, రాజమండ్రి, నెల్లూరు, బుచ్చిరెడ్డిపాలెం, పాలకొల్లు, తాడేపల్లిగూడెం,దేవాంగపురి, శ్రీహరికోట, మార్కాపురం, మొవ్వ, తెనాలి, సార్లపల్లి, పాలకోడేరు, విశాఖపట్టణం, పెదన, చిలకలూరిపేట, గుడివాడ, భీమవరం, పందిళ్లపల్లి, వేటపాలెం, విడవలూరు, కంచర్లపాలెం, ప్రత్తిపాడు, పెదనందిపాడు, ఇంకొల్లు, పంగులూరు, అల్లూరు, సంతనూతలపాడు, రామచంద్రపురం, నరసరావుపేట, హైదరాబాదు, అర్ధవీడు, తాళ్లూరు, తిరుపతి, విజయవాడ, వలివేరు, పామర్రు, దర్శి, తూర్పు వెంకటాపురం,తిరుపతి, పైనంపాడు, టంగుటూరు, దుద్దుకూరు, పమిడిపాడు, గంగవరం, కోదాడ, మలికిపురం, కూర్మాపురం, కదలి, కాకినాడ, పర్చూరు, ఉండి, పాలమూరు వగైరా ప్రాంతాలు.

బహిరంగ సభల్లో ప్రసంగించిన వారిలో హేతువాద సంఘ రాష్ట్రస్థాయి నాయకులతో పాటు గోడా సత్యనారాయణమూర్తి, ఎన్.చంద్రశేఖర్, జాస్తిరామస్వామి, ఎన్. వెంకటసుబ్బయ్య, పి.విఠల్‌రెడ్డి, ఎన్.చలమయ్య, గణేశ్వరం బాబూరావు, నందెపు వెంకటరావు, టి. సుకుమార్‌రెడ్డి,జి.ఆదిశేషయ్య, జె.మార్కేండేయులు, బి.శరభయ్య, సి.ఎస్.రావు,నిసార్‌అహ్మద్, నాగభైరవ కోటేశ్వరరావు, డా॥జి.సమరం, జి.నియంత, కె.పట్టాభిరామయ్య, కె.మధుసూదనరావు, డా॥సుంకరవీరభద్రరావు, డి.ఎస్.కె.శర్మ, ఎమ్.వి.ఎస్. ప్రసాద్, జి.మైత్రి, జి.పాండురంగారావు, మాకినేని బ్రహ్మానందం, బాబుశ్రీ, తిక్కాసూర్యనారాయణ, టి.ఎస్.రాజు, వి.కొండలరావు, అల ఆదినారాయణ,వి.కొండలరావు,పుల్లెపు వెంకటేశ్వరావు, తోట విజయలక్ష్మి, మెందు నరసింహారావు, కడలి సత్యనారాయణ, ఎం.టి.వి.ప్రసాద్, ఎ.కామేశ్వరశర్మ, పి.అచ్యుతరామ్, గురిజాల సీతారామయ్య, సి.హెచ్. రామకోటయ్య, ఎల్.వి. రంగారావు, ఎం.సుశీల, హేతుశ్రీ, రావిసుబ్బారావు, బీరం సుందరరావు, చేగిరెడ్డి చంద్రశేఖర్, షేక్‌బాబు, బీరం సుందరరావు, ఎం.వి.కృష్ణయ్య చెరుకూరి వెంకటేశ్వర్లు, టి. వేణుగోపాలరావు, సి.ఎల్.ఎన్.గాంధీ, టి.వేణుగోపాలరావు, వి.వి.గోపాలకృష్ణ, ముకురాల రామారెడ్డి, దివికుమార్, కరిహరిబాబు, కొడాలి శ్రీనివాస్, ఐ.వి.సుబ్బారావు, సిహెచ్.ఎస్.గోపాలరావు, గోరంట్ల రాఘవయ్య, ఆకేటి సూరన్న, ఎస్.చంద్రశేఖరబాబు వంటి ఇతర ఉద్యమ ప్రముఖులు, అతిథులు,జిల్లా స్థానిక హేతువాద నాయకులూ వున్నారు.

భారత హేతువాద సంఘ అనుబంధ సంఘాలలో ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘమే బలమైనది. రాష్ట్ర సంఘానికి దిశానిర్దేశం చేసిన నాయకులతో పాటు మరికొందరు భారత హేతువాద సంఘంలోనూ విశేషకృషి చేశారు. భారత హేతువాద సంఘంలో బాధ్యతాయుత పదవులు నిర్వహించిన, నిర్వహిస్తున్న వారిలో ఆవుల సాంబశివరావు, అత్తలూరి సూర్యనారాయణ, ఆవుల గోపాలకృష్ణమూర్తి, ఎన్.కె.ఆచార్య, డా॥ఎన్.ఇన్నయ్య, ఎ.ఎల్.నరసింహారావు, ఎం.వి.రామమూర్తి, రావిపూడి వెంకటాద్రి, జి.ఆర్.రామనాథబాబు, అంచాబాపారావు, కుర్రా హనుమంతరావు వంటి తెలుగువారున్నారు. 1996లో భారత హేతువాదసంఘ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన గోగినేని రాజాజీ రామనాథబాబు అంతర్జాతీయ మానవవాద నైతిక సంఘం ఎగ్జిక్యూటివ్ డైరెక్టరుగా 1997 జనవరిలో లండన్ వెళ్లారు. హేతువాద, మానవవాద రంగాల్లో బహుముఖ కృషి చేసినందుకు రావిపూడి వెంకటాద్రి, ఎం.వి.రామమూర్తి, మల్లాది సుబ్బమ్మ, డా॥ఎన్.ఇన్నయ్య, పరుచూరి అచ్యుతరామ్, కోటపాటి మురహరిరావు, పెన్మెత్స సుబ్బరాజు వంటి నేతలు పలుసంస్థలు, విశ్వవిద్యాలయాల నుంచి అవార్డులు అందుకున్నారు. రావిపూడి వెంకటాద్రి, పెన్మెత్స సుబ్బరాజు గార్లు సంయుక్తంగా వ్రాసిన "ఆంధ్రప్రదేశ్‌లో హేతువాద, మానవవాద ఉద్యమాల చరిత్ర"ను 2003లో తెలుగు అకాడమీ ప్రచురించింది. హేతువాద సంఘం పేరుతో మరికొన్ని సంఘాలు పనిచేస్తున్నప్పటికీ హేతువాద, నాస్తిక కోణం నుంచి విలువైన సాహిత్యాన్ని వెలువరించిన ఘనత ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘానిదే.

హేతువాద, మానవవాద ప్రచురణలను ప్రోత్సహించడం కోసం "హేమాపబ్లికేషన్స్" పేరుతో 1992నుంచి పలు రచనలు ప్రచురించడం జరిగింది. 1997లో 'హేమా ఫౌండేషన్' స్థాపించి రిజస్టరు చేయించడం జరిగింది.

పలువురు హేతువాద సంఘ సభ్యులు కులాంతర, మతాంతర వివాహాలు చేసుకొన్నారు. సంఘంలో సభ్యత్వం వున్నవారికీ, లేనివారికీ హేతువాద ఉద్యమ నాయకులు కొందరు అనేక

వివాహాలు జరిపించారు. అలా వివాహాలు జరిపిస్తున్న వారిలో హేతువాద సంఘ ప్రముఖులు రావిపూడి వెంకటాద్రి, బి.ఎల్.ఎస్.వరప్రసాద్, పెన్మెత్స సుబ్బరాజు, మల్లాది సుబ్బమ్మ ప్రభృతులు ఉన్నారు.

**హేతువాద ఉద్యమంలో 'హేతువాది పాత్ర':**

హేతువాద ఉద్యమంలో 'హేతువాది' మాసపత్రిక పాత్ర వెలకట్టలేనిది. రాష్ట్ర స్థాయినుంచి ప్రపంచ స్థాయి వరకు హేతువాద, మానవవాద ఉద్యమాలకు చెందిన వార్తలను ఎప్పటికప్పుడు పాఠకులకు అందించడమే గాక, పాఠకుల స్థాయిని పెంచే వ్యాసాలతో 1982 నుంచి నేటి వరకూ క్రమం తప్పకుండా వెలువడుతోంది. అందులోని వ్యాసాలన్నీ వేరు వేరు సిద్ధాంత చర్చలకు ప్రాధాన్యత నిస్తూవస్తున్నాయి. కొందరు పాఠకులు 'హేతువాది'లోని వ్యాసాలు జటిలంగా వుంటున్నాయని భావిస్తున్నా, భావ వికాసానికి దోహదం చేయాలంటే కొంత జటిలత్వం తప్పదని పత్రిక సంపాదకులు అభిప్రాయ పడుతున్నారు. మత విమర్శ చేయడం, దైవాన్ని నిరాకరించడం, మతగ్రంథాలను ఆధునిక విజ్ఞానంతో పోల్చి చూసినప్పుడు విజ్ఞానం పాళ్ల కన్న అజ్ఞానమే ఎక్కువని చెప్పడం, మూఢనమ్మకాలు పోవాలంటే మౌఢ్యం స్థానే భావ వికాసం కలగాలనీ, భావ విప్లవం ద్వారానే సమాజాన్ని మార్చగలమనీ చెప్పడం చాలా తేలిక. మనం ఒక వాదాన్ని తిరస్కరిస్తున్నా మంటే, అందులోని లోపాలేమిటో మనం వివరించగలగాలి. ఆ పని చెయ్యాలంటే మన అవగాహన స్థాయి తప్పక పెరగాలి. అలా పెరగాలంటే ఆయా సిద్ధాంతాలు, విషయాలపై మన కంటె ఎక్కువ అవగాహన కావలసిన అంశాలు కొంత జటిలంగానే తోస్తాయి. ఈ పంథాలో పత్రిక నడవడం కొందరికి ఇబ్బంది కరంగా పరిణమించినప్పటికీ, చాలామంది ఈ కారణంగానే తమ స్థాయిని పెంచుకొని వ్యాసాలు వ్రాసే స్థితికి చేరుకోగా, మరికొందరు ఉపన్యసించడానికి తగిన జ్ఞానార్జన చేయగలిగారు. పత్రిక నేటికీ స్వయం పోషకం కాలేక పోయినప్పటికీ, ఎందరో వదాన్యుల సహాయ సహకారాలతో క్రమం తప్పకుండా వెలువడుతోంది. ఆశించిన స్థాయిలో ఆర్థిక సహకారం అందకపోయినా నిర్వాహకులు ఎన్నో వ్యయప్రయాసల కోర్చి పత్రికను నడుపుతూనే వున్నారు. మరీ ఇబ్బంది కరమైన పరిస్థితుల్లో కొన్నాళ్లు తెనాలి నుంచి ఎం.బసవపున్నారావు, చీరాల నుంచి అంచాబాపారావు గార్లు పత్రిక బాధ్యత తీసుకొని వెలువరించారు. ప్రస్తుతం రావిపూడి వెంకటాద్రి సంపాదకత్వంలో రాష్ట్ర సంఘ ప్రధానకార్యదర్శి మేదూరి సత్యనారాయణ మేనేజింగ్ ఎడిటర్‌గా పత్రిక వెలువడుతోంది. సంఘ కార్యకలాపాల నిర్వహణకు ఆర్థిక వనరులతో సహా పలు పరిమితులు వున్నప్పటికీ, కార్యకర్తల మధ్య సంబంధాలు పటిష్టపరచడంలోను, ఉద్యమ వార్తలను పాఠకుల చెంతకు మోసుకొచ్చి ఉద్యమాన్ని సజీవంగా ఉంచడంలోను అసలు పాత్రధారి 'హేతువాది' పత్రికే. 'హేతువాద'ని స్వయం పోషకం చేయవలసిన బాధ్యత పాఠకులదే.

**వ్యాసకర్తలు:**

హేతువాది పత్రికలో వ్యాసాలు పాఠకుల స్థాయిని పెంచడానికి దోహదం చేసిన, చేస్తున్న రచయితలెందరో హేతువాద ఉద్యమంలో వున్నారు. వారిలో రావిపూడివెంకటాద్రి, నాగండ్ల ; డా।।ఎన్.ఇన్నయ్య, హైదరాబాదు; అవుల సాంబశివరావు, మూల్పూరు; మల్లాది సుబ్బమ్మ, హైదరాబాదు; ఎమ్.వి.రామమూర్తి, హైదరాబాదు: కొల్లాసుబ్బారావు, నాగులపాలెం; పసల భీమన్న, రాజమండ్రి; అంచాబాపారావు, చీరాల; డా।।కె.విజయలక్ష్మి, మండపేట; ఎస్.ఎస్.బక్ష్ మండపేట; గుమ్మావీరన్న, ఎమ్మిగనూరు; డి.వి.రామకృష్ణారావు,

మియాపూర్; డి.ఎస్.కె.శర్మ, తెనాలి; ఎస్.నాగేశ్వరరావు, నెల్లూరు; వెనిగళ్ల సుబ్బారావు, రేపల్లె; గణేశ్వరం బాబూరావు, గుడివాడ; ఎ.పూర్ణచంద్ర, వలివేరు; డి.వి.పి.ఎల్.ఎన్.శర్మ, తెనాలి; జాస్తి రామస్వామి, కూచిపూడి; ఎ.ప్రఫుల్లచంద్ర, తెనాలి; ఎం.బసవపున్నారావు, తెనాలి; మాకినేని బ్రహ్మానందం, అబ్బినేని గుంటపాలెం; డా॥తోటకూర ప్రభాకరరావు, చిలకలూరిపేట; మేడూరిసత్యనారాయణ, ఇంకొల్లు; కు॥రాహనుమంతరావు, ఇంకొల్లు; పి. అచ్యుతరామ్, తెనాలి; సిహెచ్.ఎస్. గోపాలరావు, పామర్రు; ఎన్.చక్రధర్‌రెడ్డి, కర్నూలు; టి.శ్యాంకుమార్, నాగండ్ల; ఎన్.వెంకటసుబ్బయ్య, ఒంగోలు; చుండూరి వెంకటేశ్వర్లు, చీరాల; ఎస్.జయరామరెడ్డి. అనంతపురం; సిహెచ్. చంద్రశేఖర్, ఇంకొల్లు; ఎల్.ఎన్.పాణిగ్రాహి, బారువ; ఎం.డి.ప్రసాదరావు, తెనాలి; షేక్ మహబూబ్ సుభాని,మార్టూరు; ఆరీజ్, తెనాలి; రావెలసాంబశివరావు, గుంటూరు; జాస్తి జవహర్‌లాల్,హైదరాబాదు; డా॥మలయశ్రీ, కరీంనగర్; బీరం సుందరరావు, ఇంకొల్లు; పి.సుబ్బరాజు, జిన్నూరు; ప్రొ॥వి.కోమల, హైదరాబాదు; బి.వి.కె.పూర్ణానందం, నరసరావుపేట; అల ఆదినారాయణ, కడియపులంక; ఎస్.హజరత్‌ఆలీ, వేమూరు ప్రభృతులు ముఖ్యులు.

మానవవాద లక్ష్యంతో పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘం అందుకను గుణంగా భారత హేతువాద సంఘం రూపొందించుకొన్న లక్ష్యాలకు లోబడే పనిచేస్తోంది. పలుమార్లు భారత హేతువాద సంఘ సమావేశాలకు మన రాష్ట్రం వేదికగా నిల్చింది. ఇతర రాష్ట్రాల్లో సమావేశాలు జరిగిన సందర్భాలలోనూ మన రాష్ట్రం నుంచి హాజరైన వారి సంఖ్య అధికం. భారత హేతువాద సంఘం 1997 జూలై 18,19,20 తేదీలలో చీరాలలో జరిగిన 67వ జాతీయ మహాసభలలో సంఘ లక్ష్యాలను క్రింది విధంగా నిర్దేశించుకుంటూ తీర్మానించడమైంది.

1. జీవిత రంగాలన్నింటిలోను హేతువాద, మానవవాదాల వ్యాప్తిని పెంపొందించడం.
2. హేతువాద, మానవవాద జీవిత దృక్పథాల నుంచి రాబట్టిన విలువలను నిలబెట్టడం.
3. మానవవాద జీవన విధానాన్ని చేరడానికి శాస్త్రీయ, వైజ్ఞానిక పద్ధతుల్ని అనుసరించే విధానంగా హేతువాదాన్ని అనుసరించడం.
4. మానవుణ్ని తన చేష్టలకు తానే బాధ్యుడిగా,తమ భవితవ్యానికి తానే నిర్మాతగా పరిగణించే మానవవాదాన్ని జీవన విధానంగా నిలబెట్టడం.
5. బలాత్కారంతో అప్రజాస్వామిక నియంతృత్వ సాధనాల ద్వారా కాక, ప్రజల్ని ఒప్పించే హేతువాద, మానవవాద పంథాకు మార్చడం.
6. జాతి, మత, కుల, వర్గ, లింగ లేదా ఇతర పేర్లతో ప్రజలను విభజించి మానవుల మధ్య తారతమ్యాలను ఏర్పరచే వైఖరిని అధిగమించి, అన్ని కార్య రంగాలలోను మానవులు తమ స్వేచ్ఛను చెలాయించుకొనే విధంగా వికాసం కల్గించడం.
7. మానవుల్లో సర్వ సమగ్ర వికాసం కలిగించే మానవస్వామ్యాన్ని, ప్రభుత్వ పరంగా కాక, సామాజిక పరంగా,ఆదర్శంగా లక్షించడం.
8. శాస్త్రీయ దృక్పథాన్ని ప్రోత్సహించి, ఆధునిక శాస్త్ర తాత్విక ఫలితాలను వ్యాప్తి చేసి, నూతన వికాసయుగ స్ఫూర్తిని పెంపొందించడం.
9. లౌకిక, ఆస్తికేతర, భౌతిక వాస్తవికవాద సామాజిక ఆదర్శాలను ప్రోత్సహిస్తూ మత, మార్మిక, ఛాందస అతీత దృక్పథాలను తిరస్కరించడం.
10. ఇదే రకమైన, లేదా వీటి కనుగుణమైన లక్ష్యాలు వున్న భారత, లేదా విదేశీ హేతువాద, మానవవాద, స్వేచ్ఛావాద సంస్థలతో సంబంధ బాంధవ్య సహకారాలు ఏర్పరచుకోవడం.
11. పై లక్ష్యాలను నేరవేర్చడానికి గాను పత్రికలు, గ్రంథాలు, కరపత్రాలు, ఇతర సాహిత్యం ప్రచురించడం.
12. లక్ష్యసాధనకోసం సభలు, సమావేశాలు, చర్చలు, గోష్ఠులు, అధ్యయన శిబిరాలు, శిక్షణ తరగతులు, ఉపన్యాసాలు నిర్వహించడం.

ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘం పై లక్ష్యాలకు లోబడి భావవిప్లవం కోసం తన కృషిని ద్విగుణీకృత ఉత్సాహంతో కొనసాగించడానికి రజతోత్సవ సభల సందర్భంగా పునరంకిత మవుతోంది.

# హేతువాదం - విజ్ఞానశాస్త్రం

-ప్రఫుల్ల చంద్ర

సత్యాన్ని కారణంతోనే కాదు, హృదయంతో కూడా చేరుకోవచ్చు అంటాడు పాస్కల్. అయితే సత్యాన్ని ఈనాటి వరకు హృదయంతో చేరుకున్నవారులేరు. హేతువును ఆశ్రయించకుండా దేనినైనా సత్యంగా ఎలా ఆమోదిస్తామో ఆయన చెప్పలేదు. ఆయనేమన్నా, హేతువు ఈ విశ్వపరిణామంలో నిర్నిబంధమైన ఒక లక్షణం. హేతువినా విశ్వపరిణామం అసంభవం. విశ్వపరిణామక్రమంలో హేతుత్వం ఉనికి తేటతేలమౌతున్నది. నియమబద్ధమైన ప్రకృతిలో నుండి పరిణమించిన మానవుడు హేతుమంతుడు అవుతున్నాడు. మానవ ఆలోచనాక్రమాన్ని హేతుత్వంగా పరిగణిస్తాం.

విశ్వప్రకృతి యాదృచ్ఛికం కాదు. స్థిరమైన నియమాల ప్రకారమే ఈ జగతి ప్రవర్తిల్లుతున్నది. సంభవించిన సంఘటన ఏదైనా అంతకు ముందు జరిగిన అనివార్య సంఘటన ఫలితంగానే మనకు తోస్తుంది. నియమబద్ధమైన జగత్తులో మానవుడు భాగమైనందున మనకు ఈ పరిణామం అవగతమవుతున్నది. అలా మన అనుభవంలోనికి వస్తున్న పూర్వోత్తర సంఘటనలనే మనం కార్యకారణ వాదంగా పిలుచుకుంటున్నాం. మనం సంఘటనల పరంగా పొందిన జ్ఞానంతో మనలో హేతుత్వం వికసిస్తుంది. ఇలా వికసించిన హేతుత్వం మరింత జ్ఞానానికి ప్రోది చేస్తుంది. సత్యాన్వేషణ క్రమంలో జరిగే ప్రక్రియే సత్యగ్రహణ ప్రక్రియ. స్థూలంగా చెప్పాలంటే మనిషి స్వేచ్ఛాయోచనకు, స్వతంత్ర ప్రవృత్తికి దోహదమొనర్చే హేతుప్రవృత్తిని మనం హేతువాదంగా పిలుచుకుంటున్నాం. హేతువాదం అని మనం పిలుచుకున్న మాత్రాన అది సిద్ధాంతంకాదు. హేతువును ఊతంగా గొనే సత్యగ్రహణ ప్రక్రియ ఒక విధానం, లేదా వైఖరి. ఒక జీవనవైఖరి, వైజ్ఞానిక వైఖరి.

మనం సైన్సుగా పిలుచుకుంటున్న విజ్ఞానశాస్త్రమంటే మన చుట్టూఉన్న భౌతిక ప్రకృతికి సంబంధించిన క్రమబద్ధమైన జ్ఞానమే. ప్రకృతిలోని వివిధ యదార్థాల మధ్య నెలకొని ఉండే సంబంధాలను తెలుసుకొనడమే సైన్సు. సంబంధంలేనట్లు అగపడుతున్న రెండు దృగ్విషయాల మధ్య సంబంధాన్ని కనుగొనడం, కార్యకారణాలను కనుగొనడం, హేతువును అన్వేషించడం, ఒక సూత్రాన్ని రాబట్టడం, అది విజ్ఞానశాస్త్రంలో భాగం కావడం ఇదంతా ఈ ప్రక్రియంతా సైన్సు. స్థూలంగా హేతువాదానికి విజ్ఞానశాస్త్రానికి ఉండే సంబంధం ఇదే. విజ్ఞానశాస్త్రం వివిధ విషయాల మధ్య నెలకొని ఉండే అంతర సంబంధాన్నిఊహిస్తుంది, పరిశీలిస్తుంది, పరిశోధిస్తుంది, నిర్ధారిస్తుంది. ఒకసారి సంభవించిన పరిణామాలు అవే పరిస్థితులు నెలకొన్నప్పుడు మరల సంభవిస్తాయని సైన్సు నిర్ధారిస్తుంది. ఇదంతా ప్రకృతి నియమాలను అవగాహన చేసుకొనడం వల్లనే, ఆనియమాల కనుగుణంగా అలా సంఘటనలు చోటు చేసుకుంటూన్నాయని విజ్ఞానశాస్త్రం చెప్పగలుగుతుంది. సైన్సు అంటే సత్యశోధనే. దానికి మూలం హేతువాదమే.

శతాబ్దాలుగా మానవ ప్రయత్నానికి, మేధకు అడ్డుగోడగా నిలచిన దైవభావన ఫలితంగా విజ్ఞానశాస్త్రాభివృద్ధి కుంటి నడక నడిచింది. విశ్వప్రవృత్తిలో దైవభావానికి ఆస్కారం లేదనే

విషయం ఎప్పుడైతే వెల్లడయిందో, ప్రకృతిని శాస్త్రీయ అధ్యయనం చెయ్యడంలో ఒక పెద్ద అడ్డంకి తొలగినట్లయింది. విజ్ఞానశాస్త్రానికి సంబంధించిన రెండు మౌలిక భావనలు తలెత్తినై. మొదటిది మనం ముందుగానే చెప్పుకున్న విధంగా సంఘటన పూర్వకారణం లేకుండా సంభవించదన్నది. శూన్యం నుండి ఏమీ ఊడిపడదు కదా! గ్రహణాలు, వర్షం, రాత్రింబవళ్ళు, వస్తుప్రవృత్తి ఏమైనా కావచ్చు. అలాగే భావనలు, అనుభూతులు కూడా. వాటికి కార్యకారణ సంబంధం ఉంటుంది. ఆ కారణకార్యాల మధ్య సంబంధాన్ని పొడగట్టడం తేలికైనా కావచ్చు, లేదా కష్టంగా తోచవచ్చు. అయితే, ఒకటి లేకుండా మరొకదాని ఉనికి అసాధ్యం. సంప్రదాయ భౌతిక శాస్త్రం కార్యకారణ సిద్ధాంతం పట్ల తన నిబద్ధతను ప్రకటించింది న్యూటన్‌ద్వారా. అయితే న్యూటన్ కన్నా వెయ్యేళ్ళ ముందే గ్రీకు తత్వవేత్త లుసీప్పస్ కార్యకారణ సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. చార్వాకులు భారతదేశంలో అదే సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు.

రెండవది ప్రకృతిలోని ఏకరూపత. ప్రకృతి ఒకే రకంగా ప్రవర్తిస్తున్నది. నియమబద్ధంగా నడుస్తున్నది. అందులో క్రమతే ఉంది కానీ, గందరగోళం గజిబిజిలేవు. పదార్థం యొక్కలక్షణాలు, పరిస్థితులు మారనంత కాలం అవే పరిణామాలు సంభవిస్తూనే ఉన్నాయి. అలా కాక ప్రకృతిలో నియమ రాహిత్యమూ-అసంగతత్వంతో కూడి ఉన్నట్లయితే విజ్ఞానశాస్త్రమేకాదు, మన జీవితమూ దుర్లభమయ్యేది. అసలు నియమాలంటూ ఉంటేనే కదా, వాటిని మనం కనుగొనేదీ, మనం వాటిని సత్యగ్రహణ ప్రక్రియలో సోపానాలుగా వాడుకునేదీ? అలాకాకపోయినట్లయితే అంతా అనిశ్చియతలోనే దాగి ఉండేది. ఇలా విజ్ఞానశాస్త్ర విజయం ఈ రెండు మౌలిక భావనల్లోనే దాగి ఉంది.

ప్రకృతి రహస్యాల అన్వేషణ విజ్ఞానశాస్త్ర మౌలిక స్వభావం. దీన్ని పరిశీలించకుండా, పరిశోధించకుండా, ధృవపరచకుండా సత్యంగా ఆమోదించకూడదనే భావన అందులో నిక్షిప్తమై ఉంది. ప్రకృతిలో సంభవిస్తున్న పరిణామాలకు ఏదైతే సువ్యాఖ్యానం చేస్తున్నదో, ఏ జ్ఞానమైతే మన నిర్దేశిత లక్ష్యాలకు మనలను చేరుస్తున్నదో, అవాంఛనీయమైన పరిణామాలను పరిహరిస్తున్నదో – వీటన్నింటికి ఏది ఆధారపడ్డ జ్ఞానమో, అదంతా హేతువాదమే. అదంతా విజ్ఞానమే. ఊపిరి సలపనివ్వని ఈ విజ్ఞానాభివృద్ధి, వాటి వల్ల ఒనగూడుతున్న అసంఖ్యాక ఫలాలు అంతా సైన్సులోని భాగమే.

మానవుడు విజ్ఞానాన్ని ఆర్జించే కొలదీ అత్యంతశక్తి సంపన్నుడవుతున్నాడు. మార్మికమైన ప్రకృతి పొరలు విప్పుతున్నాడు. సరికొత్త బలాలు పుంజుకుంటున్నాడు. విజ్ఞానానికి మార్పులు, చేర్పులు, కూర్పులు చేకూరే కొద్దీ మానవుడు అద్భుతశక్తులను ఆవహింప చేసుకుంటున్నాడు. ఇవన్నీ మానవుడు హేతుమంతుడు కనుకనే – ప్రకృతిలోనూ హేతుత్వమే. విజ్ఞానమూ హేతుత్వం మూలంగా సిద్ధిస్తున్నది. అయితే అతడికి ఎన్ని శక్తులు సమకూరినా, అది ప్రకృతి మీద ఆధిపత్యాన్ని నెరపటం కాదు. ప్రకృతిలోని సూత్రాలనవగాహన చేసుకొని ప్రకృతితో సఖ్యం నెరపుతున్నాడు. విజ్ఞానాభివృద్ధి సమగ్ర సత్యం కోసం చేసే అన్వేషణలో ఒక భాగం. హేతువును ఆశ్రయించడం వల్ల, వివేచనతో కూడిన ఆలోచన వల్ల, సాముదాయిక

జ్ఞానం వల్ల, లౌకిక వైజ్ఞానిక వైఖరిని అవలంబించడం వల్ల అది సిద్ధిస్తుంది. సంప్రదాయాలను, మూఢవిశ్వాసాలను, దురభిమానాలను పరిహరించడం వల్ల సమగ్ర సత్యాన్ని అందుకోగలం,విజ్ఞానాభివృద్ధి సాధించగలం.

ప్రకృతిలోని రహస్యాలు అనంతమే కాక అద్భుతం కూడా. ఆ రహస్యాల పొరలు విప్పే కొద్దీ కొత్త రహస్యాల పొరలు లేస్తూనే ఉంటాయి. మానవుడు నూతన విషయాలు ఆవిష్కరించే కొద్దీ వినూత్న విషయాలు మరిన్ని అతని ముందు ప్రత్యక్ష మవుతుంటాయి. ప్రకృతి ఒక నిరంతర ప్రహేళిక. అయినా అది తరతాలుగా మానవ జిజ్ఞాసకు అనుకూలంగానే స్పందిస్తుంది. అందుకు ప్రకృతిలోని హేతుత్వమే – నియమబద్ధతే కారణం. మానవుడు వినూత్న ఆవిష్కారాలు చేసే కొద్దీ సైన్సు అప్రతిహతంగా ముందుకు సాగుతున్నది. మానవుడు తదనుగుణ ఫలాలు పొందుతున్నాడు. ప్రకృతి మరిన్ని వినూత్న శోధనలకు తన కవాటాలు తెరచి స్వాగతం పలుకుతున్నది. అందుకే ప్రకృతి నిరంతర పరిణామశీలి. సైన్సు ఇంతవరకు పరిశోధించిన సకల రంగాలలో ఒక నియతి – క్రమత, పద్ధతి – వ్యవస్థ, క్రమానుగుణ్యత – సుసంగత్వం మనం చూచాం. ప్రకృతి గ్రంథం గూఢలిపిలో ఉన్నా దాన్ని హేతువనే సులోచనాలతో అవగాహన చేసుకోవడం సాధ్యమే. ప్రకృతి సూత్రాలు ఆవిష్కరించినా, ప్రకృతి శక్తులను మనం స్వాధీనంలోనకి తెచ్చుకున్నా అదంతా మానవాళి హేతుత్వంతోనే సాధిస్తుంది. ప్రకృతిని నిర్బంధంతో లొంగదీసుకోలేం, విన్నపాలతో కరిగించలేం. మన కెదురవుతున్న ఆటంకాలను అధిగమించాలన్నా, విజయం సాధించాలన్నా, ప్రకృతి నియమాల నర్థం చేసుకొని మనకనుగుణంగా వాటిని మలచుకోవలసిందే. ప్రకృతిని అధ్యయనం చేసి అవగాహన చేసుకోవడమనే గురుతర బాధ్యత సైన్సులోని భాగమే. ఇందుకోసం మనకు ఉపయోగించేది హేతువాదమే. విజ్ఞానశాస్త్ర ప్రక్రియలో హేతుత్వానిదే తొలిమెట్టు, తుదిమెట్టు కూడా.

మత విషయంలో మాదిరిగా కాక, సైన్సు తన జ్ఞాన వారసత్వాన్ని కాపాడుకుంటూ వస్తున్నది. పూర్వపు జ్ఞానాన్ని దేన్నీ నాశనం చేసే ప్రయత్నం అది చేయలేదు. పైగా పూర్వపు జ్ఞానాన్ని విస్తృతపరుస్తుంది, వ్యాపింప చేస్తుంది. విజ్ఞానశాస్త్ర సాధనంతా నిరంతరాయంగా కొనసాగుతూనే ఉంటుంది. పోగుపడుతూనే ఉంటుంది. విజ్ఞానశాస్త్రంలోని అనేక విభాగాల అంతర కలయిక, వాటి వంతు సహకారం మొత్తం విజ్ఞాన శాస్త్రాభివృద్ధికి విపరీత దోహదం చేసింది. పూర్తిగా పరిశీలించబడిన విషయాలు ఎన్నడూ ఒక దానినొకటి వ్యతిరేకించలేదు. విరుద్ధ విషయాలుగా తోచిన వాటి మధ్య సంగతత్వాన్ని నెలకొల్పదానికి, సమన్వయించదానికి, ఒక ఉన్నతమైన సూత్రంగా రాబట్టదానికి సైన్సు తన నిరంతర ప్రయాణాన్ని కొనసాగిస్తున్నది. మతం నుండి శాస్త్రం విడివడే ప్రయత్నంలో విజ్ఞాన శాస్త్రం ఆవిర్భవించింది. ఒకప్పుడు తత్వవేత్త, శాస్త్రవేత్త ఒక్కరే. ఆధునిక యుగంలో విజ్ఞానశాస్త్రాలు ప్రత్యేకంగా రూపుదిద్దుకొని వికసించడం మొదలుపెట్టాయి. విజ్ఞానశాస్త్రం జ్ఞాన సముపార్జనలో భాగం. అది సమస్య–సమాచారం – క్రోడీకరణ – పరీక్ష– నిర్ధారణ అనే దశల గుండా సాగుతుంది. ఇందులో

ప్రతిదశలోను హేతువును అన్వయిస్తాం. సత్యగ్రహణ ప్రక్రియను కొనసాగిస్తాం. నిన్నటి కన్నా మెరుగైన సత్యానికి చేరుతాం. హేతువాద వైఖరి – విజ్ఞానశాస్త్ర వైఖరి రెండూ ఒకటే.

శాస్త్రీయ విజ్ఞానం అసీమితం. మన జ్ఞానం విస్తృతమయ్యే కొద్దీ మన అజ్ఞాన సరిహద్దులు చెరిపేసుకుంటూ ముందుకు సాగుతాం. ఆర్కిమెడిస్ నుండి గెలీలియో దాకా, గెలీలియో నుండి ఐన్‌స్టీన్ దాకా సత్యం కోసం మానవుడు సాగించిన జిజ్ఞాసా యాత్రలో హేతువు తొణికిసలాడని అధ్యాయమే లేదు. ఈ శాస్త్రీయాన్వేషణా క్రమంలో, సత్యావిష్కరణంలో అనేక క్షణాలు – ఉద్వేగంతో ఎగసినా, పారవశ్యంతో మైమరచినా, విజయాలు సాధించినా, అపజయాలు ఎదురైనా, మానవుడు హేతువును విడిచి ఏం సాధించాడు? విజ్ఞానశాస్త్రానికి హేతువును సోపానాలుగా అమర్చనిదెక్కడ? ఏ దశలోనూ విజ్ఞానశాస్త్రం హేతువును వీడలేదు.

ఆపిల్‌పండు చెట్టునుండి క్రిందపడటాన్ని పరిశీలించే కదా న్యూటన్ ఆధునిక విజ్ఞానశాస్త్ర చరిత్రలో నూతన శకానికి నాందిగా నిలచిన గురుత్వాకర్షణ సిద్ధాంతాన్ని ప్రతిపాదించింది? అందులో హేతువాదం లేదా? శక్తికి, త్వరణానికి మధ్య ఉండే సంబంధమే అనేక సమస్యలకు మూలమై శతాబ్దాల అనంతరం ఐన్‌స్టీన్ సామాన్య సాపేక్ష సిద్ధాంతానికి దారితీసింది మరలా ఆ గురుత్వాకర్షణ శక్తియే కదా? ప్రకృతిలోని ఇతర మౌలిక శక్తులతో విలీనానికి దారి చూపే దశలో శాస్త్రజ్ఞులను ఆశా నిరాశలలో తేలుస్తున్నది. ఇది హేతువాదం కాదా? ఫారడే, మాక్స్‌వెల్‌ల విద్యుదయస్కాంత క్షేత్ర పరిశోధనలు 19శతాబ్దపు మహత్తర విజయాలుగా నిలువలేదా? ఈ పరిశోధనల మేలు కలయిక ఫలితాలే కదా మానవ జీవన పార్శ్వాలను నిలువెల్లామార్చి వేసింది? మాక్స్‌వెల్ సమీకరణాలు గణితశాస్త్ర బద్ధంగా లేవనీ, కొద్దిపాటి తేడా చూపుతున్నవనీ, కాంతి, విద్యుత్తు, అయస్కాంత తత్వము ఎలా పరివర్తన చెందుతాయనే విషయం ఐన్‌స్టీన్ తన విశిష్ట సాపేక్ష సిద్ధాంతం ద్వారా వివరించలేదా? ఇవన్నీ ఒకదానికొకటి అనుషంగికాలు కావా? పూర్వోత్తర కారణాలుగా అవి ధృవపడటం లేదా? అవి హేతువులు కావా? హేతువాదం కాదా?

20వశతాబ్దం ప్రధమార్ధంలో ద్రవ్యానికి – కాంతికి కణస్వభావమే గాక, తరంగస్వభావం కూడా ఉంటుందని కనుగొనలేదా? అది క్వాంటం మెకానిక్స్‌లో ప్లాంక్, బోర్, ష్రోడింజర్, హైజెన్‌బెర్గ్ చేసిన పరిశోధనలతో సమన్వయించబడలేదా? కణం యొక్క ద్రవ్యరాశి దానిలోని శక్తిపై ఆధారపడుతుందనీ, అప్పుడు అది కణంగా ఉండజాలదనీ, శక్తి యొక్క తీవ్రతే దాని ద్రవ్యరాశిగా వ్యక్తమౌతుందనీ అంటూ సిరాక్ క్వాంటం మెకానిక్స్‌లో తన సాపేక్ష తరంగ సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టాడు కదా! 20 సంవత్సరాల అనంతరం ఫెన్‌మాన్, జిరాక్ సిద్ధాంతానికి ప్రత్యామ్నాయంగా పెర్చుబ్రేషన్ సిద్ధాంతం కనుగొలేదా? అంతలోనే పెర్చుబ్రేషన్ విధానం లోప భూయిష్టంగా ఉందంటూ పరమాణువుల అంతర చలనాలు – వాటి ప్రవర్తన విభిన్నంగా ఉండటంతో వాటికి పూరకాలుగా రకరకాల సిద్ధాంతాలు మలచబడ్డాయి. విషయాలను మరింత క్లిష్టపరుస్తూ కొత్త కొత్త పరమాణు శకలాలు, వాటి వింతపోకడలు, ఆకర్షణ రకాలు కనుగొంటూ వాటి భౌతిక ధర్మాలు, గతిసూత్రాలు కనుగొనబడలేదా? వీటన్నింటిలో హేతువు

నన్వయించనిదెక్కడ? పరమాణువుల కీకారణ్యంలో మరింత విస్తృత పరిశోధనలు చేసిన గెల్‌మాన్ 60వదశకంలో 'క్వాజి లాజికల్ ఎయిట్ ఫోల్డ్ వే' ను కనుగొని ప్రభావం చూపలేదా? తరువాత ప్రయత్నం ప్రకృతిలోని చతుర్విధ బలాలను (క్షేత్రాలను) కేంద్రక బలహీన శక్తి, కేంద్రక గాఢబలం, విద్యుదయస్కాంత శక్తులను సలాం, వీన్‌బెర్గ్, గ్లాషోలు ఏకం చేయగా, తరువాత ప్రయత్నాలు స్ట్రింగ్ థియరీకి దారితీసి, సంప్రదాయ క్వాంటం సిద్ధాంతం భావనల నుండి బయటపడవేసింది. దీంతో సైద్ధాంతిక భౌతిక శాస్త్రం పట్ల మళ్లీ ఆశలు చిగురించి గురుత్వాకర్షణ శక్తిని కూడా కలుపుకొని ఏకీకృత క్షేత్ర సిద్ధాంతానికి బాటలు వేయవచ్చని ఆశకల్పించారు. ఎడ్వర్ట్ విటెన్ ఇంతలోనే విశ్వ సృష్టిలోని మహా విస్ఫోటన సిద్ధాంతంలోనికి చంద్రశేఖర్ హాకింగ్‌లు తన కణసిద్ధాంతాన్ని జోడించి బ్లాక్‌హోల్ సిద్ధాంతాన్ని ఆవిష్కరించారు. విశ్వ విస్తరణ వాదపు భావన కాలానికి సంబంధించిన మౌలిక ప్రశ్నను లేవదీసింది. కాలప్రకృతినే ప్రశ్నించింది. ఏకదిశాత్మక కాలాన్ని మేధావులు సైతం దాని ప్రవృత్తిని అర్థం చేసు కోలేకపోయారు. కాలంలో వెనకకు అనే భావన గణితశాస్త్ర రీత్యా అర్థవంతంగా కనిపించినా, దాని భౌతిక అన్వయం మటుకు భౌతిక శాస్త్రజ్ఞులకు ఒక సవాలుగానే ఉంటూ వచ్చింది. కాలంలో జరిగిన సంఘటనల అచూకీ మనకు చిక్కడమా, లేక కాలంలో వెనకకు ప్రయాణిస్తే సంఘటనలు తలక్రిందులుగా పునరావృతమవుతాయా? అసలు రెండు భావనల మధ్య భేదమేమైనా ఉందా? ఈ ప్రశ్నతోనే మొదటిసారిగా క్వాంటం మెకానిక్స్‌లోని సంభావ్యతను తలక్రిందులుగా ప్రవేశపెట్టడం జరిగింది. ఈ పరిశోధనలన్నింటికి కొలమానం హేతువే. హేతువాదం - విజ్ఞానం పరస్పరాశ్రితాలుగా అప్రతిహతంగా ముందుకు సాగుతున్నాయి.

అయితే, అక్కడక్కడ హేతువాదం పైన,విజ్ఞానశాస్త్రం పైన విమర్శ లేకపోలేదు. ఆ విమర్శలు ఎలా సాగాయో ఎలా సమసి పోయాయో చూద్దాం.

క్వాంటం సిద్ధాంతంతో విజ్ఞాన శాస్త్రంలో కొన్ని చిక్కులు వచ్చాయి. ఫ్రెంచి శాస్త్రవేత్తలు లూయీ డీ బ్రోలీ ద్రవ్యానికి కణస్వభావమే గాక, శక్తివలె తరంగ స్వభావం కూడా ఉంటుందని ప్రతిపాదించాడు. క్రమంగా ఈ భావాన్ని ష్రోడంగర్, బోరన్, డిరాక్‌లు కూడా అభివృద్ధి చేశారు. ఫలితంగా కొత్త తాత్విక భావాలు అంకురించాయి. ద్రవ్యానికి కణస్వభావం, తరంగ స్వభావం అనే ద్వంద స్వభావం ఉంటుంది. దాని నుండే అనిశ్చయత అనే సమస్య మొదలైంది. అంతకు ముందే పరమాణు భౌతిక సూత్రాల పరిశోధనలో నీల్స్‌బోర్, డి.ఇ.బ్రోగ్లీ, ష్రోడింజర్,పాపులీ, హైజెన్‌బర్గ్, డిరాక్‌లు తమ ప్రయోగాలు పరిశీలనల ద్వారా ప్రకృతిని తరచి చూచినపుడల్లా ప్రకృతి పరస్పర విరుద్ధ ధర్మాలతో వ్యక్తమైంది. ఇలాంటి వైరుధ్యం పరమాణు భౌతిక శాస్త్రం సహజధర్మమని చాలా కాలానికి గాని శాస్త్రజ్ఞులు తెలుసుకోలేక పోయారు.అదే క్రమంలో హైజెన్‌బర్గ్ కనుగొన్న అనిశ్చియతా సూత్రాన్ని తత్వశాస్త్రంలో ఇరికించి ప్రకృతిలో ఏ సంఘటనకు నిర్దిష్టంగా నిర్ణయించడం సాధ్యం కాదనే అభిప్రాయం వ్యాపింపచేశారు. సంఘటనలను సంభావ్యతా రూపంలో మాత్రమే

చెప్పగలం కాని నిర్దేశంగా చెప్పలేము. మానవుని విజ్ఞానానికి నిర్దేశితత్వం లేదనీ అది ఎన్నటికీ ఖచ్చితంగా అవగాహన చేసుకోలేమనే తాత్విక భావన ప్రబలింది. అంటే , విజ్ఞానానికి పూర్తి వాస్తవికత లోపిస్తుందనే అభిప్రాయం కలిగింది. కేవలం విజ్ఞానానికే గాక, మనకు గోచరమౌతున్న ప్రపంచ దృశ్యానికి కూడా వాస్తవికత లేదనీ, అసలైన వాస్తవాన్ని మనం ఎన్నటికీ గ్రహించలేమనే వాదన ప్రబలింది. పూర్వం కాంట్ చేసిన వాదనను రంగం మీదకు తెచ్చినట్లయింది. అయితే ఈ వాదంతో ఐన్‌స్టీన్, డీబ్రోలి, డేవిడ్‌బోమ్‌లు ఏకీభవించలేదు. ఈ సమస్యను బ్రౌనియన్ చలనం, కారణాత్మక అనియత క్వాంటం సిద్ధాంతం ద్వారా అధిగమించారు. క్వాంటం మెకానిక్స్‌లో అనిశ్చయత అనివార్యమైనా, అంతమాత్రాన కార్యకారణతను ఎందుకు త్రోసివేయాలో వారు చెప్పరు. నియతివాదం లేకుండా కార్యకారణతలేదు. పాగ్రుప్తాలు,జోడించడాలు వినా భౌతికశాస్త్రం ఉండదు. అవి లేకపోతే విజ్ఞానశాస్త్రాభివృద్ధి లేదు. అనిశ్చయత అనేది మన గ్రహింపులోనికి వస్తున్నదంటే అది నియతవాదానికి లోబడి వస్తున్నదని మనం గ్రహించాలి.

ఆధునికభౌతికశాస్త్ర విభాగమైన క్వాంటం సిద్ధాంతాన్ని, అందులోని అనిశ్చయతా సూత్రం మీద ఆధునికానంతర వాదులు నొక్కిపెడుతూ భౌతిక శాస్త్రాన్ని ఎందుకు నిరాకరిస్తున్నారు? కార్యకారణ వాదాన్ని నిరాకరించే ఆధునికానంతర వాదులు కార్యకారణలేని భౌతికశాస్త్రాన్ని వారు నమ్మాలి.కాని, కార్యకారణతలేని భౌతికశాస్త్ర ఉనికి సాధ్యమా? చివరకు వారు భౌతికశాస్త్రాన్ని కూడా అంగీకరించరు. ఆధునికానంతరవాదం ప్రవచించే సమాజ శాస్త్రాల అధీనంలో భౌతికశాస్త్రం నడవాలని వారు అభిలషిస్తారు. భౌతికశాస్త్రంలోని అనిశ్చయతా సూత్రాన్ని వారు తమకనువైన రీతిలో మలచుకున్నారు. తాము అన్వయించిన సిద్ధాంతాలకు అవరోధంగా ఉండే క్రమంలో కార్యకారణ వాదాన్ని, నియతివాదాన్ని తిరస్కరిస్తున్నారు.

సహేతుకతను సంప్రదాయ పద్ధతిలో ఎల్లప్పుడూ అన్వయింపచేయడం సాధ్యంకాదు. రెండు వరుస సంఘటనల మధ్య సంబంధం ఉన్నదంటే వీటికి సంబంధం కల్పించే నియమమొకటి వాటి మధ్య ఉన్నదనే అర్థం. భౌతికశాస్త్రం యావత్తు వ్యతిరేక భావన మీద ఆధారపడి అభివృద్ధి చెందుతుంది. సహేతుకత్వ నియమాల్ని- అంటే ఆ సంఘటనను ముందే నిర్దుష్టంగా చెప్పాలంటే దానిలో మార్పులను పసిగట్టడమే మనం చేయవలసిన పని.విడి గమనికను సంఘటనగా భావించరాదు. భౌతిక ప్రపంచంలోని సంఘటనలన్నీ సహేతుకత్వంగా నిర్ణయించడానికి పనికి వచ్చే నియమాల ననుసరించే జరుగుతాయి. నియమబద్ధమైన ఈ విశ్వంలో అనివార్య భాగమైన వ్యక్తి నియమాలకనుగుణంగానే ప్రవర్తిస్తున్నాడు. అతనిలోని హేతుత్వశక్తి అందుకు దోహదపడుతుంది. అందుకనుగుణంగా కాక ప్రవర్తిస్తుంటే, అవగాహన రాహిత్యం వల్ల,హేతుబద్ధత లోపించి నందువలన మాత్రమే కాని, మనిషి హేతుమంతుడు కానందువల్ల మాత్రం కాదు. నిరంతర విజ్ఞానాన్ని సాధిస్తున్న మానవుడు దాన్నే ఊతంగా తీసుకొని తన హేతుత్వాన్ని మరింత పదును దేర్చుకుంటున్నాడు.

అయితే, ఆధునికానంతర వాదులు కార్యకారణత మీద ఆధారపడిన శాస్త్ర విజ్ఞానాన్ని,మనిషి హేతుత్వాన్ని తిరస్కరిస్తున్నారు. హేతువాదం ప్రాసంగికతను కోల్పోయిందని వ్యాఖ్యానిస్తున్నారు. సైన్సు మతం లాంటి ఒక విశ్వాసంగా ప్రబలిందన్న పాల్ ఫెయిరా బాండ్ వ్యాఖ్యను వారు అరువు తెచ్చుకుంటున్నారు. 19వశతాబ్దం సైన్సు 20వ శతాబ్దంలో తాత్వికంగా గౌరవాన్ని కోల్పోయిందంటారు ఆధునికానంతర వాదులు. అయితే 19వ శతాబ్దంలోని ఏ పరిశోధనా గౌరవం పోగొట్టుకోలేదు. విజ్ఞానశాస్త్ర దశలో కొన్ని కొత్త పరిశోధనా ఫలితాలు అప్పుడే ఆమోదించబడుతున్న సూత్రాలకు అనుగుణ మనిపించవు. అప్పుడు పాత కొత్తసిద్ధాంతాల మధ్య అంతర్వైరుధ్యాలు ఏర్పడతాయి. అలజడి రేగుతుంది. గందరగోళ మేర్పడుతుంది. శాస్త్రం సాంప్రదాయ బద్ధత నుండి సంప్రదాయవిచ్ఛేదన దశకు చేరుతుంది. ఇలా కొత్త రూపంలో ఏర్పడిన దానినే విప్లవాత్మక సైన్సుగా పరిగణిస్తారు.కేవలం దాన్ని ఆధారం చేసుకొని సైన్సు ఫలితాలను సందేహించడం. అహేతుబద్ధ స్థితిగా సంభావించకూడదు. మానవుడి హేతుత్వమే వాటి పరీక్షకు గీటురాయిగా మారుతుంది. అలా శాస్త్రబద్ధతను ఏదో ఒక దానిని, ఒకానొక సమయంలో అన్వయించలేక పోయినంత మాత్రాన సైన్సును, సైన్సుగా పరిగణించరాదన్న అహేతుకత్వ భావనను పట్టుకొని హేతువాదం ప్రాసంగికతను కోల్పోయిందని చెప్పబూనడం సాహసమౌతుంది.అందువలన, 19వశతాబ్ది సైన్సు 20వశతాబ్ది ద్వితీయార్ధంలో తాత్వికంగా గౌరవం కోల్పోయిందన్న ఆధునికానంతర వాదుల విశ్లేషణలో వాస్తవం కానరాదు. విజ్ఞానశాస్త్ర రంగంలో విప్లవాలు తెచ్చిన అనేక విజ్ఞానశాస్త్ర సిద్ధాంతాలు 19వశతాబ్దిలో ఆవిర్భవించినవే.

విజ్ఞానశాస్త్రం విఫలమయిన సందర్భాలున్నాయంటూ మరో అనుచిత విమర్శ ఉంది. విజ్ఞానశాస్త్రాన్ని ఉపయోగితా వాదంగా చూడటంతో ఈ పొరపాటుకు ఆస్కారమేర్పడింది. సాంకేతిక శాస్త్రాన్ని అందులోని తప్పులను, అన్వయలోపాన్ని విజ్ఞానశాస్త్రానికి ఆపాదించరాదు. విజ్ఞానశాస్త్రం మానవులకు మంచో చెడో చేయడానికి ఉద్దేశించినది కాదు. అది సత్యగ్రహణ ప్రక్రియ. గ్రహించిన సత్యాలను మానవ జీవనానికి ఏ మేరకు అన్వయించుకోవాలన్నది మానవుడి హేతుబద్ధత మీద ఆధారపడుతుంది.

వైజ్ఞానిక అభివృద్ధికి నూతన శక్తిని ఇవ్వగలిగింది మౌలికంగా నూతన ఆవిష్కరణలే. వైజ్ఞానిక పద్ధతిలో కథా చితుగా ద్యోతకమయ్యే అస్పష్టతలను ఆధారం చేసుకొని విజ్ఞానశాస్త్రం మొత్తాన్ని తృణీకరించడం సమంజసం కాదంటారు కారల్‌పాపర్. అలాగే విజ్ఞానశాస్త్రం వల్ల జ్ఞానం పెరుగుదల సాధ్యమైంది. దానిని నిరాకరించి సత్య మీ మాంసను కేవలం భాషా సమస్యగా కూడా చూడరాదంటాడు పాపర్. అయితే, ఆయన కన్నా ముందే విజ్ఞాన శాస్త్రాల అభివృద్ధి వల్ల, అది కలిగించే ఆవిష్కరణల వల్ల, అది భౌతిక సత్యమీమాంసను తుడిచి పెట్టేయ వచ్చునంటాడు ఎర్నెస్ట్‌మాక్. అందువలన అనుభవ వాదాన్ని వైజ్ఞానిక అనుభవ వాదంగా మార్చవచ్చు. అంతేగాని సైన్సుకు- హేతుత్వానికి పరిమితులున్నాయని వ్యాఖ్యానించడం కేవలం కువ్యాఖ్యానమే.

మనం సాధించిన వైజ్ఞానికాభివృద్ధి, ప్రకృతిలో ఆవిష్కరించాల్సిన వాటితో పోల్చుకుంటే అల్పజ్ఞతగా తోచినా,మానవుడార్జించిన విజ్ఞానం సర్వజ్ఞతకు దగ్గరగానే ఉంటుంది. మరల అందులోనే ఎన్నో సంక్లిష్టతలు, సంఘర్షణలు, బేధాలు, విబేధాలు, ప్రాచీనతలు, ఆధునికతలు, ఆధునిక భౌతిక శాస్త్రం తన నిర్మాణంలోనే సంప్రదాయ భౌతికశాస్త్రాన్ని ఇముడ్చుకుంది. విజ్ఞానశాస్త్రంలోని ఏ విభాగమూ తనకు తనే సంపూర్ణం అనుకోరాదు. సంప్రదాయ భౌతికశాస్త్రం - ఆధునిక భౌతిక శాస్త్రం మధ్య ప్రబేధం చూడరాదు. విజ్ఞానం ఒక ప్రవాహ సదృశ్యం.

అందువల్లనే ఆధునికానంతర వాదాన్ని త్రోసి వేసి, గెలీలియో, న్యూటన్, ఐన్‌స్టీన్‌లను, వారి భావనలను రంగం మీదకు తీసుకు వస్తున్నది విజ్ఞానశాస్త్రం. శాస్త్రానికున్న అనన్యతను పరిగణిస్తున్నది. కార్య కారణీయతను సమాదరిస్తున్నది. అది అనివార్యం కూడా. క్వాంటం భౌతికశాస్త్రంలోని విరోధాభాసలను, సాపేక్ష వాదాన్ని, ప్రాసంగికత కోల్పోయిందని విమర్శించబడ్డ హేతువాదాన్ని తిరిగి చర్చిస్తున్నది. అందుకు ప్రబల ఉదాహరణ ఏప్రిల్ 20,2004న నాసా కేంద్రం ఐన్‌స్టీన్ సామాన్య సాపేక్ష సిద్ధాంతం ద్వారా చెప్పిన- భూమిఉనికి దేశకాలాలను ఎలా వంపుతిప్పుతుందో, భూభ్రమణం వల్ల ప్రదేశకాలాలు ఎలా మార్పు చెందుతాయో ఋజువు చేయడానికి ప్రయోగించిన గ్రావిట్ ప్రొబ్ -బి. ఈ ప్రయోగాల పరిశోధనల ఫలితాలు వెల్లడి కావడానికి ఆరునెలల కాలం పడుతుంది.

అదంతా మానవ జిజ్ఞాసా క్రమంలోని పరిణామమే. అందుకు కారణం మానవుడు హేతుమంతుడు కావడమే. ఇలా విశ్వ రూప రహస్యాలను మనిషి నిరంతరంగా ఎందుకు పరిశీలిస్తునట్లు? పరిశీలించి వాటిని క్రమబద్ధమైన విజ్ఞానంగా ఎందుకు అమరుస్తునట్లు? అని ప్రశ్నించుకుంటే, అది మానవుడి సహేతుకతలో భాగం కనుక అవే జవాబు మనకు లభ్యమౌతుంది. అందువల్ల, హేతువాదం-విజ్ఞానశాస్త్రం పరస్పరాశ్రితాలుగా మనకు తేలుతుంది.

విశ్వంలోకి తొంగిచూడటం, పరిశీలించడం,పరిశోధించడం అనేది ఒక నిరంతర ప్రక్రియ.ఇంతకు ముందు కనుగొన్న దానిపైన ఆధారపడే క్రమంగా, తరువాత విషయాలు మనం కనుగొనగలుగుతాం . ఇదే విషయాన్ని ఇద్దరు విజ్ఞానవేత్తల పలుకుల్లో ఎలా ఉంటాయో చెప్పి ఈ వ్యాసం ముగిస్తాను.

న్యూటన్ తన చిరకాల ప్రత్యర్థి రాబర్ట్ హుక్‌కు వ్రాస్తూ"నేను ఇంత ముందుకు చూడగలుగు తున్నానంటే, నా కన్నాముందున్న విజ్ఞానవేత్తల భుజాల మీద నిల్చొని చూడటమేనంటూ" తనకు ముందు విజ్ఞాన పరిశోధనలు గావించిన వారికృషి తలమానికంగా తలపోస్తాడు.

అదే మాటలను నేడు 300సం॥ల తర్వాత కేంబ్రిడ్జిలోని లుకేషియన్ గణిత పీఠాన్ని న్యూటన్ జ్ఞానవారసుడిగా అధిరోహిస్తూ స్టీఫెన్ హాకింగ్ "నేను నాకన్నా ముందున్న విజ్ఞానుల భుజాలను స్ప్రింగ్ బోర్డులుగా వినియోగించుకుంటాను". అన్నమాటలు హేతువాద వారసత్వాన్ని - విజ్ఞా వారసత్వాన్ని చెప్పకనే చెబుతాయి.

# హేతువాదం పిల్లలకు చెప్పొచ్చా?

- ఎన్. ఇన్నయ్య

పిల్లలందరూ శాస్త్రీయ (వైజ్ఞానిక) చింతన గలవారే. పిల్లలో ప్రశ్నించే స్వభావం తెలుసుకోవాలనే ఆసక్తి, కొత్త విషయాలపట్ల ఉత్సాహం వుంటుంది.

పిల్లలు వేసే ప్రశ్నలేవీ పనికి రానివి కావు. అడగరాని ప్రశ్న అంటూ ఏదీ వుండదు. చిన్న పిల్లలు తల్లిదండ్రుల్ని, అన్నదమ్ముల్ని, అక్కచెల్లెళ్ళని ముందుగా అడుగుతారు. తరువాత పెరిగే కొద్దీ బంధువులను, చుట్టు పక్కల వారిని అడుగుతారు. బడికి పోతుంటే టీచర్లను, తోటివారిని అడుగుతారు. నేర్చుకుంటూ ప్రశ్నలు అడగడం పిల్లల స్వభావం. ఇది సహజంగా అందరిలో ఉంటుంది. పిల్లల ప్రశ్నల్లో తెలివి తక్కువ ప్రశ్నలు అనేవి ఏవీ వుండవు. ప్రశ్నలన్నీ అడగవలసినవే. ప్రశ్నలడిగే పిల్లలందరూ హేతువాదులే, శాస్త్రీయ పంథాలో నడిచేవారే.నేనెట్లా పుట్టాను అనే ప్రశ్న ఏదో ఒక సందర్భంలో పిల్లలు వేస్తారు. దీనికి సమాధానం ఎలా చెప్పాలో తెలియక, తల్లిదండ్రులు బుకాయిస్తారు, అబద్ధాలు చెబుతారు.

ఆకాశాన్ని చూపించి అదేమిటి అని అడిగితే, కట్టుకథలు చెప్పేవారెందరో వున్నారు. "నాకు తెలియదు, తెలుసుకొని చెబుతాను". అనగలిగిన తల్లిదండ్రులు, టీచర్లు అరుదు. అది వారి బలహీనతకు సూచన. అంతటితో ఆగక పిల్లల్ని నోర్మూసుకోమంటారు. అలాంటి ప్రశ్నలు వేయకూడదంటారు. కళ్ళు పోతాయంటారు. అట్లాంటి ప్రశ్న అడిగితే తంతామంటారు.

పిల్లలో వున్న హేతు స్వభావానికి తొలి ఆటంకాన్ని ఆ విధంగా కల్పిస్తారు. ప్రాథమిక విద్యాదశలో ప్రశ్నలు వేసే పిల్లలు,హైస్కూలు స్థాయికి వెళ్ళే సరికి, ప్రశ్నలు వేయడం తగ్గిపోతుంది. ఏమి అడిగితే ఏమనుకుంటారో అనే తటపటాయింపు వస్తుంది. అందుకు బీజాంకురాలన్నీ ప్రాథమిక విద్యాస్థాయిలో అటు తల్లిదండ్రులు, ఇటు టీచర్లు సమాజంలోని వారు వేస్తున్నారు. హేతుత్వం దెబ్బతింటున్నది.చిన్న పిల్లలో నమ్మకాలు, ఛాందసాలు, భయాలు వుండవు. అవన్నీ నేర్పే దోషం పెద్దలదే! తల్లిదండ్రులు చెప్పేదంతా నిజం అని తొలిదశలో పిల్లలు అనుకుంటారు. కనుక పిల్లలకు జాగ్రత్తగా చెప్పాలి. తల్లిదండ్రులు చెప్పిన వాటికీ తోటిపిల్లలు చెప్పిన వాటికీ విరుద్ధత్వం వుంటే, సందేహంలో పడతారు. ఒకే నమ్మకాన్ని అదే పనిగా వింటుంటే పిల్లల్లో కూడా గట్టి విశ్వాసం కలుగుతుంది. లేకుంటే, ఒక్కసారి విన్న నమ్మకం కొన్నాళ్ళకు మరిచిపోతారు.

చిన్నప్పుడు నూరిపోసిన నమ్మకాలు అలా నాటుకపోయినందుకే పెద్దయిన తరువాత అవి ఒక పట్టాన వదలవు. సైన్స్, సాంకేతికం చదువుకున్న వారిలో నమ్మకాలు వుండడానికి అదే కారణం. అందుకే అప్పుడప్పుడు బాబా శిష్యులలో, మాతలశుశ్రూషలో మనకు సైంటిస్టులు, డాక్టర్లు, ఇంజనీర్లు తగులుతారు. వారంతా వారి పరిధిలో శాస్త్రీయ పద్ధతిని అనుసరిస్తారు. ఇతర విషయాలకు అదే పద్ధతి ప్రవేశపెట్టరు. అలా చేయగలిగితే నమ్మకాలు చెదరిపోతాయి.ఇది సమాజంలో కనిపిస్తున్నతీరు.పరిణామ సిద్ధాంతాన్ని పాఠాలుగా, శాస్త్రీయంగా చెప్పే ప్రొఫెసర్ ఆంజనేయ విగ్రహాన్ని ఎందుకు కొలుస్తాడని అడిగితే, ఇదే సమాధానం. నమ్మకాన్ని, శాస్త్రీయ పంథాను వేరు చేసి, దేనికదే అట్టి పెడతారు.చిన్నప్పటి నమ్మకాల బలం అలా పనిచేస్తుంది.

ప్రకృతి గురించి పిల్లలు ఆసక్తి కనబరుస్తారు. రాత్రిళ్ళు కనిపించే చంద్రుడు, తారలు, మిణుకులులేని గ్రహాలు చూచినప్పుడు పిల్లల్లో ఆశ్చర్యం,ఆసక్తి కలగడం సహజం. అందులోనుండి చక్కని ప్రశ్నలు వస్తాయి. చంద్రుడు గుండ్రంగా ఎందుకు కనిపిస్తాడు? పిల్లవాని ప్రశ్న అయినా చాలా సైన్స్ చెప్పాల్సివస్తుంది. పెద్దలకే అసలు విషయం తెలియక పోవచ్చు. ఆకాశం నీలంగా

ఎందుకు కనిపిస్తుంది? చెట్లు పచ్చగా ఎందుకుంటాయి? గాలిని ఎవరు పుట్టించారు? పిల్ల ప్రశ్నలే ఎంతగొప్పవి! అప్పుడు చెప్పే సమాధానాలు గుడ్డిగా నమ్మకాల మయం చేస్తే ఇక భవిష్యత్తులో ఛాందసం మిగులుతుంది. పిల్లలకు భక్తి,దైవచింతన, దేవాలయాలకు వెంటబెట్టుకు వెళ్ళడం, మొక్కుబడులతో గుండు గీయించడం, మంత్రాలు కంఠస్తం చేయించడం మొదలైనవన్నీ తల్లిదండ్రుల దృష్టిలో మంచివే. పిల్లలకు క్రమశిక్షణ పేరిట యివన్నీ చేస్తున్నారు. పెద్దల్లో వున్న అలవాట్లు, ఆచారాలు, నమ్మకాలు, ఛాందసాలు తప్పు అనుకోవడంలేదు. కనుక వంశపారంపర్యంగా పిల్లలకు అలవాటు చేస్తున్నారు. ఒక రకంగా యిది కులవృత్తి అన్నమాట. నమ్మకాల అంటురోగం అనవచ్చు.తరతరాలుగా ఇది సాగిపోతూనే వుంది. పిల్లలు ప్రశ్నించినప్పుడు తప్పుఅనడం,పాపం చుట్టుకుంటుంది అని అజ్ఞానాన్ని ప్రవేశపెట్టడం,పెద్దల దోషమే.

అంటే పిల్లల్లో సహజంగా వస్తున్న జిజ్ఞాసను, శాస్త్రీయ చింతనకు హేతుస్వభావాన్ని పెద్దలు వక్రీకరిస్తున్నారన్నమాట. అక్కడే కీలకం వుంది. కార్యకారణ సంబంధం చూడండి. ప్రతిదానికి కారణం వుంటుందని పిల్లలకు చెబుతాం. ప్రశ్నల పరంపరలో ఎక్కడో ఎదురు తగులుతుంది. ఉదాహరణకు 'నేనెట్లా పుట్టాను' అంటే, తల్లిదండ్రులకు అదే జవాబుకు మరోప్రశ్న పుడుతుంది. వాళ్ళెలా పుట్టారు? అలా అడుగుతూ పోతే, తొలుత ఎవరు పుట్టించారు? ఇంకా తెలియదు తెలుసుకుందాం అనడం నామోషీ కనుక దేవుణ్ణి ఒకపాత్రగా ప్రవేశపెడతారు. అంతవరకూ బాగానే వుంది. కాని, పిల్లల్లో కార్యకారణ సంబంధం తెలుసుకునే కుతూహలం వుంటుంది గదా? దేవుణ్ణి ఎవరు పుట్టించారు అని యధాలాపంగా అడుగుతారు. కార్యకారణ సంబంధానికి బ్రేక్ పడింది. సమాధానం చెప్పలేరు, తెలియదు అనలేరు. అహంకారం అడ్డొస్తుంది. నోర్మూసుకో, చంపేస్తాను, కళ్ళుపోతాయి ఇత్యాది కోపతాపాలన్నీ పిల్లలపై ప్రయోగిస్తారు. ప్రశ్న అడగడంతప్పు అయితే, తెలుసుకోవడం జరగదు. అజ్ఞానం తొలగదు. ప్రకృతి మార్మికంగానే వుంటుంది. పిల్లల్లో అన్వేషణ ఆగిపోతుంది. అదే వారిపట్ల అపచారం. ఇది నిత్యకృత్యంగా జరుగుతున్నది.పిల్లల్ని మలచుకోవాలని, స్వేచ్ఛగా వదలేస్తే తమ మాట వినరని అందరి కంటే ముందు మాతలు గ్రహించారు. అందుకే పవిత్ర మతగ్రంథాలలో స్పష్టంగా రాశారు. చిన్నప్పటినుండే దేవుణ్ణి,మతాన్ని మతనీతిని నూరిపోయమన్నారు. అందుకు అవసరమైతే పిల్లల్ని కొట్టడం తప్పదన్నారు. ఖురాన్, బైబిల్, హిందూ పవిత్రగ్రంథాలన్నీ పిల్లల్ని దండించమనీ, మతవిశ్వాసాల్ని బుర్రకెక్కించమనీ ఆదేశించాయి.అదే పవిత్ర కార్యంగా జరుగుతున్నది. పిల్లలు చెడిపోడానికే, నమ్మకాలు వూబిలో కూరుకు పోడానికీ ఇదే ముఖ్యకారణం. ఖురాన్‌లో 6వేల సురాలను ముస్లిం మదరసాలలో బలవంతాన వల్లె వేయిస్తున్నారు. అర్థం తెలియాల్సిన పనిలేదు.

సండే స్కూల్స్ పేరిట క్రైస్తవులు బైబిల్ కథల్ని తియ్యగా బోధిస్తున్నారు.బైబిల్ బానిసత్వాన్ని వెనకేసుకురావడం కూడా పవిత్రంగానే చూపుతున్నారు. క్రైస్తవం పిల్లల్ని అణచి వేయడంలో ప్రత్యేక టెక్నిక్‌లు ప్రయోగిస్తున్నది.క్రైస్తవమతంలో దేవాలయ సేవల పేరిట పిల్లల్ని లైంగికంగా వాడు కుంటున్నారు. అనేక కేసుల్లో ఫాదరీలు ఇరుక్కున్నా ఈ దురాచారం సాగిపోతున్నది. మతం పేరిట పిల్లలకు ఏం జరిగినా కళ్ళుమూసుకునే తల్లిదండ్రుల వలన ఇవి సంభవిస్తున్నాయి. మతం పేరిట గురుకులాల్లో హిందువులు చిరకాలంగా పిల్లల్ని తమ మార్గంలో మూసబోస్తున్నారు. ఆశ్రమాలలో చిన్నప్పటినుండీ ఆచార్యులను,గురువులను తయారుచేస్తున్నారు. రాజకీయపార్టీలకు అనుబంధంగా వుండే మత ముసుగు సంస్థలు పిల్లల్ని ఆకర్షించే కసరత్తులు, నినాదాలు, బోధనలు

చేస్తున్నారు. ముస్లింలు, క్రైస్తవులకు దీటుగా పిల్లల్ని మతంలోకి మార్చి, హింసాయుతమార్గాలకు దారితీసే ప్రక్రియలు చేబడుతున్నారు.

పిల్లల్ని ఈ విధంగా చెడగొట్టడం దురాచారం. హేతువాదం అదే వద్దంటుంది. అందుకే హేతువాదం అంటే దుష్ప్రచారం చేస్తారు. ఇది అసలు రహస్యం.

**దేవుడులేదనడమే హేతువాదమా!**

హేతువాదులు నడిపే పాఠశాలలకు పిల్లల్ని పంపిస్తే, దేవుడు లేదని నేర్పిస్తారని తల్లిదండ్రులలో ప్రచారం చేస్తున్నారు. ఆ భయంతో కొందరు తమ పిల్లల్ని పంపడంలేదు. అసత్యాలను టోకుగా ఎలా ప్రచారం చేస్తారో ఇదొక నిదర్శనం. దేవుడు లేదనే ప్రచారం హేతువాదంలో మూలాంశంకాదు. ప్రతిదీ కార్యకారణ సంబంధం ద్వారా గ్రహించాలనీ, ప్రశ్నించి తరచి తెలుసుకోవాలనే వైజ్ఞానిక దృక్పథం కావాలనే పిల్లలకు చెప్పడమే హేతువాదం. అలా నేర్పిన పిల్లలు ప్రశ్నలు వేస్తున్నా, సందేహాలు వెలిబుచ్చుతున్నా జవాబు చెప్పలేక, హేతువాదం పై నిందలు వేయడం పరిపాటి అయింది. గుడ్డినమ్మకాలను మూర్ఖవాదనలను బలవంతంగా రుద్దేవారు హేతువాదాన్ని తట్టుకోలేరు. అసలు సంగతి అది.

ఉదాహరణకు మన సమాజంలో అత్యంత దారుణమైన కులవ్యవస్థ, అంటరానితనం, బాల్యవివాహాలు, సతీసహగమనం,కట్నాలు, స్త్రీ, పురుష అసమానత్వం, దేవతల ప్రీతికి బలులు, వర్షాలకు ప్రార్థనలు, చదువురావాలంటే వినాయకుడికి మ్రొక్కి వెళ్ళమనడం ఇలాంటి ఎన్నో మతపరంగా వచ్చాయి. పవిత్ర మతగ్రంథాలు వాటిని సమర్థించాయి. అలాంటి మతంలో పుట్టి పెరిగినవారు,వాటిని వదులుకోలేక సతమతమౌతుంటారు. పిల్లలు వాటిని ప్రశ్నిస్తే, సమాధానం చెప్పలేక,హేతువాదంమీదబడి తప్పించుకుంటారు. ఇదో పెద్దలనిర్వాకం.

విగ్రహారాధన వదులుకోమని రాజారాంమోహన్‌రాయ్,వీరేశలింగం, దయానంద్ చెప్పారు. వారు చాలా గొప్పవారంటూనే మరోవైపు మానవుడు చేసిన విగ్రహాలనే ఆరాధించేవారి చిత్తశుద్ధిని పిల్లలు శంకిస్తే హేతువాదం మీదబడి గోలచేస్తారు. హేతువాదం పిల్లల్ని మానసిక ఆరోగ్యవంతుల్ని చేస్తుంది.ఇన్నాళ్ళు జరిగిన అభ్యుదయం హేతువాద దృష్టితో శాస్త్రీయ విజ్ఞానాన్ని అన్వయించిన ఫలితమే.ప్రాథమిక పాఠశాలల పాఠ్యప్రణాళికలో వైజ్ఞానిక దృక్పథంతో పాఠాలు రాయాలి. ఆకర్షణీయంగా విజ్ఞానం చెప్పాలి. సైన్స్, లెక్కలపేరిట ఆసక్తిలేనివారు బోర్ కొట్టించే రీతులు ఇన్నాళ్ళుగా ప్రవేశపెట్టారు. సైన్స్ చాలా చక్కని మానవ ఆయుధం. దానిని ఎంతో ఉపయోగికారిగా మలచుకోవచ్చు. లభించే పరికరాలతో సైన్స్ పాఠాలు చెప్పవచ్చు. ప్రకృతిని ఆకర్షణీయంగా బోధించవచ్చు. అదంతా హేతువాద పద్ధతే.

హేతువాదం బడిలో మొదలు పెడితే ఆ సమాజం ఎంతో పురోగమిస్తుంది. మానవశ్రేయస్సుకు తోడ్పడుతుంది. హేతువాదం సహకారభావం గలది. సహనం గలది. అంతా తెలుసు అనే మత పవిత్రగ్రంథాల అహంభావం హేతువాదంలో వుండదు. తెలుసుకోవడం నిరంతర ప్రక్రియగా హేతువాదం తలపోస్తుంది. అలాంటి అన్వేషణ ఆనందాన్నిస్తుంది. పిల్లల్ని వికసింపజేస్తుంది. ప్రపంచంలో అందరూ సమానం అనే మానవ భావానికి దారితీస్తుంది. మానవ విలువలు, మానవనీతికి స్థానం వస్తుంది.

# స్వకీయం - రావిపూడి వెంకటాద్రి

1940లో హైస్కూలు, విద్యార్థి దశలోనే నేను హేతువాద తరహా ఆలోచనకు మారాను. 1943లో కాలేజి విద్యార్థి దశలో కవిరాజాశ్రమం స్థాపించి, హేతువాద భావ వ్యాప్తికి కొంత తోడుపడ్డాను. అప్పట్లో కొంతమంది మిత్రులు "హేతువాదమంటే ఏమిటి?" అని తరచు నన్ను ప్రశ్నిస్తుండేవాళ్ళు. "కార్యకారణ పరీక్షకు నిలవని నమ్మకాలను వదలుకొని, నిలిచే నిర్ణయాలకు ఆమోదించడమే హేతువాద"మని నేను చెపుతుండేవాణ్ని. అందుకు అనుగుణంగా దైవం, మతం, మతగ్రంథాలు, మూఢనమ్మకాలు, ఆచార సంప్రదాయాలు, ఉచ్చనీచ తారతమ్యాల కులవ్యవస్థపై నమ్మకాలను వదలుకున్నాను. అయితే, అది మాత్రమే హేతువాదానికి గమ్యం కాదని ఆ తరవాత కొద్దికాలానికే గుర్తించాను. ప్రతి సత్యానికీ భౌతిక వివరణ కలదనీ, అది ఇవ్వవలసిన బాధ్యత హేతువాదులమీద ఉందనీ గ్రహించాను.

సహేతుకంగా ఆలోచించగల శక్తి మనుషులందరిలోనూ ఉంది. ఎవరి హేతుత్వ శక్తిని వారు వినియోగించుకోవడానికి స్వేచ్ఛ అవసరం. కాబట్టి,స్వేచ్ఛను చలాయించుకొనే శక్తిలేని హేతుత్వం నిష్ప్రయోజనమని తెల్సుకున్నాను. ఆ దశకు చేరడానికి నాకు ఐదారు సంవత్సరాలు పట్టింది. 1946 నుంచి నేను చేసిన రచనలన్నిటా ఈ దశ ప్రతిబింబించింది.

జ్ఞానం నుంచి అజ్ఞానాన్ని, సత్యం నుంచి అసత్యాన్ని, మంచి నుంచి చెడును, శక్యం నుంచి అశక్యాన్ని వేరుపరచి మనిషి చూడగలడు. ఈ విచక్షణాశక్తి వల్లనే మనిషిని మనం హేతుమంతుడుగా గుర్తిస్తున్నాం. దానికి సంబంధించిన మూలాల వెదకులాటే సత్యాన్వేషణ. దాని లక్ష్యం స్వేచ్ఛ. ఆ స్వేచ్ఛే మానవుడి జీవనాడి. స్వేచ్ఛాపిపాస అతని అభ్యున్నతికి మీటగా పనిచేస్తుంది. అందువల్ల, హేతువాదం మానవవాదం (హ్యూమనిజం)లో కృతార్థమవుతుంది. మానవుడి కోసం కాకపోతే, సత్యాన్వేషణ ఎందుకు? నాస్తికత్వమెందుకు? వాటికవే లక్ష్యాలయితే, వాటి లక్ష్యం మానవుడి సంక్షేమం, సుఖసంతోషాలు కాకపోతే - మానవుడి దృష్ట్యా అవి అనావశ్యకాలే. ఈ ఆలోచనే నన్ను హ్యూమనిజానికి చేర్చింది.

హేతువాదాన్ని (కార్యకారణతను) ఆశ్రయిస్తే, అంతిమ కారణంగా దైవాన్ని ఆమోదించవలసి వస్తుందనే అపోహలో కొందరున్నారు. అందువల్ల నాస్తిక నిర్ణయానికి చేరడానికి హేతువాదం అవసరం లేదని వారు వాదిస్తారు. అలాంటి వారు కూడా ఉండగలరని 1977కు పూర్వం నాకు తెలియదు. నిజానికి, కార్యకారణాలు ప్రకృతి అంతర్గత విషయాలు. వాటిని ప్రకృతిలోనే చూడగలవారికి ప్రకృతికి వెలుపల కారణాన్ని వెదకే అవసరం లేదు. కార్యకారణాలను ప్రకృతి లోపల చూడడం భౌతికవాదం. భౌతికవాద దృక్పథం లేని నాస్తికత్వం తలలేని మొండెం లాంటిది.

కావలి హేతువాద మిత్రులు "హేతువాద వ్యాసాలు" అనే సంకలనాన్ని ప్రచురించాలని సంకల్పించారు. అందు నిమిత్తం "హేతువాదం" పై ఒక వ్యాసం రాసి పంపమని నన్ను కోరారు. అందుకోసం 1977 ప్రారంభంలో "హేతువాదం నాస్తికత్వానికి జీవగఱ్ఱ" శీర్షికతో నేనొక సుదీర్ఘ వ్యాసం రాసి పంపాను. అందులో నేను తొలిసారిగా హేతువాద సిద్ధాంత ప్రతిపాదికలను చర్చించాను. హేతువాద లక్ష్యం హ్యూమనిజమేనని అందులో నేను తేల్చాను.

"హేతువాదమంటే ఏమిటి?" అనే ప్రశ్న ఇప్పుడు వెనుకబడిపోయింది. "హేతువాద మంటే దేవుడు లేదనడమే కదా? మతాలను, మతనమ్మకాలను బూటకాలని నిందించడమే

కదా?" అని చులకన చేయడమిప్పుడు ముందుకు వచ్చింది. అంటే, హేతువాదం ఎటువైపు నడుస్తుందో కొంతమేరకైనా గ్రహించే దశకు కొందరు వచ్చారన్నమాట! అలాంటి వారి సంఖ్య మెల్ల మెల్లగా పెరుగుతోందన్నమాట! అయితే వారు హేతువాదం ఎలాంటి భావాలను తిరస్కరిస్తుందో తెలుసుకుంటున్నారు తప్ప, ఎలాంటి భావాలను ఆమోదిస్తుందో తెలుసుకోవడం లేదు. అంతకు ముందే వారిలో నిలదొక్కుకున్న భావాలు ఆ మేరకు వారిని ఆలోచించ నీయడంలేదు. తెలుసుకో నీయడంలేదు. తెలుసుకోడానికి ఇష్టపడితే ఆలోచించకుండా ఉండేవారు కాదు. ఎందుకంటే, అంతకు ముందు వారు తెలుసుకున్నా మనుకున్న వాటితో హేతువాద భావాలు ఏకీభవించవు.

ఎవరి జీవితావసరాల కోసం వాళ్ళు సహేతుకంగానే ఆలోచిస్తారు. సహేతుక విధానాలనే అనుసరిస్తారు. అది మానవనైజం. ప్రతి ఒక్కరూ ఇంగిత జ్ఞానాన్ని వినియోగించుకో గలరు. హేతువాదమంటే ఇంగిత జ్ఞానమే(Common Sense). ఎప్పుడేది చేయాలో,ఎలా చేయాలో, ఎలా చేస్తే ఏ ఫలితం వస్తుందో మనకు చెపుతుంది. కానీ, ఇంతకుముందే అవాస్తవిక భావశృంఖలాల్లో మన మనస్సు బంధించబడి ఉంటే, మనం స్వతంత్రంగా ఆలోచించలేం. మన ఇంగితం పనిచేయవలసిన రీతిలో పనిచేయదు. అందువల్ల, ఇంగితానికి తోడు వాస్తవిక జ్ఞానం కూడా ఉంటే, భావదాస్య శృఖలాలను ఇట్టే త్రెంచి వేసుకోగలం. అప్పుడు మన ఇంగితానికి పదునెక్కుతుంది. దాన్నే వివేకవంతమైన ఇంగితజ్ఞానం(Enlightened Common Sense) అంటాం. విమర్శక ప్రజ్ఞ(Critical Intelligence) దాని ఆయుధం.

లౌకిక విషయాల్లో, ప్రవర్తనలో ఇంగితజ్ఞానంతో మెలగడానికి ఎవరికీ అభ్యంతరం ఉండదు. ఇబ్బంది వచ్చేదల్లా దేవుళ్ళు,దయ్యాలు, మతనమ్మకాలు, ఆచార సంప్రదాయాలు మొదలైన విషయాలలోనే. దేవుళ్ళూ, దయ్యాలూ లేవు కాన, వాటి మీద బయలుదేరిన నమ్మకాలూ, ఆచార సంప్రదాయాలూ అర్థం లేనివే. వాటి మీద నమ్మకమున్న మనిషి కూడా వాటి మీద ఆధారపడి బ్రతకడు. విద్యుత్తు ప్రవహిస్తున్న తీగను పట్టుకుంటే చచ్చిపోతామని ప్రతి ఒక్కరికీ తెలుసు. అక్కడ ఇంగితం పనిచేస్తుంది. దేవుణ్ణి ధ్యానిస్తూ దాన్నిపట్టుకున్నా, చచ్చిపోతామని ప్రతి భక్తుడికీ తెలుసు. అక్కడ కూడా ఇంగితం పనిచేస్తుంది. శుభముహుర్తంలో మంత్రాలు పఠిస్తూ పట్టుకున్నా చచ్చిపోతామని ఛాందసులకు తెలుసు. అక్కడ కూడా ఇంగితం పనిచేస్తుంది. విద్యుత్ప్రవాహాన్ని ఆపిగాని, విద్యుత్తు ప్రవహించని సాధనం ద్వారా గాని పట్టుకుంటే తప్ప బ్రతకమని స్వాములకు, బాబాలకు, మాతలకు తెలుసు. ఆ మేరకు వారి ఇంగితం పనిచేస్తుంది. అంటే, ప్రాణభయం ఉన్నచోట, వాస్తవికమైన చోట ఇంగిత జ్ఞానం తప్ప, దేవుళ్లూ, మంత్రాలూ, బాబాలూ అవసరానికిరారు. అందుచేత అన్ని సందర్భాల్లోనూ ఇంగిత జ్ఞానాన్ని పని చేయించమని హేతువాదం చెపుతుంది. అదేమంత కష్టం?.

1977, 1978లలో విజయవాడలో "చార్వాక" పత్రిక అధ్వర్యాన హేతువాద అధ్యయన తరగతులు జరిగాయి. వాటికి నేనే సారథ్యం వహించాను. వక్తలంతా దైవాన్ని, మతాలను, మూఢనమ్మకాలను విమర్శిస్తూ ప్రసంగించేవారు. హేతువాద మౌలిక స్వరూపాన్ని గురించి ఏ ఒక్కరూ ప్రస్తావించేవారు కాదు. అందువల్ల,నేను "చార్వాక" మాస పత్రికలో సిద్ధాంత చర్చ చేస్తూ "హేతువాదం" పై ధారావాహికంగా రాయవలసి వచ్చింది. అందులో కొంతభాగం

"హేతువాదం" శీర్షికతోను, మరికొంత భాగం "హేతుత్వం - మతతత్వం" శీర్షికతోను రెండు పుస్తకాలు ప్రచురించాను. అనంతరం "హేతువాద వైఖరి"ని వివరిస్తూ మరో పుస్తకం రాశాను. ప్రకృతిలో నియతి లేకపోతే కార్యకారణత చెల్లదు. కార్యకారణత చెల్లకపోతే హేతువాదం, భౌతిక వాదం చెల్లవు. అందువల్ల, అనంతరం నియతివాదంపై, కార్యకారణతపై కూడా రాయవలసి వచ్చింది. ఇవి అన్నీ ఒక శ్రేణిలోని రచనలే.

రెండున్నరవేల ఏళ్ళనాటి చార్వాకం భౌతికవాదమే. కానీ, దాన్ని నాస్తికత్వంగా, కేవలం వైదికమతాన్ని వ్యతిరేకించే పిడివాదంగా మతవాదులు మన కాలానికి పరిచయం చేశారు. అందువల్ల, మత వ్యతిరేకతే నాస్తికత్వంగా ప్రచారమైంది. వాస్తవానికి, ప్రతి మతమూ ఇతర మతాలవారికి అన్యులనీ, పాషండులనీ, నాస్తికులనీ ముద్రవేస్తుంది. మనం మతం వద్దంటున్నామంటే, దాని స్థానంలో ఏమి కావాలి? అని మతస్థులు మనల్ని ప్రశ్నిస్తుంటారు. మతం వద్దంటున్నామంటే, మన జీవన గమనానికి మార్గం మూసుకుపోయిందని అర్థం చేసుకోనవసరం లేదు. మనది హేతువాద విధానం. అది మానవవవాద మార్గాన్ని మనకు చూపుతుంది.

దేశవ్యాప్తంగానూ, రాష్ట్రవ్యాప్తంగానూ,స్థానికంగానూ పనిచేస్తున్న హేతువాద సంఘాలూ, నాస్తిక సంఘాలూ, మానవవాద సంఘాలూ కొన్ని ఉన్నాయి. అందులో కొన్ని రాజకీయ పార్టీలతో ప్రత్యక్ష, పరోక్ష అనుబంధాలను పెంచుకున్నాయి. రాజకీయ వాసనలను వదలుకోలేని సంఘాలు మరికొన్ని ఉన్నాయి. ఈ నాడు మానవజీవితం శాఖోపశాఖలుగా విస్తరించి ఉంది. రాజకీయం అందులో ఒకానొక శాఖ మాత్రమే. ఏనాడైనా అది అంతే. అయితే, మన దౌర్భాగ్యవశాత్తు మానవ జీవిత రంగాలన్నిటి మీద పెత్తనం చేసే స్థాయికి అది పెరిగింది. ప్రస్తుతానికి ఒక్క బిచ్చగాళ్ళ మీద తప్ప, దాని అధికారం పరిధి విస్తరించని రంగం లేదు. అలా రాజకీయాన్ని పెరగనీయడం మానవ తప్పిదమే. ఈ తప్పిదాన్ని వరంగా పెంపొందించుకున్న రాజకీయ పార్టీలు అధికార సాధనే తమ అంతిమ లక్ష్యంగా ఎంచుకున్నాయి. మానవ సమాజిక జీవితాన్ని మొత్తాన్నీ తమ గుప్పిట్లోకి తెచ్చుకున్నాయి. వాటి లక్ష్యం మానవ సంక్షేమం కాదు. మానవ సంక్షేమాన్ని ప్రాధమికమైనదిగా గుర్తించేవారు సామాజికుల విజ్ఞాన వికాసానికి, భావవికాసానికి ప్రాధాన్యత నివ్వాలి. వేలాది సంవత్సరాలనుంచి పాదుకున్న మత భావదాస్యం నుంచి సామాజికుల్ని ఉద్ధరించడానికి ప్రయత్నించాలి. అధికార సాధనే ప్రధానాశయంగా బ్రతికే రాజకీయులేనాడూ ఆ దిశలో కృషి చేయలేదు. వారివన్నీ పిట్టలదొర ప్రేలాపనలే. వీధి భాగోతాల్లో 'చోపుదారు' వచ్చి 'మీకు బావులు పూడ్పిస్తాం, చెరువులు త్రవ్విస్తాం' అని ప్రేలినట్లు ప్రతి రాజకీయ పార్టీవారూ ఆర్థిక వాగ్దానాలను చేస్తారు. వాటిని నెరవేర్చనూవచ్చు, నెరవేర్చకపోనూవచ్చు.

ఎన్నికల ద్వారా ఎప్పటికప్పుడు 'రాజులు' మారుతున్నారు తప్ప, ఒకనాటి రాజరికానికీ, ఈనాటి రాజకీయ ప్రభుత్వాల పెద్దరికానికీ అట్టే తేడా లేదేమోననిపిస్తుంది. రాజరికాన్ని తుదముట్టించ దలచుకున్న పెట్టుబడీదారీ వర్గాలు ఆదిలో జాతీయవాదాన్ని చేపట్టాయి. రాజరికాన్నీ, మతాన్నీ రెంటినీ వ్యతిరేకించాయి. హేతువాద, నాస్తిక,భౌతిక వాద భావాలకు ఊపునిచ్చాయి. ప్రజాస్వామ్య భావాన్ని ప్రోత్సహించాయి. రాజ్యం రాజులదికాదు,

ప్రజలదన్నాయి. చివరకు ప్రతినిధి స్వామ్యాన్ని నెలకొల్పి, అంతకు ముందటి అభ్యుదయ భావాలకు వీడుకోలు చెప్పాయి. రాజరికాల రోజుల్లో రాజులూ, వారి వారసులూ అధికారం కోసం తన్నుకున్నట్లే, ఈ రోజుల్లో రాజకీయ పార్టీలవారు ప్రాతినిధ్యాధికారం కోసం కాట్లాడు కుంటున్నారు.రాజకీయ పార్టీల యేర్పాట్లూ, వేర్పాట్లూ, కూడికలూ, తీసివేతలూ అన్నీ అందుకోసమే. మామూలు జనం మామూలుగా ఉన్నచోటే ఉన్నారు. చివరకు ఓట్లమ్ముకునే జనం ప్రజాస్వామ్య నిర్ణేతలవుతున్నారు. కొనుక్కోగల జనం అధినేతలవుతున్నారు. అదికాదు ప్రజాస్వామ్యమంటే. ప్రజాస్వామ్యమంటే ప్రజలు స్వాములు కావడమనే అర్థం. ప్రజలు అన్ని విధాలుగాను చైతన్యవంతులైనప్పుడే వారి స్వామ్యం సార్థకమవుతుంది. ఎన్‌లైటెన్డ్ పబ్లిక్ ఒపీనియన్ (Enlightened public opinion) ద్వారా మాత్రమే అది సాధ్యమవుతుంది. అదే మానవ స్వామ్యానికి మార్గం.

స్వరాజ్యం వచ్చింది మొదలు ఈ దేశంలో ప్రజాస్వామ్యం ముదిరి టెంకె అవుతోంది. తొండ ముదిరితే ఊసరవెల్లి అంటాం కదా, అలాగే. అసలు మనది ఫాసిస్టు సమాజం. మన రాజ్యాంగం నియంతృత్వాన్ని అసాధ్యం చేయలేదు కాబట్టి, ఇక్కడ ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించ గలిగింది, ఎమర్జెన్సీలు విధించకుండానే దాని ప్రక్రియలు కొనసాగుతున్న ప్రజాస్వామ్యం లో మనమున్నాం.

తమకు సీట్లిస్తే ఓట్లిస్తామని ఏ కులానికాకులం అంటోంది. మన ప్రజాస్వామ్యమంతా రాజకీయాధిపత్యం మీద కేంద్రీకృతమవుతోంది. ప్రతినిధి స్వామ్యం పార్టీ స్వామ్యమై, చివరకు కులస్వామ్యస్థాయికి దిగిపోయింది. ప్రజాస్వామ్య మౌలికరూపం ఇదికాదు. ప్రజాస్వామ్యం రాజకీయాదర్శం కాదు. అది సామాజికాదర్శం. చివరకు మేధావులనబడే వారుసైతం ప్రజాస్వామ్యాన్ని రాజకీయాదర్శంగా పరిగణించే దశకు దిగిపోయారు. ఈ రాజకీయాధికార ప్రలోభం చివరకు ప్రజాస్వామ్యాన్ని కులస్వామ్య దశకు దించి వేసింది. బ్రహ్మగర్జన మొదలు మాదిగ దండోరా వరకు కుల సంఘాలుగా వెనక్కు నడవడమేనా ప్రజాస్వామ్యానికి సంకేతం? ఇందులో మనుషులెక్కడున్నారు? పార్టీలతో, మతాలతో, కులాలతో రాజకీయం గబ్బు పట్టిపోయింది. దాని ప్రక్షాళనం ఎక్కడ ప్రారంభం కావాలనేది ఈనాడొక సమస్యగా తయారైంది.

అర్ధశతాబ్ది దాటిన స్వరాజ్య భారతంలో పెరుగుతూ వచ్చిన ఈ స్థితి అందరికీ తెలుసు. ఈ స్థితి నుంచి సామాజికులు తేరుకోవాలంటే క్రింది నుంచి సామాజిక పునర్నిర్మాణం జరగాలి. అది కేవలం ఆర్థికం కాదు. “మీ ఆర్థిక కార్యక్రమమేమిటి?” అనే ప్రశ్న వామపక్ష రాజకీయ వాదుల నుంచి హేతువాదులకు తరచు ఎదురవుతుంది. వాళ్లు నేర్పిన ఆర్థిక వాగ్దానాలు ఇప్పుడన్ని రాజకీయ వర్గాల వారూ నేర్చుకున్నారు. అర్గనైజుడు సెక్టార్లలో వాళ్లు అలవాటు చేసిన రకరకాల ఆందోళనోద్యమాలను అన్ని రాజకీయ పార్టీలవారూ ఇప్పుడు కాపీ కొడుతున్నారు. ఎన్నికల్లో కోట్లాది రూపాయలతో జనాన్ని కొనే రాజకీయుల సంఖ్యతో పాటు, అమ్ముడుపోయే సాదాజనం సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. వామపక్షాల వైపు జనం మరలడం లేదు. అట్టడుగు వర్గాలవారు స్వయం పోషక స్థితికి పెరగలేదు. ప్రజల్లో భావ చైతన్యం పెరిగి, అభిప్రాయాల్లో, ఆదర్శాల్లో, వారు స్వావలంబనపరులైతే, ఈ స్థితిని ఊహించగలమా?

విప్లవాలు పైనుంచి జరగవు. రాజకీయాధికార మార్పిడే పైనుంచి జరుగుతుంది.

రాజరికాల్లో కూడా ఇలాగే జరిగింది. ప్రజాస్వామిక విప్లవం, సోషలిస్టు విప్లవం అనబడే వాటిలో కూడా రాజకీయాధికార మార్పిడే జరిగింది. అవి రెండూ ఆర్థిక నినాదంతోనే బ్రతికాయి, బ్రతుకుతున్నాయి. వ్యావసాయిక విప్లవం క్రింది నుంచి జరిగి లోకవ్యాప్తమైంది. అందుకు సంబంధించిన భావాలే దానికి మూలమయ్యాయి. పారిశ్రామిక విప్లవం కూడా రాజకీయులు తెచ్చింది కాదు. శాస్త్రజ్ఞులు,సాంకేతిక నిపుణులు దానికి ప్రాణం పోయగా పరిశ్రమల యజమానులతో,కార్మికులతో వినియోగ వస్తూత్పత్తికి అది దోహదపడింది. అవి భావ స్వాతంత్ర్య ఫలాలే. విజ్ఞానశాస్త్ర విప్లవం అప్రతిహతంగా గత రెండు మూడుశతాబ్దులనుండి కొనసాగుతూనే ఉంది. దానికి అనుగుణంగా సాగుతూ వచ్చిన భావవిప్లవం ఇటీవలి కాలంలో వెనకడుగు వేస్తోంది. రాజకీయుల మద్దతుతో మత భావ విజృంభణ జరగడం దానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఈ పరిస్థితిని అధిగమించాలంటే, మతమూలాల్లో నుంచి భావవిప్లవం ప్రారంభం కావాలి. అందుకు సాధనం శాస్త్ర విజ్ఞానాన్ని, దాని దృక్పథాన్ని తోడు చేసుకోవలసిన హేతువాదమే.

"హేతువాదం" గురించి అటు హేతువాద వ్యతిరేకుల్లో మాత్రమే కాక, ఇటు హేతువాదుల్లోనూ, నాస్తికుల్లోనూ కూడా కొన్ని అపార్థాలున్నాయి. 1979-89 మధ్య ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘానికీ, 1989-2002 మధ్య భారతహేతువాద సంఘానికీ సారథ్యం, దర్శకత్వం వహించిన నేను ఆ అపార్థాలను తొలగించవలసిన బాధ్యతను, ఆవశ్యకతను గుర్తించాను. హేతువాద దృక్పథంతో అనేక విషయాలను చర్చిస్తూ చాలా రచనలు చేశాను. అందులో హేతువాదంపై సైద్ధాంతిక పరిశీలన చేసిన గ్రంథాలూ, వ్యాసాలూ ఉన్నాయి. హేతువాద స్వరూప స్వభావాలను, వాటి శాస్త్రీయ ప్రతిపత్తినీ, లక్ష్యాలనూ వివరించడమే వాటి ధ్యేయం.

హేతువాదమంటే కేవలం దైవాన్ని, మతాన్ని, మూఢనమ్మకాలను, దురాచారాలను తిరస్కరించడం, విమర్శించడం మాత్రమే కాదు. ప్రకృతిని అవగాహన చేసుకొనే విషయంలో అది అవశ్యంగా భౌతిక వాదానికి దారితీస్తుంది. మనిషికీ, అతను నిర్మించుకున్న సమాజానికీ,వాటి మధ్య సంబంధానికీ అన్వయించినపుడు మానవవాదాన్ని లక్షిస్తుంది. హేతువాద సంఘ సారథ్యం వహించకముందు మూడు దశాబ్దాలపై కాలంగా నేనీ అభిప్రాయాల్లోనే కుదురుకున్నాను. సంఘ సారథ్యం లభించకముందూ, లభించిన తరవాతనూ నా రచనలన్నిటిలోనూ ఆ అభిప్రాయాన్నే పోషించాను. సభల్లోనూ, అధ్యయన శిబిరాల్లోనూ నా ప్రసంగాల్లో అదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశాను.

అసలు సమస్య పరతత్వం. విశ్వానికి మూలం ఏదో ఒకటి ఉందనే అపోహ అన్ని రంగుల మత వాదుల్లో కొనసాగుతోంది. హేతువాద, నాస్తిక, భౌతికవాద ఛాయల వారంతా దీన్ని గుర్తించి మతవాదాన్ని నిరాకరించడం రెండువేల సంవత్సరాలకు పూర్వమే ప్రారంభించారు. సర్వత్రా వ్యాప్తిలో ఉన్న మతాన్ని ఎదుర్కోడానికి ఆనాటి నుంచి ఈనాటి దాక పోరాటం సాగుతూనేఉంది. అప్పటి వారు లోకజ్ఞానంపై తర్కం ఆధారంగా నిర్ణయాలు తీసుకున్నారు. ఈనాడు ఆధునిక శాస్త్రవిజ్ఞానం ఆధారంగా నిర్ణయాలు తీసుకోవలసిన బాధ్యత మనదైంది.

విశ్వం అనాది. దానికి "ముందు"అనేది లేదు. విశ్వంలో కాలం ఉంది కాని కాలంలో

విశ్వంలేదు. స్థలకాల అవిరతంగా తప్ప, విశ్వాన్ని అర్థం చేసుకోడానికి వీలులేదు. విశ్వ ప్రవృత్తిలోనే స్థల కాలాలకు ఉనికి వచ్చింది.

విశ్వం అవిరత సంఘటనలమయం. ఆ సంఘటనల ముందు వెనుకలే కారణకార్యాలు. కాబట్టి, అవి విశ్వం లోపలివే. దేని కారణాలకైనా విశ్వం వెలుపల వెదకబూనడం అసంగతం. విశ్వాన్ని కార్యంగా తీసుకొని కారణం కోసం వెలుపల వెదకే మతవాదులు అపోహలు చేశారు. కాగా, దైవాన్ని కార్యంగా తీసుకొని దాని కారణం కోసం వెదకడానికి వారు ఎన్నడూ సాహసించలేదు. వాస్తవికతతో, వాస్తవిక పరిణతితో కార్యకారణాల ఉనికి ముడిపడి ఉంటుంది. కాన, విశ్వానికి వెలుపల కారణకార్యాలుండవు. మన అనుభవజ్ఞాన అన్వయంతో కార్యకారణ భావానికి అస్తిత్వం వచ్చింది. అంటే, విశ్వం లేనపుడు, దాని ఉనికి పరిణతులతో ముడిపడనపుడు స్థల కాలాలకు గాని, కార్యకారణాలకు గాని అర్థం ఉండదు.

జగత్సంఘటనలన్నీ నిరంతరాయ క్రమంలో ఉన్నాయి. అంటే, అవి నియమబద్ధంగా, క్రమబద్ధంగా ఒకదాని వెంట మరొకటి జరుగుతున్నాయి. నిజానికి "జగత్తు"అనే పదాన్ని ఏ వాస్తవికవాది రూపొందించి వాడుకలోకి తెచ్చాడో గాని, అది ఉనికి పరిణతులను (Being and becoming) ఒకే మాటలో గుప్పిలించింది. విశ్వ సంఘటనలు నియమబద్ధంగా జరగడం వల్లనే మన అవగాహనలోకి రాగల సంఘటనల భూత భవిష్యత్ వర్తమానాలను వీలైనంత కచ్చితంగా చెప్పగలుగుతున్నాం. మన అవగాహనకు అందీ అందనట్లున్న వాటిని గురించి కూడా సంభావ్యతలుగా ఊహించి పేర్కొగలుగుతున్నాం. దీన్నే నియతివాదమంటాం (determinism). సంభావ్యత (Probability) కూడా నియతి వాదంలో భాగమే.

ప్రకృతిలో నియతి లేకపోతే, అందులో జరిగే సంఘటనలు మనకు అర్థం కావు మనంఅర్థం చేసుకుంటున్నామంటేనే, నియతిని అర్థం చేసుకుంటున్నామని భావం. సంఘటనలు నియమం ప్రకారం ఒక క్రమంలో జరగడం వల్లనే శక్యాశక్యాలను ఆలోచించుకొని, మన శ్రేయస్సుకు అనుకూలమైన కార్యాలను మనం ఎన్నుకోగలుగుతున్నాం. అదే స్వేచ్ఛ అంటే. స్వేచ్ఛ అంటే విశృఖలత్వం కాదు. ప్రకృతి నియతే మన స్వేచ్ఛకు శృంఖలాలు తగిలిస్తుంది. అప్పుడే మన ఇంగితజ్ఞానం పనిచేస్తుంది. నియతివాదం స్వేచ్ఛకు అడ్డురాకపోగా, దానికి అండగా నిలుస్తుంది. అంతమాత్రాన దీన్ని పురోనిర్ణయవాదంగా, ప్రారబ్ధవాదంగా, కర్మవాదంగా అర్థం చేసుకోరాదు.

మనుషులమైన మనం ప్రకృతి బిడ్డలమే. కార్యకారణ భిక్ష ప్రకృతి నియతి ద్వారానే మనకు అందింది. బలంగా మనకు అది అందినందువల్లనే మనం పాశవిక దశలో నిలచిపోలేదు. సమాజంతో పాటు అనేక వ్యవస్థల్ని సృష్టించుకున్నాం. జీవితాన్ని సుఖశాంతుల మయం చేసుకునే మార్గంలో పయనిస్తున్నాం. కాని, ఎప్పటికప్పుడు వ్యవస్థీకృత మతవాదాలు మన స్వేచ్ఛా సాధనలో, మానవవాద మార్గంలో అడ్డుగా నిలుస్తున్నాయి. వాటిని అధిగమించడానికే సమూల భావవిప్లవం కావాలి, రావాలి, తేవాలి. అప్పుడే సంస్కృతి మానవకేంద్రంగా నిర్మితమవుతుంది. అంటే, మనం వినూత్న సంస్కృతి యుగంలోకి ప్రవేశించాలి. ఈ సందర్భంగా హేతువాదం ఒక మెథడాలజీగా, విధానంగా పనిచేస్తుంది, చేయాలి, చేయించాలి. మధ్య ఎన్ని మజిలీలున్నా, హేతువాదం ధ్యేయం మాత్రం మానవవాదమే.

# విద్యావిధానం-హేతువాదం

పసల భీమన్న, రిటైర్డు ప్రిన్సిపాల్

అక్షరాస్యత వేరు, విద్యవేరు. చదవడం, వ్రాయడం,లెక్కలు వస్తే చాలు అక్షరాస్యత అవుతుంది. విద్య అంటే సంస్కారంతో కూడిన అక్షరాస్యత. మానవ విలువలతో కూడిన అక్షరాస్యత.విద్యావంతుడు అంటే చదువుండీ సంస్కారం ఉండీ తనకోసం బ్రతుకుతూ, సమాజంకోసం కూడ బ్రతికేవాడని అర్థం.విద్యలేని వాడిని పశువుతో పోల్చుతారు. చదువులేని వాడిని అలా పోల్చరు. ఎందుకంటే మనిషిగా మానవనీయగుణాలు గల చదువుకున్న వ్యక్తినే విద్యావంతుడు అంటాం.

విద్యవల్ల రెండు ప్రయోజనాలు ఆశిస్తాం-

1. వ్యక్తి సమగ్రవికాసం 2. సామాజికాభివృద్ధి. మొదటి ప్రయోజనం వల్ల విద్యార్థి తన వ్యక్తిత్వాన్ని సంపూర్ణంగా వికసింప చేసుకుంటాడు. అందుకు కేవలం జ్ఞానం(Knowledge) ఇస్తే చాలదు. జ్ఞానంతో పాటు మంచి అలవాట్లు, శాస్త్రీయ వైఖరి, నైపుణ్యాలు కలుగచేయాలి. వినయం, ఓర్పు, ప్రేమ, కరుణ, దయ మొదలైన మానవగుణాలు పెంపొందింప చేయాలి.

విద్యయొక్క రెండవ ప్రయోజనం వల్ల సమాజం ఇంతకన్నా ఉన్నతమైన స్థాయికి చేరుకుంటుంది. ఉత్పత్తి పెరగడానికి, దారిద్ర్య నిర్మూలనకు విద్య మంచి సాధనం. ప్రజాస్వామ్యం,జాతీయ సమైక్యత, దేశాన్ని ఆధునికీకరించడం, సమ సమాజ నిర్మాణం, ప్రపంచశాంతి కొరకు అంతర్జాతీయ అవగాహన - ఇలా అన్నింటికీ విద్యే సాధనం. అంటే దేశ భవిష్యత్, విశ్వ భవిష్యత్ తరగతి గదిలో రూపుదిద్దుకుంటాయని గ్రహించాలి.

విద్యవల్ల పై రెండు ప్రయోజనాలు నెరవేరాలంటే ఈ నాటి మన విద్యావిధానంలో మౌలికమైన మార్పులు రావాలి. శాస్త్రీయ పద్ధతిని అనుసరించి,శాస్త్రజ్ఞానం ఆధారంగా ఆ మార్పులు రావాలి. విద్యావిధానంలోనే శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని ప్రవేశపెట్టాలి. అందులో మతవాదానికి ఎక్కడా తావుండకూడదు.

కొందరు హేతువాదం అంటే ఏమిటో సరిగ్గా తెలుసుకోకుండా అపోహలు ప్రచారం చేశారు. అందులో ముఖ్యమైన అపోహ ఏమిటంటే హేతువాదం అంటే దేవుడు లేడనే నాస్తికత్వం అనుకోవడం. హేతువాదులు అంటే దేవుడు లేడనే వారు అనే అపోహ ఉంది. అందుకే హేతువాదం అంటే ఏమిటో సరైన నిర్వచనం ముందుగా తెలుసుకోవాలి.

లండనులోని Rationalist Press Association వారు హేతువాదానికి ఈ క్రింది నిర్వచనం ఇచ్చారు."Rationalism may be defined as the mental attditude which unreseredly accepts the supremacy of reason and aims at establishing a system of philosophy and ethics verifiable by experience and independent of all arbitrary assumptions or authority"(Memorandum of the Rationalist press Association, London.)ఈ నిర్వచనంలో హేతువాదం అంటే నాస్తికత్వమని ఎక్కడ నిర్వచించారు? హేతువాదమంటే శాస్త్రీయ పద్ధతిని, కార్యకారణ సంబంధాన్ని అంగీకరించే మానసిక

వైఖరి. హేతువాదం అన్నా, శాస్త్రీయ వైఖరి అన్నా ఒక్కటే. అది లక్ష్యం కాదు,లక్ష్యసాధనం. ప్రయోగం ద్వారా, నిరూపణ ద్వారా తత్వజ్ఞానాన్ని, నీతిశాస్త్రాన్నీ నిర్మించుకోవడమే దాని లక్ష్యం. ఒక్కమాటలో చెప్పాలంటే మానవవాదం దాని లక్ష్యం.

మనం హేతువాదం ప్రయోగించి ప్రశ్నించుకుంటే సృష్టికర్త, రక్షకుడు, దేవుడు లేడనేది తేలిన సత్యం కనుక అది నాస్తికత్వాన్ని అంగీకరించింది. అంతే గాని, హేతువాదం అంటే కేవలం నాస్తికత్వం మాత్రం కాదు.

1986లో జాతీయ విద్యాప్రణాళిక ప్రవేశపెట్టిన ఆనాటి ప్రభుత్వం శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని అంటే హేతువాదాన్ని విద్యార్థుల్లో వికసింప చేయాలని స్పష్టంగా పేర్కొంది. "Knowledge of Science, Scientific thinking and related skills have become indispensable for leading a meaningful life in the modern world. Education should help the individual not only in acquiring knowledge and its application but also in developing a scientific temper and rational world view".అంతే కాదు విద్యార్థుల్లో మానవ విలువలు పెంపొందాలనీ, మతవాదం, మూఢత్వం, కర్మవాదం, హింసావాదం,మాయావాదం తొలగించాలని కూడా ఆ విద్యా ప్రణాళికలో చాలా స్పష్టంగా పేర్కొనబడింది.

" Value education should help eliminate obscurantism, religious fanaticism, Violence, Superstition, and fatalistic attitude from the minds of children". ఇది ఈనాటికి అభ్యుదయకరమైన నిర్ణయంగా గుర్తించాం. మన రాజ్యాంగంలో ఆర్టికల్ 51 లో కూడ హేతువాద ఆవశ్యకతను గుర్తించి, దాన్ని వికసింపచేసుకోడం ప్రతిపౌరుని ప్రాథమిక కర్తవ్యంగా పేర్కొన్నారు. శాస్త్రీయ స్వభావం, జిజ్ఞాసభావం, మానవవాదం, సంస్కరణాభిలాష ఇవి 51 ఎ (హెచ్) ఆర్టికల్‌లో చెప్పిన హేతువాదం. దీని ప్రకారం 1986జాతీయ విద్యాప్రణాళికను ఆనాడు ప్రవేశపెట్టారు అది ఎంత వరకు అమలు చేశారో చూస్తే,అది కాగితాలకే పరిమితమైంది. విద్యార్థుల అనుభవంలో మార్పు ఏమీ రాలేదని గ్రహిస్తాం. విద్యావిధానం ద్వారా సమాజానికి మేలు చేయాలనీ, అభివృద్ధి సాధించాలనీ అనుకున్నాం. చివరికి జరిగింది మాత్రం నామ మాత్రమే.

మన ప్రధాన మంత్రి శ్రీ వాజపేయి నాయకత్వంలోని జాతీయప్రజాస్వామ్య కూటమి (ఎన్.డి.ఎ)లోని మానవవనరుల శాఖామాత్యులు శ్రీ మురళీ మనోహర్‌జోషి మన విద్యావిధానంలో పలు అభివృద్ధి నిరోధక మార్పులు చేశారు. అశాస్త్రీయ జ్యోతిష్యం, వాస్తు, వేద కర్మకాండ లాంటివి, హిందూపౌరోహిత్యం విశ్వవిద్యాలయాల్లో పాఠ్యాంశాలుగా ప్రవేశపెట్టారు. చరిత్ర పాఠాలను వక్రీకరించి, తిరగ వ్రాయించే ప్రయత్నం చేశారు.

హిందూమత భావజాలం,హిందూ రాజకీయాలు కలిపి హిందూత్వం అంటాం. ఈ విధానాన్ని విద్యా విధానంలో చొప్పించడం జరిగింది.

బి.జె.పి. విద్యకి సంబంధించి అనుసరిస్తూ వున్న మతఛాందసవాద, ప్రగతి నిరోధక కార్యక్రమంలోని అనేక పార్శ్వాలని " The Times of India", "The Statesman " The Hindustan

Times" లాంటి ప్రముఖ పత్రికలన్నీ సంపాదక వ్యాఖ్యల్లో విమర్శించాయి ఎన్.డి.ఏ. లోని ప్రభుత్వ భాగస్వామ్య పక్షాల సభ్యులే ఎంతో మంది ప్రభుత్వ విద్యావిధానాలను పార్లమెంటులో జరిగిన చర్చల్లో విమర్శించారు. అయినా అవి విద్యామంత్రివర్యుల చెవికెక్కలేదు. ఈ విషయంలో వివరంగా మంత్రిగారు తలపెట్టిన మార్పులు చేర్పులు తెలుసుకోవాలంటే ఈ క్రింది మూడు పుస్తకాలు తప్పక చదవాలి. వాటిలో చెప్పినవన్నీ ఇక్కడ వ్రాయడం సాధ్యం కాదు. కనుక ఈ ప్రచురణలను పాఠకుల అధ్యయనం కొరకు సూచిస్తున్నాను.

1. విద్యారంగమార్పులు: వాటి దుష్పరిణామాలు- ఇది జన విజ్ఞాన వేదిక ప్రచురణ.
2. విద్యారంగంపై మతోన్మాదుల దాడి- నళినీతేజ రచన. ప్రజాశక్తి డైలీ ప్రచురణ.
3. విద్య కాషాయీకరణను ప్రతిఘటిద్దాం! ఇది విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ ప్రచురణ.

ఈ మూడు పుస్తకాల్లో ఉన్న ముఖ్యాంశం యావత్ విద్యా విధానాన్ని మత ఛాందసంతో నింపడం, అంతే కాదు మానవీయతనూ, అంతర్జాతీయ తత్వాన్నీ సాంకేతిక రంగంలో స్వావలంబనను నీరసపరచడం, కుహనా చరిత్రతో ఆర్య అధికత్యను రుద్దాలనుకోవడం ఇలా ఎన్నో విషయాలు పై పుస్తకాల్లో విశద పర్చారు. మనది లౌకిక ప్రజాస్వామ్య వ్యవస్థ. ఇది భారతదేశ మూల స్వభావం. ఇప్పుడు ఈ పునాది కదిలిపోయే ప్రమాదం వచ్చిందని గ్రహించాలి. దీన్ని ప్రతిఘటించాలి.

విద్య వల్ల పైన పేర్కొన్న రెండు ప్రయోజనాలు నెరవేరాలంటే ఈనాటి మన విద్యా విధానంలో ఈ క్రింది మౌలికమైన మార్పులు రావాలి.

1. ప్రజల సమస్యలు పరిష్కరించేదిగా విద్యావిధానం ఉండాలి. రైతు ఆత్మహత్యలూ, చేనేతకార్మికుల ఆత్మహత్యలూ, విదేశాలకు విద్యాధికులు వలసపోవడం, పరిశ్రమలు మూతపడడం, నీటి సమస్య ఇలా ఎన్నో సమస్యలు.
2. విద్యా విధానం ఉత్పత్తికి సాధనంగా ఉండాలి. కనుక విద్యారంగంలో ప్రతి ముగింపు దశలో వ్యావసాయిక, పారిశ్రామిక వృత్తి కేంద్రాలు ఉండాలి. అంటే దారిద్ర్యరేఖకు దిగువన గల ప్రజల ఆర్థిక, సాంఘిక స్థితిగతుల్ని మెరుగు పరిచేదిగా ఉండాలి.
3. రాజ్యాంగంలో ప్రతిపౌరునికి విద్యా హక్కు కల్పించబడి, విద్యార్థుల ప్రతిభను జాతీయ ఉత్పత్తికి తోడ్పడేటట్లు చేయాలి.
4. మత రహిత, ప్రజాస్వామిక దృక్పథాన్నీ, శాస్త్రీయ వైఖరిని పెంపొందించేదిగా ఉండాలి.
5. ఉద్యోగావకాశాలకు గ్యారంటీ కలుగజేసి, ప్రతివ్యక్తి నాగరికమైన పౌరుడుగా జీవించేలా విద్యా విధానం రూపొందించాలి.

పైన పేర్కొన్న లక్షణాలు గల విద్యా విధానం అని చెప్పవచ్చు. దీన్ని అమలుచేయడానికి ప్రభుత్వం తీసుకోవలసిన తక్షణ చర్యలు చూద్దాం:-

1. రకరకాల విద్యాసంస్థలన్నీ ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి. విద్యావిధానం ప్రభుత్వం రూపొందించి, అమలు బాధ్యతను స్వీకరించాలి. స్వయం పాలనాధికారం గల విద్యా బోర్డులు

నెలకొల్పి, పై విద్యావిధానం ప్రవేశపెట్టాలి. ఈ బోర్డులలో తల్లిదండ్రులూ, ఉపాధ్యాయులూ, ప్రభుత్వ ప్రతినిధులు సభ్యులుగా ఉండాలి.

2.అందరికీ కుల, మత, వర్గ వ్యత్యాసాలు లేని సమాన అవకాశాలు కల్పించాలి. ప్రాథమిక విద్య పూర్తి కానివారికి రాత్రి పాఠశాలలు పెట్టి చదువుకునే అవకాశం కలుగజేయాలి.

3.చదువు పూర్తి చేసిన వారికి ఉద్యోగం ఇవ్వాలి, లేదూ నిరుద్యోగ భృతి ఇవ్వాలి.

4. వృత్తి విద్యాలయాలు దేశ అవసరాలకు తగినట్లు విస్తృత పరచాలి.

5. అందరికీ ఉచిత విద్యావకాశాలు కల్పించాలి.

6. ప్రాథమిక దశనుండి విశ్వవిద్యాలయ దశవరకూ మాతృభాషలోనే విద్యాబోధన జరగాలి. త్రిభాషా సూత్రాన్ని రద్దుచేయాలి.

7.మూఢవిశ్వాసాలకు వ్యతిరేకంగా హేతుబద్ధమైన శాస్త్రీయ భావాలతో కూడిన సిలబసు అమలు పరచాలి.

8. అన్ని స్థాయిలలోని ఉపాధ్యాయులకు సరైన జీతాలు, వృత్తి భద్రత, సంక్షేమ సౌకర్యాలు కలిగించాలి.

9. ప్రాథమిక స్థాయిలో ప్రతి 20 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు, సెకండరీ స్థాయిలో ప్రతి 30 మందికి ఒక ఉపాధ్యాయుడు చొప్పున నియమించాలి.

10.పరీక్షా విధానంలో లోపాలు సవరించి, పరీక్షలు విద్యార్థుల జ్ఞానాన్ని,నైపుణ్యాన్నీ, ప్రతిభను పరీక్షించి విలువ కట్టేటట్టు మార్పులు చేయాలి.

మన రాజ్యాంగ ఆశయాలు సోషలిజం,సెక్యులరిజం, (పార్లమెంటరీ),ప్రజాస్వామ్యం అని వ్రాసుకున్నాం. కాని ఆచరణలో ఈ మూడు ఆశయాలు అమలు జరగడంలేదు. ప్రజల్ని చైతన్య వంతులుగా చేసే బాధ్యత మనందరిది. వారిని హేతుబద్ధంగా ఆలోచింపచేయడం మనందరి కర్తవ్యం. హేతువాదం మనిషికి ఊపిరిలాంటిది. అది సృజనాత్మకం, అది సమస్యా పరిష్కార సాధనం. మన విద్యావిధానం ప్రస్తుత సంక్షోభం నుండు విముక్తి పొందాలంటే హేతువాద మార్గమే శరణ్యం. శాస్త్రీయ విద్యా విధానమే భారతదేశాన్నికాపాడగలదు.

---

There is one science, but there are many religious views.

**- Engenie C.Scott.**

The point of asking questions is to find true answers. The prince of activities is truth telling. **- Daniel C. Dennett**

The concept of a soul without a body seems to me empty and devoid of meaning **- Albert Einstein**

What is so remarkable (about science) is that there are no braises of nationality, race, Religion, or ideology in its common behaviour.

**-Sir. Hermam Bondi.**

# హేతువాదం-నాస్తికత్వం

-గుమ్మా వీరన్న

ఏది సత్యం? ఏదినిత్యం? అనే ప్రశ్నలతోనే తాత్విక చర్చ ప్రారంభమవుతుంది. అందుకోసమే సత్యాన్వేషణ కొనసాగుతుంది. భూమి మీద మానవుడు అవతరించిన నాటి నుండి మానవజాతి మనుగడ సాగిస్తున్నంత కాలం సత్యాన్వేషణ నిరంతరాయంగా కొనసాగుతూనే వుంటుంది.తన చుట్టూ జరుగుతున్న సంఘటనలు, తనకు ఎదురవుతున్న సమస్యలు, వాటి వెనుక అజ్ఞాతంగా,అగోచరంగా వుండే కారణాలు అర్థం కానపుడు వాటన్నిటికి ఏకైక కారణంగా దైవభావాన్ని మనిషి సృష్టించుకున్నాడు. అది మానవుడిలో వున్న ప్రాధమిక హేతుత్వానికి నిదర్శనం.

మానవుడు ఆటవిక దశలో మనుగడ సాగించిన నాడు అతనికి దేవుడులేదు, మతంలేదు,పునర్జన్మలు లేవు, పరలోకాలులేవు. అవన్నీ ఆ తరువాతి కాలంలో అతడే సృష్టించుకున్నాడు.

తెలుసుకోవాలనే జిజ్ఞాస మానవ స్వభావంలోనే వుంది. సుఖంగా జీవించాలనే కోరిక మానవుడితో సహా జీవలక్షణంగా వుంది. కావున జిజ్ఞాస, స్వేచ్ఛా పిపాసలే మానవుడి సత్యాన్వేషణకు ప్రేరణగా పనిచేస్తున్నాయని తేలుతుంది. మానవజాతి చరిత్రను పరిశీలించినపుడు ఈ సత్యాన్వేషణ అనేది అజ్ఞాతం నుండి జ్ఞాతానికి,అసమగ్ర సత్యం నుండి సమగ్రసత్యానికి, అసంపూర్ణం నుండి సంపూర్ణానికి ప్రయాణించే దిశలో కొనసాగుతున్నదని తెలుస్తున్నది.

నిన్న తెలియనిది నేడు తెలుస్తున్నది. నేడు తెలియనిది రేపు తెలుస్తుంది. ఎన్నటికీ తెలుసుకోడానికి వీలులేనటువంటిది ఏదీ లేదని కూడా తెలుస్తున్నది. నాటి నుండి నేటివరకు ఎందరో జిజ్ఞాసువులు, మేధావులు,తత్వవేత్తలు, శాస్త్రజ్ఞులు అహోరాత్రులు శ్రమించి సాగించిన సత్యాన్వేషణ ఫలితమే అన్ని రంగాలలో మానవుడు సాధించిన అద్భుత విజయం,ఆధునిక విజ్ఞానశాస్త్ర ఆవిర్భావం!

**<u>తాత్వికరంగంలో మానవుడి మజిలీలు:</u>**

మానవుడు సత్యాన్వేషణ సాగించే క్రమంలో తాత్వికరంగంలో ఎన్నెన్నో మజిలీలను చేరుకున్నాడు. ఏ ఒక్క మజిలీలోను ఆగకుండా అన్ని మజిలీలను దాటుకుంటూ తన ప్రయాణాన్ని కొనసాగిస్తూనే వున్నాడు. అటువంటి మజిలీలలో భావవాదం, ఆత్మవాదం, ఆస్తికవాదం, మార్మికవాదం, అజ్ఞేయవాదం, భౌతికవాదం, అనాత్మవాదం, భౌతికవాస్తవికవాదం వంటి తాత్వికరీతులు ఎన్నెన్నో చోటు చేసుకున్నాయి.

ఈ తాత్వికరీతులన్నిటిని గురించి చర్చించడం ఇక్కడ సందర్భం కాదు, సాధ్యం కూడా కాదు. అందువల్ల ప్రస్తుతం హేతువాదం, నాస్తికత్వం పరిశీలన వరకే పరిమితం చేసుకొందాం. ఇది వరకు అనేకసార్లు చాలా విపులంగా వీటి గురించి చర్చలు జరిగాయి. వ్యాసాలు, గ్రంథాలు వెలువడ్డాయి. అయినా మరోసారి స్పష్టత కోసం వీటి గురించి పరిశీలిద్దాం.

**<u>హేతువాదం - స్వరూప స్వభావాలు:-</u>**

అస్తిత్వం కలిగి అంతటా ఆవరించుకొని వున్న దాన్ని విశ్వమంటున్నాం.దాన్నే ప్రకృతి అని, జగత్తు అని కూడా వ్యవహరిస్తున్నాం. ఏదయినా సరే మనకు అర్థమవుతున్నదంటే అది కొన్ని నియమాల ప్రకారం పనిచేస్తున్నదని భావం. మానవుడికి సత్యాన్వేషణ సాధ్యపడుతున్నదంటే

విశ్వం నియమబద్ధమని తేలుతుంది.

విశ్వం స్వయంసిద్ధం, నిమయబద్ధం, నిరంతర పరిణామశీలం, ఆద్యంతరహితం, విశ్వ పరిణామాన్ని మనం సంఘటనల రూపంలో దర్శిస్తున్నాం.పదార్థరూపంలో కొనసాగుతున్న పరిణామం వెనుక పనిచేస్తున్న నియమాలను అన్వేషించి తెలుసుకోవడమే ఆది మానవుడి నుండి ఆధునిక మానవుడి దాకా కొనసాగిస్తున్న సత్యాన్వేషణ సారం.

విశ్వ పరిణామ క్రమంలో నిర్జీవ జగత్తు నుండి జీవజగత్తు ఏర్పడి, జంతురూపం నుండి మానవరూపం ఏర్పడిన క్రమంలో విశ్వనియమాలు మానవుడిలో ప్రవేశించాయి. అందువల్ల మానవుడు కూడా నియమబద్ధుడవుతున్నాడు. దీనిని మరోవిధంగా చెపితే విశ్వంలోని నియమబద్ధత మానవుడిలో హేతుత్వంగా భాసిస్తున్నదనాలి. అందువల్ల హేతువుయొక్క మౌలిక స్వరూపం విశ్వనియమంగా అర్థం చేసుకోవాలి.

ఈ హేతుత్వం మానవులందరిలోను పనిచేస్తున్నందువల్ల మానవులంతా అవశ్యంగా హేతువాదులవుతున్నారు. అంటే తమలో స్వతస్సిద్ధంగా వున్న హేతుత్వాన్ని ఆలోచనలలోను, ఆచరణలోను వినియోగించుకగోగల సామర్థ్యాన్ని కలిగి వున్నారని భావం. అందువల్ల మానవుడు బుద్ధిజీవి. హేతువాది అవుతున్నాడు.

ఈ విధంగా హేతువాదం ఆలోచనా విధానమయినపుడు అది సర్వవిషయాలకు వర్తిస్తుందని అర్థమవుతుంది. దానికి పరిధులుగాని, పరిమితులుగాని విధించడానికి వీలులేకుండా పోతుంది. అందువల్ల హేతువాదం దేవుడిని, మతాలను, బాబాలను, మూఢవిశ్వాసాలను విమర్శించడానికే పరిమితమైనట్లు కొందరు భావించడం వారి అవగాహనలోపమే అవుతుంది.

హేతువాదం మూసుకుపోయిన విధానంకాదు. మూసవిధానం కూడా కాదు. ఆధునిక విజ్ఞానశాస్త్రాలు ఆవిష్కరించే సత్యాల వెలుగులో నిత్యనూతనంగా వికసిస్తూ, పురోగమిస్తూ వుంటుందేగాని ఎన్నడూ ఆగిపోదు. హేతువాదంలో విశ్వాసాలకు, కరడు గట్టిన భావాలకు తావుండదు. తప్పుగా తేలిన భావాలను, సూత్రాలను, సిద్ధాంతాలను తిరస్కరించడం, సరైనవిగా తేలిన వాటిని సంకోచించకుండా స్వీకరించడం హేతువాద ప్రాథమిక లక్షణంగా వుంటుంది.

హేతువాద లక్ష్యం మానవవాదమే. మానవుడి జీవితసారం స్వేచ్ఛ. అందువల్ల మానవుడి స్వేచ్ఛకు, శ్రేయస్సుకు విఘాతం కలుగకుండా చూడటమే మానవవాద సారం. అందువల్ల అది అన్ని రంగాలలోని నియంతృత్వ పోకడలను వ్యతిరేకిస్తుంది. మానవ వికాసానికి అడ్డుతగులుతున్న అన్ని మతాలను, మూఢనమ్మకాలను ఖండిస్తుంది. హేతువాదం వ్యక్తి వాదానికి ప్రాధాన్యతనిస్తుంది. నైతికవాదానికి పట్టం కడుతుంది.

<u>చరిత్రలో చార్వాకం - నాస్తికవాదం:-</u>

చార్వాకం, నాస్తికత్వం ఈ నాటి తాత్వికరీతులుకావు. క్రీస్తు పూర్వం వేదకాలం నాడే వేదాలను తిరస్కరించిన వారిని నాస్తికులన్నట్లు మనకు తెలుస్తున్నది. అయితే వైదిక యుగంలోని యజ్ఞయాగాది క్రతువులను,అందులోని కర్మకాండను,మూఢవిశ్వాసాలను నిర్ద్వంద్వంగా ఖండించి, ప్రత్యామ్నాయ జీవిత విధానాన్ని ప్రతిపాదించిన వారు చార్వాకులు.

క్రీస్తు పూర్వం ఆరేడు శతాబ్దాల కాలంలోనే అటుగ్రీసులో ఎపిక్యురస్ వంటివారు నాస్తికత్వానికి పట్టం కడితే భారతదేశంలో అదే కాలంలో చార్వాకులు, లోకాయతుల పేరుతో

ప్రసిద్ధమైనవారు భౌతికవాదానికి, నాస్తికత్వానికి పట్టం కట్టిన వారిలో ప్రథములుగా పరిగణించాలి.

చార్వాకులు చతుర్భూత (భూమి,నీరు,అగ్ని,వాయువు) వాదాన్ని ప్రతిపాదించి ఆ నాలుగు భూతాల సంయోగ వియోగాల వల్లనే సర్వపరిణామాలు సంభవిస్తున్నాయని వివరించినట్లు తెలుస్తున్నది. విశ్వానికి సృష్టికర్త అవసరం లేదని,చైతన్య మనేది దేహాన్ని అంటిపెట్టుకొని వుండే లక్షణమని,ఆత్మ అనేది దేహానికి భిన్నంగా మరణానంతరం వుండజాలదని,పూర్వజన్మలు, పునర్జన్మలు, స్వర్గనరకాలు లేవని, వున్నదొకటే జీవితమని,సుఖంగా జీవించడమే దాని లక్ష్యమని వారు వివరించినట్లు తెలుస్తున్నది. చార్వాకుల గ్రంథాలేవీ నేడు లభ్యం కావడంలేదు. చార్వాకుల సిద్ధాంతాన్ని ఖండిస్తూ, నిందిస్తూ ఇతరులు వ్రాసిన విమర్శల ద్వారానే మనం దాన్ని తెలుసుకో గలుగుతున్నాం.

దీన్ని బట్టి ఆస్తికవాదం, నాస్తికవాదం, భావవాదం, భౌతికవాదం ఆనాటి నుండే సమాజంలో సమాంతరంగా సహజీవనం చేస్తూ వచ్చినట్లు రూఢిగా తెలుస్తున్నది. తరువాతి కాలంలో వచ్చిన ఉపనిషత్తులలోను, సాంఖ్యవైశేషికాది దర్శనాలలోను భౌతికవాద భావాలు,నాస్తికవాద ఛాయలు పుష్కలంగా దర్శనమిస్తాయి. జైనులు,బౌద్ధులు కూడా వైదిక మతాలను ఖండించి భౌతికవాదానికి, నాస్తికత్వానికి పట్టం కట్టడం విశేషం. దాదాపు వెయ్యి సంవత్సరాలు దేశవిదేశాల్లో దేదీప్యమానంగా వెలిగిన బౌద్ధం ప్రపంచానికే ఆదర్శప్రాయంగా నిలవడం అద్భుతం.

శంకరుడి రాకతో భారతదేశంలో బౌద్ధం భ్రష్టమైంది.దాంతో మరో వెయ్యి సంవత్సరాలు భారతదేశం అంధకారంలోను, విదేశీపాలలోను, బానిసత్వంలోను మునిగి పోయింది. బ్రాహ్మణాధిపత్యానికి ఎదురులేకుండా పోయింది. జనాన్ని మత్తులో ముంచే భక్తి ఉద్యమాలు ఊపందుకున్నాయి. మనిషి జీవించేటపుడు ఎదురయ్యే కష్టాలను కర్మవాదంతో సరిపెట్టి మరణానంతరం లభిస్తుందని చెప్పే మోక్షానికి ప్రాధాన్యం ఇవ్వడమే ఆధ్యాత్మిక వాదంలోని అంతర్యం.

ఆధునిక కాలంలో ఆస్తికవాదాలు, ఆధ్యాత్మికవాదాలు మనుషులను మానసిక బానిసత్వంలో కొనసాగించడమే గాక అన్ని రకాల దోపిడికి ద్వారాలు తెరుస్తున్నాయి. బాబాలు, అమ్మలు మహిమలపేరుతో చేసే మోసాలకు అంతులేకుండా పోయింది. నిరక్షరాస్యులు, అమాయకులు నిత్యం వారి మోసాలకు బలైపోతుంటే ప్రభుత్వాలు, పాలకులు మోసగాళ్లకు రక్షణ కల్పించడమే గాక వారిని అన్ని విధాల ప్రోత్సహించడం ఈనాటి వైపరీత్యం. దీనిని ఎదుర్కోడానికి హేతువాదం, నాస్తికత్వం అత్యవసరమవుతున్నాయి.

**భౌతిక వాస్తవికవాదం:-**

భౌతికవాదంలాగే నాస్తికత్వం ఒక తాత్వికవిధానం. దైవభావాన్ని, మతాలను, ఆత్మపరమాత్మలను, అతీతశక్తులను నాస్తికత్వం అంగీకరించదు. దానికి భిన్నంగా ఈలోకం వాస్తవమని, లోకంలో మానవుడు తన కర్మలకు తానే బాధ్యుడని భావిస్తాడు.

అయితే నాస్తికవాదులకు, హేతువాదులకు, భౌతికవాదులకు తేడా ఏమిటని ఎవరైనా ప్రశ్నించవచ్చు. మనం ఇక్కడ చర్చించినట్లు అవన్నీ భౌతికవాస్తవికతను అర్థం చేసుకోడానికి ఏర్పడిన తాత్వికవిధానాలే. ప్రధాన తాత్విక విషయాలలో వాటి మధ్య వైరుధ్యాలు లేని మాట

వాస్తవమే. ఆయా పదాలకుండే అర్థాలను బట్టి వాటి పరిధులు, పరిమితులు మారిపోతాయి. ఆ పదాలకుండే రూఢ్యర్థాలను మనమీనాడు మార్చడానికి ప్రయత్నించడం కంటే నూతనార్థాలను స్ఫురింపజేసే నూతనపదాలను వినియోగించుకోవడం ఉత్తమం.

ఆధునిక విజ్ఞానశాస్త్రం ఆవిష్కరించిన సత్యాలవల్ల పదార్థం అణువులు, పరమాణువుల దశదాటి అత్యంత సూక్ష్మ కణాలరూపంలోను,శక్తిరూపంలోను, విద్యుదయస్కాంత క్షేత్రరూపంలోను వుంటుందనే వాస్తవాన్ని ప్రతిబింబించడానికి గాను నేడు తాత్వికరంగంలో భౌతికవాస్తవికత అనే పదాన్ని సృష్టించుకున్నాం. అందుకే ఆధునిక భౌతికవాదాన్ని భౌతిక వాస్తవికవాదం అంటున్నాం. అలాగే మానవుడేర్పరచుకున్న అనేక రకాల సామాజిక, రాజకీయ, ఆర్థిక, తాత్విక విధానాలకు, వాదాలకు, ప్రతివాదాలకు, సూత్రాలకు, సిద్ధాంతాలకు పునాదిగా వివేకం రూపంలో పనిచేసే హేతుబద్ధమైన ఆలోచనా విధానాన్నే హేతువాదమంటున్నాం.

<u>మానవవాదం - భావవిప్లవం:</u>

హేతువాద మార్గంలో మానవుడి శ్రేయస్సుకు,స్వేచ్ఛకు భంగం కలుగకుండా మానవుడే కేంద్రంగా వుండే జీవనవిధానాన్ని మానవవాదమంటున్నాం. అన్ని వాదాలలోని సత్యాన్ని, మంచిని పుణికి పుచ్చుకున్నదే మానవవాదం.

రాజకీయాలు, ఆర్థికాంశాలు జీవితంలో ఒక భాగం మాత్రమే. అందువల్ల వాటికి ఇవ్వవలసిన ప్రాధాన్యత కంటే అధికంగా ఇవ్వడమేగాక వాటినే జీవిత సర్వస్వంగా భావించడం ఈనాడు కొందరు భౌతికవాదులు, నాస్తికవాదులు చేస్తున్న ప్రధాన తప్పిదం. దీనికి కారణం వారు భౌతిక వాదాన్ని గతితార్కిక భౌతికవాదంగాను,సామాజికాభ్యుదయాన్ని వర్గ సంఘర్షణల ఫలితంగాను, భావించడమే.

మానవుడిని కులాలపేరిట, మతాలపేరిట,జాతులపేరిట విభజించడం ఎంత అ హేతుకమో, వర్గాలపేరిట విభజన చేయడం కూడా అంతే అహేతుకం. గతితర్కంలోని ఏ ఒక్కసూత్రమూ రుజువు కాలేదు. రుజువు కావడానికి అవకాశమే లేదని ఆధునిక విజ్ఞానం తేల్చివేసింది. అయినా మార్క్సిజం పేరిట జనాన్ని మభ్యపెట్టి, ద్వేషాన్ని రెచ్చగొట్టి,విప్లవం పేరిట మారణహోమాన్ని సాగించడం మహానేరం. ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టు విప్లవాలు విఫలం కావడం మనం చూస్తూనేవున్నాం.

మానవుడి మస్తిష్కంలో మార్పురాకుండా వున్నంతకాలం సామాజికాభ్యుదయం అసాధ్యమని గమనించాలి.తప్పుడు భావాల సుడిగుండంలో చిక్కుకొన్న మానవుడిని ముందుగా విముక్తం చేయాలి. అందుకు కావలసింది భావపోరాటమే గాని సాయుధపోరాటం మాత్రం కాదు. అందుకే అభ్యుదయకాముకుల తక్షణ కర్తవ్యం భావవిప్లవోద్యమ నిర్మాణం కావాలి. హేతువాద నాస్తిక సంఘాలు దాని కోసం కృషిచేయాలి.

<u>రాష్ట్రహేతువాద సంఘకార్యక్రమాలు :</u>

అటువంటి భావవిప్లవోద్యమ నిర్మాణంలో భాగంగానే 1979లో ఏలూరులో రాష్ట్రహేతువాద సంఘం రావిపూడివెంకటాద్రి అధ్యక్షులుగా ఏర్పడింది. 1989లో భారతహేతువాద సంఘ అధ్యక్షబాధ్యతను స్వీకరించి 2002దాక ఆ పదవిలోనే ఉన్నా, వెంకటాద్రిగారి సహాయ

సహకారాలతోనే నేటి వరకు ఆంధ్రసంఘం నడుస్తోంది. ప్రస్తుతం ఒంగోలులో హేతువాదసంఘ రజతోత్సవ మహాసభలు 2004 జూన్ 4,5,6 తేదీలలో జరగనున్నాయి. రాష్ట్రహేతువాద సంఘం గత పాతిక సంవత్సరాలుగా అనేక కార్యక్రమాలను చేపట్టి అవిశ్రాంతంగా తన కృషిని కొనసాగిస్తున్నది. హేతువాద ఉద్యమవ్యాప్తికి 1982 సెప్టెంబరులో నెలకొల్పిన "హేతువాది" మాసపత్రిక రావిపూడివెంకటాద్రి సంపాదకత్వంలో ఈనాటి వరకు ఎన్నెన్నో ఆర్థికపరమైన ఆటుపోట్లుకు తట్టుకొని నిలబడి నిరాటంకంగా చీరాలనుండి వెలువడుతున్నది. రాష్ట్రహేతువాద సంఘం రాజకీయాలకు, అన్నీ రాజకీయ పార్టీలకు దూరంగా వుండాలని తీర్మానించుకున్నది.

ఏ ఉద్యమానికైనా పుష్టిని కలిగించేది సాహిత్యసృష్టి. హేతువాద ఉద్యమంలో కొనసాగుతున్న రచయితలు అనేక అంశాలపై ఎంతో విలువైన, ఉత్తమ సాహిత్యాన్ని సృష్టించి దేశంలోనే అగ్రగాములుగా నిలిచారు. అందులో ఒక్క వెంకటాద్రిగారే దాదాపు 70కి పైగా గ్రంథాలను రచించడం ఉద్యమానికే గర్వకారణం.

స్పష్టమైన అవగాహనకు, సందేహాల నివృత్తికి అవసరమైనవి అధ్యయన తరగతులు. గ్రామ, పట్టణ స్థాయినుండి జిల్లాస్థాయి,రాష్ట్రస్థాయి వరకు వందలాది అధ్యయన తరగతులను నిర్వహించడం నిరంతరంగా జరుగుతున్న కార్యక్రమం. ప్రతి రెండేళ్లకొకసారి క్రమం తప్పకుండా ద్వైవార్షిక మహాసభలను రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో నిర్వహించింది. అనేక కులాంతర, మతాంతర వివాహాలను సెక్యులర్ పద్ధతిలో నిర్వహించింది. భారతహేతువాద సంఘంలో పూర్తి సభ్యత్వాన్ని, అంతర్జాతీయ మానవవాద నైతిక సంఘంలో కాంటాక్టు సభ్యత్వాన్ని కలిగి వున్నది. ప్రస్తుతం హనుమంతరావు భారతహేతువాద సంఘ అధ్యక్షులు.

<u>నాస్తిక హేతువాదసంఘాలసమాఖ్య:</u>

మన రాష్ట్రంలో పలు హేతువాద, నాస్తికసంఘాలు పనిచేస్తున్నాయి. అందులో భారతనాస్తిక సమాజం, నాస్తికకేంద్రం, ఆంధ్రప్రదేశ్ హేతువాదసంఘం, రాడికల్ హ్యూమనిస్టు అసోసియేషన్, అనంతపురం జిల్లా హేతువాదసంఘం, హేతువాద వేదిక వున్నాయి. ఈ సంఘాలు, భారతహేతువాదసంఘంలో సభ్యత్వం వున్న మన రాష్ట్రహేతువాద సంఘం కలిసి నాస్తిక హేతువాద సంఘాల ఐక్యవేదిక - ఫొరాగా ఏర్పడి భావవిప్లవానికి కృషి సాగిస్తుండటం సంతోషించదగ్గ పరిణామం. డా॥ఎన్.ఇన్నయ్యగారు ఈ ఐక్యవేదికకు సమన్వకర్తగా వున్నారు.

రాష్ట్రహేతువాద సంఘాధ్యక్షులైన పెన్మెత్స సుబ్బరాజుతో కలిసి రావిపూడి వెంకటాద్రి రచించిన 'ఆంధ్రప్రదేశ్‌లో హేతువాద మానవాద ఉద్యమాల చరిత్ర'ను 2003సం॥లో తెలుగు అకాడమి, హైదరాబాద్‌వారు ప్రచురించడం విశేషం.

తాత్విక ప్రమాణాలలో అంతర్జాతీయ స్థాయిని సంతరించుకున్న రాష్ట్రహేతువాద సంఘం ఆదర్శంగా నిలిచి భారతదేశంలోని భావవిప్లవోద్యమానికి నాయకత్వం వహించి దిశా నిర్దేశం చేయగల సామర్థ్యాన్ని కలిగి వుందనడంలో అతిశయోక్తిలేదు. మహత్తరమైన భావవిప్లవోద్యమ కృషిలో భాగస్వాములు కావలసిందిగా అభ్యుదయకారులందరినీ ఆహ్వానిస్తున్నది.

# దేవుడున్నాడు!

- డి.వి. నరసరాజు

ఆస్తికులు 'దేవుడున్నాడు' అన్నారు.

నాస్తికులు 'దేవుడులేడు' అన్నారు.

'గోరా' గారు 'దేవుడు లేదు' అన్నారు! ఎందుకంటే 'దేవుడు' అనేది ఒక భావమే గనుక - నపుంసక లింగం గనుక - లేదు అన్నారు.

ఈ మధ్య మదరాసులో - ఒక స్నేహితుని యింట్లో ఒక చిన్న గోష్ఠి జరిగింది.

అక్కడ - సోమసుందరంగారని - ఒక నాస్తికుణ్ణి కలిశాను!

ఈ నాస్తికుడు - కొత్తరకం నాస్తికుడు! 'దేవుడున్నాడ'నే నాస్తికుడు! మొదట ఆయన - ద్రవిడ కజగం నాయకుడు రామస్వామి నాయకర్‌గారి శిష్యుడట!

ఆ తరువాత - తానే ఒక కొత్త ఉద్యమం లేవదీశాడట!

ఆయనను గురించి అంతకుముందు వినడమేగాని - కలవడం అదే మొదటిసారి!

ఆయనతో చర్చ ప్రారంభించడం ఎలాగా? అని ఆలోచించి -

ఒక ప్రశ్న వేశాను.

"సోమసుందరంగారూ! దేవుడు ఉన్నాడంటారా? లేడంటారా? అన్నాను.

"లేకేమండి! ఉన్నాడు! నేనేగదండి వాణ్ణి సృష్టించింది!

మనమే సృష్టించిన వాణ్ణి - 'లేదు' అనడం ఏ న్యాయమండి! ఎంత పాపం!" అన్నాడు.

ఆయన వ్యంగ్యం - అందరి ముఖాలలోనూ - చిరునవ్వులు కురిపించింది!

"పైగా పాపం? - దేవుడు ఎంత మంచివాడండి!

దేవుడే గనక లేకపోతే - మనం - అంటే మానవులం ఏమైపోయేవాళ్ళం! అందుకే - ఫ్రెంచి రచయిత 'వోల్టేర్' అన్నాడు - "నిజంగా దేవుడనే వాడే గనక లేకపోతే - ఒకణ్ణి వెంటనే సృష్టించడం చాలా అవసరం!" అన్నాడు.

మానవుల మనుగడకి - దేవుడి అవసరం అంతా యింతాగాదు!

దేవుడు మానవుణ్ణి సృష్టించాడన్న విషయంలో అభిప్రాయ భేదాలు అనుమానాలుండవచ్చుగాని -

మానవుడు దేవుణ్ణి సృష్టించాడనేది - ఎవరూ కాదనలేని - చారిత్రక సత్యం!

ఆదిమానవుడు తన మనుగడకోసమే! దేవుణ్ణి సృష్టించుకున్నాడనేది ఎవరైనా కాదనగలరా!

మానవుడికి మొదట్లో - గాలిపీల్చటం తప్ప - తిండి ఏం తినాలో తెలీదు గదా!

అందుకే - ఎదురుగా వున్న - సాటి మనిషిని చంపి - తినేసేవాడు.

బలవంతుడు - బలహీనుణ్ణి చంపేసేవాడు! తినేసేవాడు!

అలా అయితే - మానవులు - ఒకజాతిగా - ఎలా మిగుల్తారు?

ఆ సందేహం వచ్చి - ఆనాటి ఆదిమానవుల్లో - ఒక మేధావికి బ్రహ్మాండమైన ఉపాయంతోచి -

దేవుణ్ణి సృష్టించాడు?

దేవుడు పేరు చెప్పి - ప్రక్కనున్న మానవుణ్ణి భయపెట్టాడు!

'సాటి మానవుణ్ణి చంపితే దేవుడు నిన్ను శిక్షిస్తాడు' అన్నాడు!

అలా శిక్షించడానికి - "నరకం" - అనే లోకాన్ని సృష్టించాడు! మానవుడే!

'సాటి మానవుణ్ణి చంపకుండా - ప్రేమిస్తే - దేవుడు నీకు మేలు చేస్తాడు' అన్నాడు.

ఆ మేలుకోసం - "స్వర్గం" సృష్టించాడు! అప్పుడు మానవుడు - సుఖం కోసం - 'స్వర్గానికి' ఆశపడ్డాడు!

బాధలకు జడిసి 'నరకం' అంటే భయపడ్డాడు!

మొత్తంమీద దేవుడంటే - భయపడి - క్రమంగా భక్తుడైనాడు!

అంటే - భక్తికి - మూలం - భయమన్నమాట!

అప్పటికి ఇప్పటికీ గూడ - భక్తికి మూలం భయమేనంటే - కాదనగలరా? ఇప్పుడు - పళని - తిరుపతి - శబరిమల - మొదలగు యాత్రాస్థలాలకు - వెళ్ళేవాళ్ళల్లో - అందరూ భక్తులేనంటారా?

వాళ్ళలో - బయటకి కనబడే 'భక్తి' లో 'భయం' లేదంటారా?

భయానికి కారణం - తాము చేసిన పాపాలు ఒక కారణం!

మరొక కారణం - వాళ్ళ ఆత్మవిశ్వాసం లోపించడం!" అన్నారు సోమసుందరంగారు!

మిగతా వాళ్ళందరి మొఖాల్లో - మొదట ఉన్న చిరునవ్వులుపోయి - సీరియస్‌నెస్ చోటుచేసుకుంది.

సోమసుందరంగారు చెప్పిన ఆఖరి విషయం - అందరికీ అర్థంగాలేదని - ఆయనే గ్రహించి - వివరణ ప్రారంభించారు!

"ఈ రోజున నయాపైసా విలువచేసే ఆస్తిలేనివాడు - ఏడాదిలోనో - రెండేళ్ళలోనో లాటరీలోనో - రేసుల్లోనో - దొంగవ్యాపారంలోనో - సారావ్యాపారంలోనో - మరో వ్యాపారంలోనో - కోట్లు గడించాడనుకోండి!

అది తన ప్రతిభేనని - అతడు కలలో గూడా అనుకోలేడుగదా!

'దేవుడిదయ' అని తప్ప వేరే విధంగా తనకు తాను సమాధానం చెప్పుకోలేడు గదా!

అలా భక్తుడైపోతున్నాడు!

తనకు వచ్చిన ఐశ్వర్యానికేగాదు - మానవుడు - అదినుంచీ సృష్టిలో దేనికి సరైన సమాధానం దొరక్కపోయినా - దేవుణ్ణే అడ్డం పెట్టుకుంటాడు!

తన అజ్ఞానానికి - దేవుడు - మంచి 'తెర'గా ఉపయోగపడ్డాడు!

మొదట్లో - మానవుడికి - 'సూర్యుడు' ఎవరో తెలియదు!

చంద్రుడు ఎవరో తెలియదు!

చెట్టు ఎలా మొలుస్తున్నదో - ఎలా పెరుగుతున్నదో - తెలియదు!

వాన ఎలా కురుస్తున్నదో తెలియదు! మెరుపు ఎలా మెరుస్తున్నదో - తెలియదు!

రాత్రి చీకటి ఎలా వస్తుందో - పగలు వెలుతురు ఎలా వస్తుందో -

ఇలా - ప్రకృతిలో - ఎన్నెన్నో విషయాలు తెలియవు!

వీటన్నిటికీ - 'దేవుడు' - ఎంతగానో ఉపయోగపడ్డాడు!

ఆ ఒక్క 'దేవుణ్ణి' సృష్టించుకుని - సాటి మానవులందరి ప్రశ్నలకీ సమాధానంగా - దేవుణ్ణి అడ్డం పెట్టుకుని - వాళ్ళ నోళ్ళు మూయించి - సమాజం సజావుగా సాగడానికి - సులభమార్గం కనిపెట్టాడు!

అదీగాక - మానవుడు - తన వీలుకోసం - సృష్టించుకున్న దేవుడు - ఎంత బుద్ధిమంతుడండీ ! తనను సృష్టించిన మానవుడికి ఎంత విధేయుడండీ! మానవుడు తనకి -

పంది మొఖం పెడితే - ఊరుకున్నాడు!

చేపని చేస్తే ఊరుకున్నాడు!

సింహాన్ని చేస్తే ఊరుకున్నాడు!

దేహానికి నల్లరంగుపూస్తే ఊరుకున్నాడు!

తెల్లరంగు పూస్తే ఊరుకున్నాడు?

తననెత్తిన పాలుపోస్తే వూరుకున్నాడు! నీళ్ళు పోస్తే ఊరుకున్నాడు!

నిల్చోబెడితే నిలుచున్నాడు! కూర్చోబెడితే కూర్చున్నాడు! పండుకోబెడితే పడుకున్నాడు!

ఇన్ని విధాలుగా మానవుడికి ఉపయోగపడ్డ దేవుణ్ణి - సృష్టించుకుని - అన్యాయంగా 'నువ్వే మమ్మల్ని సృష్టించావు' అని దేవుడిమీద అభాండం వేయడం - మానవుని 'కృతఘ్నత' కాకపోతే - 'మరేమిటండీ' అన్నాడు సోమసుందరంగారు - చిరునవ్వుతో!

మొత్తంమీద - సోమసుందరంగారి - 'దేవుడున్నాడు' అనే నాస్తికవాదంలో కొత్తదనం ఆ రోజు అందరినీ ఆకట్టుకున్నది.

ఈనాడు. 21.1.88

---

హేతువాది ప్రధాన సంపాదకులు :

రావిపూడి వెంకటాద్రి

☎ : 08594 - 233403

E-mail : ravipudi2002@rediffmail.com

చందాలు, విరాళాలూ, వ్యాసాలు పంపవలసిన చిరునామా :

మేడూరి సత్యనారాయణ

మేనేజింగ్ ఎడిటర్, ఇంకొల్లు - 523 167. ఫోన్ : 08594 - 244589

Fax : 08594 - 244431 E-mail : meduri2002@rediffmail.com

# హేతువాదమంటే స్వేచ్ఛావాదమే

కు|్రా హనుమంతరావు

మానవ ఉద్భవం, స్వభావం, అస్తిత్వం, ప్రకృతిలో అతని స్థానాన్ని అంచనా వేస్తూ అనేక వాదాలు ఉద్భవించాయి. ఆనాటి వారి జ్ఞానపరిధిలో అనేక జవాబులు చెప్పుకున్నారు. కాని అధిక వాదాలు వాస్తవాన్ని చేరలేక కాల్పనిక తనే వాస్తవంగా భావించి మానవ స్వేచ్ఛాయుత అభివృద్ధికి అనేక రూపాలలో ఆటంకాలను సామాజిక విలువలుగా నిర్ధారించాయి. వాటి వికృత రూపాలే నేడు మనం చూస్తున్న అశాస్త్రీయ భావనలు, ఆచరణలు. 'నమ్మటమే మానవ స్వభావమని' కొందరు– 'ఈ ప్రకృతికి భిన్నంగా మనిషి ఉనికిలోకి వచ్చాడనే వాదాలు అత్యధికుల విశ్వాసాన్ని పొంది మానవజీవిత ధ్యేయ ప్రాతిపదికలను భిన్నంగా ఏర్పరచి ఆయనను నిమిత్త మాత్రునిగా, ఒంటరివానిగా, నిస్సహాయునిగా తయారు చేశాయి.

'మానవుడు వివేకవంతమైన జీవి' అని అంగీకరించినా, ఆది కారణాన్ని కనుగొనాలనే తాపత్రయంలో 'వివేకం దేవుడిచ్చిన జ్ఞానఫలమే' నంటూ మరలా దారి తప్పారు. భౌతిక వాద స్పృహతో కూడిన తాత్విక చింతనలే మానవ స్వభావాన్ని సరిగా అంచనా వేయగలిగాయి. ఆధునిక విజ్ఞానశాస్త్ర ఆవిష్కరణలతో 'విశ్వానికి ఆది అంతం లేదనే' స్పృహ– 'సృష్టివాదం కాల్పనికం పరిణామమే సర్వ జగత్తు లక్షణమనే' తాత్విక చింతన వలన మానవ ఉద్భవం, స్వభావం, స్థానాన్ని గురించిన ఆలోచనలు నూతన పోకడలో సాగాయి. అవే వాస్తవ, ఆచరణాత్మక సిద్ధాంతాలైనాయి.

హేతుత్వం మానవ లక్షణం. హేతుబద్ధ ఆలోచన, జీవనం మానవ ప్రవృత్తి. మనిషి అసహజ నిర్ణయాలు చేసినా అది హేతుబద్ధతతోనే సాధ్యం. జ్ఞానలేమి, విషయ అవగాహనా పరిధి మనిషిని తప్పుదారిలో నడిపాయే కాని ప్రాయికంగా మనిషి హేతువాదే, హేతుదృక్పథం కలవాడే. మనిషి వివేకవంతుడని అంగీకరించిన భావవాదులు దానికి కారణాన్ని ప్రకృతికి, విశ్వానికి వెలుపల వెదికారు. ప్రకృతికి అన్యంగా 'పరమసత్యం' వెదుకులాటతో మనిషిని, జ్ఞానాన్ని, సత్య స్వభావాన్ని అంచనా వేసి కొన్ని వేల సంవత్సరాల మానవ మేధస్సును వృద్ధి చేసాయి. దాని కనుగుణంగానే ఆచారాలు,పద్ధతులు, సత్యసాధన మార్గాలను రూపొందించి మనిషిని స్వేచ్ఛా విహీనుని చేశారు.

ప్రకృతి నియమబద్ధం. దానిని కార్యాకారణ రూపంలో అర్ధం చేసుకుంటాం. ఆ కార్యాకారణతే మనిషిలో హేతుత్వం. వివేకం, భౌతిక వాస్తవికతే జ్ఞాన సోపానం. నియమబద్ధ ప్రకృతి వల్లనే మనిషి వివేకి అయ్యాడు. జ్ఞానమంటే 'ప్రకృతి నియమాలను, కార్యాకారణతను' గుర్తించటమే. కావున జ్ఞానం భౌతికవమైనదే కాని అభౌతికం కాదు. భౌతిక ప్రకృతి సూత్రాలను తన స్వేచ్ఛా సాధనకు వినియోగించుకునే ఆలోచనా పద్ధతే హేతువాదం. ఏది మనిషికి స్వేచ్ఛను ప్రసాదిస్తుందో అదే హేతుబద్ధ నిర్ణయం. మానవశ్రమ, పోరాటమంతా స్వేచ్ఛా సాధనకోసమే. సకల జీవులకు, మనిషికి మధ్య వ్యత్యాసం హేతుత్వ స్థాయిలో నిర్ణయాలు చేసి స్వేచ్ఛ పొందాలని చూస్తాడు. కాని, మానవ జీవనంలో దేవుళ్ళు, దయ్యాలు, మూఢనమ్మకాలు ఉన్నాయేగాని పశుపక్ష్యాదులకు ఆ భావనలు లేవు కాన, వాటిని మనిషికన్నా వివేకవంతమైనవిగా భావించలేము.

కారణం వాటిలో అనుసరణే గాని ఆలోచన లేదు. వివేకం ఉన్నత స్థాయి హేతుత్వ వ్యక్తీకరణ మనిషికే సొంతం. అదే మనిషిని ఇతర జీవజాలం నుండి వేరు చేస్తుంది. వస్తుతః ప్రతివ్యక్తీ హేతువాదే. దానిని వినియోగించే స్థాయి బేధాలను బట్టే హేతుబద్ధ ఆలోచన, అహేతుక ఆలోచన అంటాం. జ్ఞానం లేని అంశాలపై నిర్ణయం చేస్తే అది అహేతుకం కావచ్చు. అందుకే ప్రతి విషయాన్ని పరిశీలించి, వాస్తవాన్ని గ్రహించి, లేదా వాస్తవ ప్రాతిపదికలపై ఆధారపడి నిర్ణయాలు చేయాలనే ఆలోచనా వైఖరే హేతువాదం గాని- అదొక వాదం కాదు. జడ, పిడివాదం అంతకన్నాకాదు.

హేతువాద మంటే శాస్త్రీయవాదమే. ఆధునిక విజ్ఞానశాస్త్రం దీనికి వెన్నుదన్ను. భౌతిక వాస్తవికత పునాదిగా, మానవ జీవ వారసత్వ లక్షణాలతో జ్ఞానాన్ని మదింపువేసే పద్ధతే హేతువాదం గాని ముడి సూత్రాల సమాహారం కాదు. మత గ్రంథాలు, అతీత భావనలు అనేక వాదాలకు ప్రమాణాలై మనిషి స్వేచ్ఛా హరణానికి దారితీశాయి. జడత్వమే ఘనమైన మార్పును వ్యతిరేకిస్తూ మౌఢ్యాన్ని కించపరుస్తూ వివేక స్వభావాన్నే అనుమానించే స్థాయికి ఎదిగాయి. ఫలితంగా మానవ ప్రవర్తన అమానుషమై స్వేచ్ఛ నశించింది. హేతుపద్ధతి శాస్త్రీయం కాన వాస్తవాన్ని ప్రామాణికంగా చేసుకొని నిరంతర మార్పును స్వాగతిస్తుంది. గమనశీలత, నూతనత్వం, సజీవలక్షణం. హేతుబద్ధత జీవన తత్వ లక్షణాలు. సత్యం పరమం కాదు, పరిణామశీల మనేది హేతువాద అవగాహన.

ఏ సమాజమైనా జడంకారాదు. జడమైనదంటే మానవ స్వేచ్ఛా వ్యతిరేకమని గుర్తించాలి. మార్పు నాహ్వానించక పోతే మన చేష్టలు పశుప్రాయంలోనే ఉంటాయి. నిత్య నూతనత్వం సజీవ సమాజ లక్షణం. దానిని సజీవంగా కొనసాగించాలనే ఆలోచనే హేతువాదం. శాస్త్ర విరుద్ధ అంశాలను, మానవ స్వేచ్ఛా ఆటంకాలను వ్యతిరేకించాలి. అందుకే హేతువాదులు సంప్రదాయ వ్యతిరేకులుగాను, విప్లవకారులుగాను కనపడతారే గాని, అది వాస్తవంకాదు. వాస్తవాన్ని అంగీకరించే మనస్తత్వం అలవర్చుకోవాలి. ఆ వాస్తవాలను తెలిపేదే హేతువాదం కాని- వ్యతిరేకవాదం, రెటమతంకాదు.

తత్వమంటే మతమేననే సాంప్రదాయం కొనసాగింది. తత్వమంటే అర్థంలేని, అవాస్తవ ఊహలతో కూడినది కాదు. అటువంటి తత్వం 'పిచ్చివాని స్వర్గమే'. ఉన్నదంతా భౌతికమే అయినప్పుడు, మన జ్ఞానం భౌతికమే. దాని తాత్విక ఫలితాలే మన జీవన విధానం కావాలి. దానికి శాస్త్రం ఆలంబన కావాలి. జీవన తత్వమంటే 'భౌతిక వాస్తవికత, దానిపై ఆధారపడిన ఆలోచనలు, విశ్వనియమబద్ధత' ప్రధానమైనదే. తత్వం ధ్యేయం సత్య నిర్ధారణ. మానవ సంక్షేమ మైనపుడు మనం భౌతిక తత్వాన్నే ఆహ్వానించాలి. ఉన్నత జీవన విలువలు ఏర్పరచాలి. దానిని వదలిన దేదైనా 'నేల విడిచిన సాము అవుతుందేగాని' వాస్తవం కాలేదు. కావున హేతువాదం తత్వమనేది భౌతిక తత్వాన్నే.

ఆచారవ్యవహారాలు, దైవభావం వ్యతిరేకించటమే దీని ధ్యేయం కాదు. స్వేచ్ఛా విరుద్ధాలను, అసంబద్ధాలను వేటాడటమే దీని లక్ష్యం. స్వేచ్ఛా సాధనకు ఆచారసంప్రదాయాలను

ప్రశ్నించి విజ్ఞానదివిటీతో మార్పు నాహ్వానిస్తుంది. ఆచార వ్యతిరేకత అనైతికం కాదు. ఉచితాను చితాలను మరచిన అనుసరణే అనైతికం. శాస్త్ర హోదాలేని వివక్షలన్నీ అనైతికాలే. హేతుబద్ధ ఆలోచన ఏనాటికీ అనైతికం కాదు. దానిని వ్యతిరేకించట మంటేనే మన స్వభావాన్ని పశుస్థాయికి దించుకోవటం అవుతుంధి. మనిషిలోని ప్రాయిక హేతుత్వమే మనిషిని వివేకిగా మార్చింది.

హేతువాద లక్ష్యం స్వేచ్ఛ. మనిషి భౌతిక, మానసిక ఉన్నతికి మూలం స్వేచ్ఛే. ప్రాథమికంగా భౌతిక అవసరాలకు, ఉన్నత స్థాయిలో మానవీయత సాధనకు అది అవసరం. జీవ లక్షణం స్వేచ్ఛ.జడమైనదేదీ స్వేచ్ఛాళువుకాలేదు. మానవపోరాట మంతా స్వేచ్ఛా పోరాటమే. హేతుత్వమే మనిషికి స్వేచ్ఛనిస్తుంది కాని దేవుడు కాదు. ఏభావాల ఉచ్చునుండి బయట పడితే స్వేచ్ఛ వస్తుందో, ఏదిశాస్త్రీయమో, దానిని సమర్థించే విధానమే హేతువాదం. హేతుబద్ధత లేనివాడు బానిస అవుతాడే గాని స్వేచ్ఛా జీవికాలేడు. ఆచార వ్యతిరేకత, విచక్షణాయుత ఆలోచనతోనే స్వేచ్ఛసాధ్యం.

హేతువాదమంటే కేవల భౌతిక వాదం కాదు. ఏది ఉన్నదో దానినే అంగీకరిస్తూ మానవ స్వేచ్ఛాయోజన సాధనగా భౌతికవాదం ఉపకరిస్తుందే గాని, బౌతికవాద సమర్థింపే దీని ధ్యేయం కాదు. విశ్వతత్వంతో ప్రారంభమై పరిణామాత్మక లౌకిక నీతితో ముగుస్తూ మానవ అస్తిత్వ సమగ్ర అవగాహననందిస్తుంది. హేతుత్వం, ఉనికి, కోరికలు, ఉద్వేగాలు, ఇచ్ఛ, సహజాతాల అవగాహనకు విశ్వ పరిధికి వెలుపల అన్వేషణ చేయదు. బౌతిక వాస్తవికత పునాదే గాని, అదే లక్ష్యంకాదు.

హేతువాదం నాస్తికవాదం పర్యాయపదాలుకావు. హేతువాదంలో నాస్తికత్వం ఓ మజిలీ అయినా, 'నాస్తి' అనటమే దీని ధ్యేయంకాదు. వ్యతిరేక భావనతో ఆగక నిశ్చిత భావనలో జీవన తత్వాన్ని రూపొందించడం దీని ధ్యేయం. 'ఏదైతే వున్నదో' అదే దీనికి ప్రమాణం. మనిషి ఉనికి అత్యున్నతమని చెప్పటానికే దైవభావ వ్యతికేత ఇందులో భాగమైంది. హేతువాది నాస్తికుడైనంతనే అతని సమస్య తీరదు. స్వేచ్ఛా ఆవరోధాలైన దైవం, దాని ఉపరితలంగా ఏర్పడిన ఆచారసంప్రదాయాలను వ్యతిరేకించి లౌకిక జీవన స్వేచ్ఛా సాధన, ప్రత్యామ్నాయంలో జీవన విధానరూపకల్పనే హేతువాదలక్ష్యం. ఆ క్రమంలో జ్ఞానం, సత్యం, స్వేచ్ఛ, లౌకిక నీతి మానవ ఉన్నత విలువలుగా పరిగణించి వాటి సాధన దిశలో సాగే నిరంతర జీవిత ప్రక్రియే హేతువాదం.

జ్ఞానేంద్రియాలు ప్రకృతిని స్పృశించి దాని విషయాలను మెదడుకు చేరుస్తాయి. మెదడులో భావోత్పత్తి జరిగి మనిషి ప్రవర్తనను క్రమబద్ధం చేస్తాయి. మనిషిని నడిపేది భావాలు, ఉద్దేశ్యాలేగాని భౌతిక పరిస్థితులు కాదు. ఆ భావాలు వ్యక్తి ఔన్నత్యాన్ని, వ్యక్తి వికాసాన్ని సాధించాలంటే సాంప్రదాయ భావాలలో మార్పు తేవాలి. అపుడే మనిషి ఆధునికుడవుతాడు. కాన హేతువాద లక్ష్యం భావాలలో మార్పు తేవటం. దానికి వీరు కాంక్షించే విప్లవం 'భావవిప్లవం'. జ్ఞానవంతుడే సత్యవంతుడవుతాడు. జ్ఞానం భౌతిక విషయ సమాహారమే గాన సత్యం కూడా భౌతికం, పరిణామశీలమే. భౌతిక జ్ఞానసారమైన సత్యం పరమంకాదు. ఆ సత్య నిర్ధారిత జీవన తత్వంతో మనిషి చేరేది మానవవాదానికే. కారణం భౌతిక అంశాలు మానవ సహితాలేగాని

మానవాతీతంగా లేవు. కాబట్టి దీని ధ్యేయం ఇహలోక జీవనం, సుఖసంతోషాలు, మానవశ్రేయమే కాన హేతువాద లక్ష్యం మానవవాదమే. అదే దాని ప్రాధమ్యం గాని, దేని సమర్ధన -వ్యతిరేకతకాదు.

'మానవుడే మానవజాతికి మూలం'. తన భవితవ్యాన్ని తానే నిర్ణయించు కోగలడనే' అవగాహనే మానవవాద ప్రాతిపదిక. ఆ అవగాహనతో జాతి, మత, కుల, లింగ వివక్షలు లేని సమతా సామాజిక జీవనాన్ని సమర్ధించే 'జీవిత విధానమే' మానవవాదం.మనిషి శ్రేయస్సును మనిషే కోరతాడు గాని 'ప్రాకర్మ'ను కాదు. ప్రాకర్మ వాదాన్ని తొలగించి వ్యక్తి స్వేచ్ఛా జీవనమే దీని ధ్యేయం'.

పరాధీనతే మానవ స్వభావమని మతాలన్నీ తేల్చాయి. మానవవాదం దాని నంగీకరించదు. పరాధీనత మానవ లక్షణమేకాదు. భావదాస్యం, నిస్సహాయత, మతాల వల్ల మనిషి పరాధీన తత్వంలో కూరుకుపోయాడేగాని, వివేకి పరాధీనుడు కాలేదు. వీటిని తొలగించి మనిషిని మనిషిగా నడిపించటమే మానవవాద ధ్యేయం. భావదాస్యం, పెత్తందారీ విధానాలు దీనికి శత్రువులు. ఇది భావదాస్యాన్ని ఛేధించి వివేక చోదిత జీవితాచరణలను కాంక్షిస్తుంది. భావ బానిసత్వమే స్వేచ్ఛా విరుద్ధం కాన నూతన భావవికాసంలో సమతా సమాజం, ఉన్నత మానవ విలువలు ధ్యేయంగా సాగుతుంది. ఉచ్ఛ నీచ తారతమ్యాలతో కూడిన పెత్తందారీ స్వభావం దోపిడికీ, ఆధిపత్యానికి, స్వేచ్ఛారాహిత్యానికి తెరతీసింది. మానవవాదం కాంక్షించేది సర్వ సమతా సమాజమే.

స్వేచ్ఛ ఉన్నపుడే మానవ సృజన సాధ్యం. స్వేచ్ఛపై ఏ ఆటంకాలు విధించినా అది సృజనాత్మకతను చంపివేస్తుంది. తన వివేక వినియోగానికి మనిషి కోరుకునేది స్వేచ్ఛనే. స్వేచ్ఛలేని మనిషి సృజనా విహీనుడై పశుస్థాయికి చేరతాడు. పశుపక్ష్యాదులు వారసత్వ లక్షణాలను అందుకోగలవే గాని ఎన్ని తరాలైనా ఆ స్థాయిని దాటలేవు. వివేకి అయిన మనిషి వాటిని వారసత్వంగా పొందినా తరతరానికి ద్విగుణీకృతం చేస్తాడు. అంటే మానవ లక్షణం స్వేచ్ఛా వికాసంతోనే సాధ్యం. సృజనాశక్తి లేని ఏజీవి పరిస్థితులను మార్చలేదు. ముందుకు సాగలేదు.అందుకే మనిషిని చరిత్ర నిర్మాత అంటాం. ప్రయత్న పూర్వకంగా చరిత్రను సృష్టించడం మనిషికే సాధ్యం. చరిత్రను పరిస్థితులే నిర్ధారిస్తాయి. అవే మనిషిని నడిపిస్తాయనేది మానవవాదం కాదు. పరిస్థితులను తన చిత్తాని కనుగుణంగా మార్చుకో గలిగే శక్తి మనిషిని స్వయం సంవృద్ధునిగా చేసింది. కావున దేవుని స్థానంలో భౌతిక పరిస్థితుల నుంచి, అవే మనిషిని నడుపుతాయని తీర్మానిస్తే అది ఆధునిక భావవాద మవుతుందేగాని మానవవాదం కాలేదు. మార్పు మానవ ప్రయత్నం. వరదలో కొట్టుకుపోవటం ఘానవనైజం కాదు. పోరాటం మానవతత్వం. అదీ స్వేచ్ఛ కోసమే. తన స్వేచ్ఛ కోసం చేసే పోరాటంలో చరిత్రను సృష్టిస్తున్నాడే గాని దైవ లిఖితం గాని, బౌతిక పరిస్థితుల ప్రభావంకాని కానేకాదు.

నియమబద్ధ ప్రకృతిలో అంతర్భాగంగా వున్నాననే గ్రహింపే మనిషిని స్వేచ్ఛావంతుని చేసింది. ఆ గ్రహింపు లేనన్నాళ్ళు, స్వేచ్ఛ కోసం అ భౌతిక శక్తి వెంట తిరిగి స్వేచ్ఛను

కోల్పోయాడు. స్వేచ్ఛ వాస్తవికతను అంటి పెట్టుకొని వుంటుంది. ప్రకృతి సూత్రాలను గమనించక పోతే జీవులకు మనుగడే లేదు. నియతి కనుసంధానమే జీవనంగాని నియతి విరుద్ధంగా జీవనాన్ని, స్వేచ్ఛను పొందలేం. అదే మనిషిలో హేతుత్వమై అభివృద్ధి సాధించాడు. విశ్వ నియమాలను ఉపయుక్తంగా చేసుకుని ప్రకృతి దయాదాక్షిణ్యాలపై ఆధారపడక నేడు ప్రకృతినే శాసిస్తున్నాడు. శాసించే నియమాలన్నీ ప్రకృతిలోనివే. అదే మనిషి సృజన. తన వికాసానికి అడ్డుగా ఉండే వాటిని ప్రయత్నపూర్వకంగా తొలగించుకోవటమే స్వేచ్ఛ అంటే. విశ్వం నియమబద్ధంగా కాక రోజుకో రీతిగా సంభవిస్తే ఇది సాధ్యం కాదు. మనిషి జ్ఞాన వంతుడే కాలేదు. అప్పుడు మనం చూచేది పిచ్చివాళ్ళనే గాని మనుషులను కాదు. ఆ నియమ బద్ధతే మనిషిని మనిషిగా స్వేచ్ఛా జీవిగా మారే స్వేచ్ఛ నిచ్చింది.

ప్రకృతి నియతి దైవ నియతి వంటి చపల చిత్తం కాదు. ఇది ప్రాక్కర్మ నియతి అంత కన్నాకాదు. ఏ ఇతర శక్తి ప్రమేయం లేకుండానే నియమబద్ధంగా జరిగే 'స్వయంభువు'. విశ్వం దాని సంఘటనలకు దానిలోని కూడికలు తీసివేతలే కారణం గాని వెలుపలి కారణం లేదు. దానికి ఆది అంతంలేదు. కావున ఆది, తుది కారణాల కోసం వెంపర్లాడాల్సిన అవసరం లేదు. 'దైవశక్తికి వలె దీని కటాక్షం కోసం' ప్రాధేయ పడితే స్వేచ్ఛ రాదు. దాని కార్యాకారణతను అవగాహన చేసుకొని, ఆ నియమాల ఆచరణతోనే మనం స్వేచ్ఛా జీవులమవుతామని గమనించాలి. స్వేచ్ఛ ప్రార్థిస్తేరాదు, అవగాహనతో ఎదురు దాడితోనే సాధ్యం. ఈ రీతి విశ్వ అవగాహనతో మనిషిని స్వేచ్ఛా జీవిగా చేసి మానవస్వామ్యాన్ని సాధించాలనే సంకల్పమే హేతువాదం ధ్యేయం.

మానవవాదం ప్రబోధించే స్వేచ్ఛ విశృంఖులత్వం కాదు. తన అభివృద్ధికే స్వేచ్ఛ కాని ఇతరుల దోపిడికి సాధనం కాదు. మనిషి ప్రాధాన్యతను, సహకార, సాముదాయక జీవనాన్ని గుర్తించామంటేనే మన స్వేచ్ఛ పరిమితులతో కూడిన మానవ స్వేచ్ఛ అని గుర్తించాలి. కాని ఆ స్వేచ్ఛ, 'మానసిక' స్వేచ్ఛావంతమై వుండాలి. మానసిక స్వేచ్ఛలేని వ్యక్తులతో మనం నిర్మించ గలిగేది బానిస సమాజాన్నే గాని, మానవ సమాజాన్ని కాదు. కావున మానవవాదంలో స్వేచ్ఛా భావమంటే 'ఆలోచనా స్వేచ్ఛ' 'భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ' అని గుర్తుంచుకోవాలి. అదే మానవవాద ధ్యేయం.

స్వేచ్ఛావంతుడే నీతివంతుడవుతాడు.నీతి ఐచ్ఛికం. మానసిక, భౌతిక ఆంక్షలతో పాటించే నీతి నీతి కాదు. కాని నేడు మనం ఆచరిస్తున్నది మానవనీతి కాదు, దైవనీతి. దాని అమలుకు అది విధించేది నిర్బంధాన్నే గాని, స్వేచ్ఛను ప్రోత్సహించదు. స్వేచ్ఛావంతులైతే అనైతికులవుతారని దాని అవగాహన. మానవ స్వామ్య ధ్యేయం మానవ లౌకిక నీతి. దీనికి ఆధారం మనిషేగాని దైవం కాదు. లౌకిక రాజ్యాన్ని సుసాధ్యం చేసే లౌకిక నీతే మనం కోరేది గాని, ఉచ్ఛ, నీచ్ఛ తేడాలు, జన్మ, లింగ పరమైన వ్యత్యాసాలతో సమతాభావం లోపించి వివక్షలతో కూడిన నీతికాదు. నీతిని మనిషి వివేకం నిర్ణయించాలే గాని దైవగ్రంథాలు, పూజారులు కాదు.

మానవనీతి, మతనీతి వలె పరమం కాదు. దానికి పవిత్రత నాపాదించాల్సిన పనిలేదు. 'ఆయాకాలమాన పరిస్థితులను బట్టి మానవ సాముదాయక జీవనానికి ఉద్దేశించినదే' నీతి గాని, దానికి పవిత్రతేలేదు. అదీ పరిస్థితుల కనుగుణంగా మారాలి. జడం కారాదు. దానికీ శాస్త్రం, భౌతిక వాస్తవికత పునాది కావాలి. మతం పేరుతో నేటి వరకు జరిగినదంతా వంచనే. ఒకే సమాజంలో సహజీవనం చేసే వ్యక్తుల మధ్య విభిన్నవిలువల నేర్పరచి, విలువలకు మనిషి కన్నా ప్రాధాన్యతనిస్తూ పవిత్రత నాపాదించి వ్యక్తులను వైరి వర్గాలుగా రూపొందించాయి. మతనీతి ఎక్కడ నుండో దిగుమతి అయినదే గాని వాస్తవ సమాజ పరిస్థితుల ఉద్భవం కాదు. మనిషే ప్రాతిపదికగా లేని దానిని నైతికవిలువలుగల, నైతిక సమాజంగా భావించలేం.

నేడు నైతిక విలువలకు మత, కుల పెద్దలు తొడిగిన పవిత్ర కచ్చడాలే ప్రమాణ మయ్యాయి కాని వివేకం కాలేదు. అమానుషత్వాన్ని, అసంబద్ధతలను పాటించటమే నీతి అయింది. హేతువాదం దీని నంగీకరించదు. గిడసబారినదేదీ నీతి కాదు. నీతికి శాస్త్రం పునాది కావాలి. దానికి ఆధునిక విజ్ఞానం ఆలంబనమైనపుడే అవి మానవ స్థాయికి చేరతాయి. మత గ్రంథాలు, దివ్యపురాణ పురుషుల ఉవాచలు వ్యతిరేకించిన వారందరినీ అనైతికులు, పాషండులని దూషించి,వారిని సమాజ ద్రోహులుగా ముద్రవేయటంతోనే నీతి, స్వేచ్ఛ ఆవిరై పోయాయి. అందుకే నేటిమత నైతిక విలువలలో మనం నీతిని వెదికినా కనిపించదు. అవే స్వేచ్ఛా అవరోధాలైనాయి. విచక్షణాయుత రీతిలో ఆచార వ్యతిరేకతలోనే మనం స్వేచ్ఛను పొందగలం.

నీతి మానవికం కావాలి. నైతికత పేరుతో ఏ ఒక్కరినీ వంచించరాదు. అది మతరహితమైనపుడే సాధ్యం. అపుడే అది లౌకిక స్వభావం పొంది సర్వ మానవ హితాన్ని కోరుతుంది. హేతువాదం మానవవాదం కోరేది భావ బానిసత్వంతో కూడిన నీతిని కాదు. బానిస దృష్టిలో ఏదైనా నీతే. విశ్వ మానవహక్కుల స్ఫూర్తితో కూడిన లౌకిక నీతి హేతువాద, మానవవాదుల ధ్యేయం. స్వేచ్ఛావంతులే నీతి వంతులనే భావన దీనిది. స్వేచ్ఛలుప్తమైన చోట మానవ విలువలు మృగ్యమౌతాయి. బానిస సంకెళ్ళకన్నా ప్రమాదకరమైన 'బావబానిసత్వం'ను మెదళ్ళనుండి ప్రారద్రోలాలి. అందుకే మన పంథా సాంస్కృతిక విప్లవం. దాని సాధనతో రాజకీయ, ఆర్థిక, సామాజిక స్వేచ్ఛలన్నీ సాధ్యమౌతాయి. దాని సాధనకు మనం ఎంచుకున్న సాధనం భావవిప్లవం. గమ్యం మానవస్వామ్యం.

నియంతృత్వం దీనికి ప్రధమ శత్రువు. దైవ నియంతృత్వాన్ని, ఆచార నియంతృత్వాన్ని, అధికార నియంతృత్వాన్ని, మత నియంతృత్వాన్ని ఏ మేరకు వదిలించుకో గలిగితే ఆ మేరకే స్వేచ్ఛ సాధించగలుగుతాం. స్వేచ్ఛా సాధన ఆయుధం ఉద్వేగం కాదు. వివేకచోదిత ఉద్వేగం. 'స్వేచ్ఛా పౌరులతోనే స్వేచ్ఛా సమాజం'. 'నైతిక ఉన్నతి గల వ్యక్తులతోనే నైతిక సమాజం సాధ్యం'. ఆ దిశగా మనిషిని నడిపే స్వేచ్ఛా పోరాటమే హేతువాద ఉద్యమం.

# మతం మూఢనమ్మకాలకు మూలకారణం

ప్రొ॥ కె. శేషాద్రి (రిటైర్డ్)

మూఢనమ్మకాలు అన్ని సమాజాలలో ఉంటాయి. కాని, అవి ముఖ్యంగా, హిందూ సమాజంలో ఉన్నన్ని మరెక్కడా లేవనే చెప్పాలి. మహమ్మదు ప్రవక్త ముఖ్యంగా మూఢనమ్మకాలు జ్యోతిషం, మంచిరోజులు, చెడ్డరోజులని వేర్పాటు చేయడం పనికి రాదని గట్టిగా చెప్పాడు. కాని మన దేశంలోని ముస్లింలలో కొద్దో గొప్పో వీటి వలయంలో నుండి తప్పించుకొనలేదు. అంటే ముస్లింలలో మత ఛాందసం ఎంతో ప్రమాదకరమైనప్పటికీ, ఈ మూఢనమ్మకాల విషయంలో వీరు దానికి లొంగిపోతారు. హిందువులలో వీరస్వర్గం యుద్ధంలో చచ్చినవాళ్లకు 'రిజర్వు' చేసి వుంటుంది. అలాగే ముస్లింలకు గూడా ముస్లిం కాని వారితో జరిగే యుద్ధంలోనో లేక మరే విధంగానైనా మతం పేరిట చస్తే దేవుని దగ్గర వారికి పెద్ద స్థలం ఉంటుంది. చచ్చిన తర్వాత బూడిదగానో లేక క్రిములకు ఆహారంగానో అందరూ తయారవుతారు. బ్రతికి బాగున్నంత వరకే 'ఏ ఆట ఆడినా'. అన్ని మతాలలోను కొద్దో గొప్పో పిచ్చి నమ్మకాలు, మూఢత్వం ఉంటాయి. ఇవి విద్యా వికాసాలుంటే రావనడం పొరబాటు. అందరిలోనూ వుంటాయి. శాస్త్రీయ విజ్ఞానం పెరిగితే ఇవన్నీ పోతాయనడం కూడా సరికాదు. ఇపుడు వున్న దేవాలయాలు, మసీదులు మొదలైనవన్నీ కూడా విజ్ఞానం, వికాసం పెరిగిన తర్వాత వచ్చినవే. వీటికి తోడు బాబాలు, అమ్మలు కూడ ప్రజల మౌఢ్యాన్ని అండ చేసుకుని వచ్చిన చీడపురుగులే.

చాలా కాలం నుండి వెలసిన రాముడు, శివుడు, కృష్ణుడు ఇప్పుడు ఎవ్వరికీ పూజ్యులు కారు. సాయిబాబా, అయ్యప్ప మొదలైన కొత్త దేవుళ్ళు దిగబడ్డారు.

"మొక్కిన వరమీని వేల్పు, మోహరమున తానెక్కిన పారని గుర్రము
గ్రక్కున విడువంగవలయు గదరా సుమతీ".

కాబట్టి పూర్వకాలపు దేవుళ్ళకు కాలదోషం పట్టినా సాయిబాబాకు మొక్కితే వెంటనే వరాలిస్తాడు! కాకి గోల చేసుకుంటూ, చెప్పులు ధరించకుండా నల్లదుస్తులు తగిలించుకుని శరణం అయ్యప్పా అని, నెత్తిన కాస్త కల్లుతో అన్నం మూటగట్టుకొని శబరిమల యాత్రపోతే అన్ని కోర్కెలు ఫలిస్తాయినడం మూఢనమ్మకమే. ఆంధ్రులలో ఈ నమ్మకం మెండు. ఈ గుంపులతో అది అయ్యప్ప దర్శనార్థం కాని, పుష్కరాలలో స్నానాలకు గాని, మక్కాలో 'కాబా'ను ప్రదక్షిణం చేసేదానికి కాని, తొక్కిసలాడుకుంటూ ఎంతో మంది నలిగి ప్రాణాలు కోల్పోతున్నారు. అప్పటికీ గుణపాఠాలు నేర్వరు. మూఢనమ్మకాలకు ప్రజలపై ఎంతటి ప్రభావముందో ఆశ్చర్యకరం.

మన దేశంలో ఎప్పుడు కూడా ప్రతి విషయాన్ని ప్రశ్నించాలనే గుణంలేదు. వేదాలలో, ఉపనిషత్తులలో, గీతలో ఉందేదంతా పూర్తి సత్యాలు అవి ఎంత హాస్యాస్పదంగా అసహజంగా వున్నాసరే, ప్రశ్నించకూడదంతే. "ఒరే నీవు ఆదిశంకరుని ప్రశ్నించేటంత వాడివా? నోరుమూస్కో" అని మందలింపు వస్తుంది శంకరుడు పరకాయ ప్రవేశం చేశాడంటే నమ్మాల్సిందే.

యూరప్‌లో ఇలాంటి మూఢత్వం లేదనికాదు. చాలా ఉంటుంది. సూర్యుని చుట్టూ భూమి చుట్టి వస్తుందంటే బ్రూనో అనే శాస్త్రవేత్తని నిలువునా కాల్చారు. గెలీలియో ఈ సత్యాన్ని చెప్పి, ఎన్నో అగచాట్లు పడి, నేనలా చెప్పలేదని చెంపలు వాయించుకుని తన వృద్ధాప్యంలో "బ్రతుకు జీవుడా" అంటూ బయట పడ్డాడు. అయినా భూమి సూర్యుని చుట్టూ చుట్టూతూనే వుంది. సూర్యుడు భూమిని ప్రదక్షిణ చేయడం లేదు అనే సత్యాని ఒప్పుకోలేక తనలో తాను గొణుగుకున్నారు. ఇంకా అమెరికాలో కొందరు డార్విన్ ప్రతిపాదించిన (పరిణామ సిద్ధాంతం)ను ఒప్పుకోరు. కోతి నుండి మానవుడు, అందులోను క్రైస్తవుడు ఆవిర్భవించాడా? ఎంత నాస్తిక వాదం!!

మన దేశంలో వున్న ప్రత్యేకత ఏమంటే పాశ్చాత్యుల వలే ధర్మ వ్యతిరేకులను చీల్చి చంపడం, లేక వారిని కష్టాలుపాలు చేయడం తక్కువ. కాని నమ్మకాలు మాత్రం ఎక్కువ. విన్నంత వరకు విని ఇదంతా మనకెందుకులే అని వెళ్ళే జనం జాస్తి (అంటే ముస్లింల మినహా). శిలా స్థూపాలు ఎంతో మంది పర్యాటకులను ఆకర్షిస్తూ వుండినా, పెద్ద బుద్ధశిలా విగ్రహాలను ఫిరంగులతో నాశనం చేసిన తాలిబాన్ ఉన్మాదులను ఏమనాలి.

ఇలాంటి గుడ్డినమ్మకాలకు ముఖ్యమైన కారణం మతం. మతానికి బీజం దేవుడు, లేక దేవుళ్ళు. దేవుడికి మూఢనమ్మకాలతో సంబంధం లేదని వాదించినా అది యదార్థ పరిస్థితులు చూస్తే సంబంధం కనపడుతుంది. ఒకే దేవుడు అని నమ్మే వాళ్ళను, అంటే క్రైస్తవ, మహమ్మదీయ మతస్థులను, బహుళ దేవుళ్ళన్న హిందువులను పోల్చితే హిందూ సమాజంలోనే మూఢనమ్మకాలు ఎక్కువ. ముస్లింలలో మూఢనమ్మకాలకు తావులేదన్నా, వారి మతంలోనే సమాజ పరిస్థితులలో కొన్నిటిని మూఢనమ్మకాలనక తప్పదు. స్త్రీలను ఘోషా, లేక వారి వెంట్రుకలు కనపడకుండా మూసుకోవాలనే నిబంధన, పురుషుల్లో గడ్డం పెట్టుకోవాలనే నిబంధన మొదలైనవన్నీ మతపరమైన నమ్మకాలయినప్పటికీ మూఢనమ్మకాలే.

ఇక హిందువులకు ఎవ్వరినీ వేళాకోళం చేసే యోగ్యతలేదు. వీళ్ళకు లేస్తే ఒక నమ్మకం, కూర్చుంటే మరొక నమ్మకం. వీరు ఏది చేసినా దాని చుట్టూ ఒక మూఢనమ్మకముంటుంది. హిందూయిజంలోని హైందవ సమాజం ఎలాంటి బోధలు, ఎలాంటి నీచత్వం చూపుతుందో చెప్పనక్కరలేదు. నేటికీ ఇవి కొనసాగుతూనే వున్నాయి. అపశకునాలు, జ్యోతిషంలాంటి వాటికంటే ఇపుడు సరికొత్త రోగం వాస్తుశాస్త్రం. శాస్త్రం అనే మాట ఈలాంటి గుడ్డి చాందసాలకు వుండటం చాలా తప్పు. చదువుకున్న ఇంజనీర్లు వాస్తుశాస్త్ర నిపుణులమని తమ పేరుకు తగిలించుకుంటున్నారు. ఇలాంటి మూఢనమ్మకాలకు అంతులేదు. అమెరికాకు వెళ్ళినవారు అక్కడి శాస్త్ర పరిజ్ఞానాన్ని అర్థం చేసుకుని ఆధునిక పద్ధతులను అవలంబించే దానికి బదులు ఇక్కడ వున్న మూఢత్వాన్ని అక్కడకు తీసుకొని పోతున్నారు.

దేవుడున్నాడోలేడో మనకు తెలియదు. ఆ ప్రశ్న ఎన్నో దశాబ్దాలుగా మానవుని వేధిస్తున్నది. ఈ మతాలు కూడా త్వరలో నశించవు, కానీ వెంటనే హేతువాదానికి ముఖ్యమైన కొన్ని ప్రశ్నలను ఎదుర్కోవలసిన అగత్యం వుంది. గ్రహాలు మనుషుల జీవితాలపై ఏదో ప్రభావం కలదని అనుకొనే దానిప్రకారం జ్యోతిషం, హస్తసాముద్రికం, శకునంలాంటి అశాస్త్రీయాలను ఎదుర్కోవాలి. దాని కొరకు చేసే ప్రాయశ్చిత్తాలు మొక్కుబడులు తప్పుడు తోవలో ప్రజలను తీసుకుని పోతాయి. దీన్ని అరికట్టాలి. దేవుడిచ్చిన సంతానాన్ని నిరోధించకూడదని ముఖ్యంగా ముస్లింలు, రోమన్ కాథలిక్, క్రిష్టియన్లు నమ్ముతారు. ఇది మహా మూఢనమ్మకం. మన మతమే గొప్పది ఇతర మతాలు అసత్యాలు అనే మూఢత్వం ప్రజలలో ద్వేషాలు పుటస్తుంది. మధ్య యూరప్‌లోని యుద్ధాలన్నీ ఈ మతద్వేష ఛాందసుల వల్లనే వేలమందిని మారణహోమాలలో బలిచేసింది.

ప్రాథమిక మానవహక్కులు ఏ మాతాల వల్ల కానీ, ఏ దైవభక్తి వల్లకానీ రాలేదు. ఇవి మానవ చరిత్రలో జరిగిన సంఘటనలలో, విప్లవాలలో మానవుడు సాధించిన జయాలే. ఇది గుర్తుంచుకోవాలి. ఏ మతం కూడా మానవునికి కొన్ని ప్రాథమిక హక్కులుండాలని, వాటిని పరిరక్షించాలని చెప్పలేదు. 1789లో జరిగిన ఫ్రెంచి విప్లవంలో మొదటిసారిగా ఈ హక్కులను ముఖ్యంగా గుర్తించడం జరిగింది. దేవాలయాలలో, చర్చిలలో, మసీదులలో బోధించే గడ్డాలు, పిలకరాయుళ్ళు వీటిని గురించి ప్రస్తావించింది లేదు.

# విద్యావంతులుగా వివేచనా జ్ఞానం పెంచుకోండి

రచన -సంకతాల రామయ్య

సైన్సు రోజు రోజుకూ నూతన ఆవిష్కరణలతో శాస్త్ర, వైజ్ఞానిక రంగాలలో ఎంతో అభివృద్ధి సాధించినప్పటికీ సైన్సుద్వారా అభివృద్ధి చెందిన సాంకేతికతను ఉపయోగించుకొని మత ఛాందసవాదులు మానవ నాశనానికి పాల్పదుతున్నారు. విజ్ఞానశాస్త్ర ఫలితమైన సాంకేతికతను తమ సౌఖ్యానికి వాడుకుంటూ వేరొక వైపు దానితోనే మతాన్ని ప్రజలపై రుద్దుతున్నారు. పూర్వం అన్ని జబ్బులకు మందులు లేక నిస్సహాయంగా దేవుని పూజించగా, నేటి వైద్య విప్లవ రోజులలో కూడా కొందరు వైద్యాన్ని వదలి పూజలు చేస్తున్నారు. దీనికి కారణం మనిషిలో వివేచనా జ్ఞానం నశించటమే.

నేడు మన ప్రభుత్వాలు వాస్తువు, జ్యోతిష్యాలను పురాణ పురుషుల చరిత్రను విద్యాలయాలలో ప్రవేశపెట్టాయి. రాజకీయుల అండతో బాబాలు, అమ్మల ఆశ్రమాలు వీధికొక వాస్తు పండితుడు, జ్యోతిషకేంద్రాలు లైసెన్సులేని వ్యాపార కేంద్రాలై ప్రజల అమాయకత్వాన్ని సొమ్ముచేసుకుంటున్నాయి. రకరకాల యూనిఫారాలతో పనికి మాలిన వెధవలంతా స్వాముల అవతారాలెత్తుతున్నారు. ప్రజలకు ప్రశ్నించే ధైర్యం లేకపోవటం, గోబెల్స్ ప్రచారంతో అవి నిజమని నమ్మే స్థితి నేడు కనపడుతుంది. సైన్సు చదివి పాముకు చెవులులేవు, వినపడదు, పగబట్టటం అబద్ధమని తెలిసినా, నాగుల చవితిరోజు చదువుకున్న స్త్రీలే పుట్టలో పాలు పోస్తారు. విజ్ఞానం కంటే కుటుంబ ఆచారాల ప్రభావం వల్ల వారిలో ఆలోచన, వివేచనాశక్తి లోపిస్తున్నది. హేతువాదులు, నాస్తికులు వివరించినా మార్పురావటం లేదంటే వారు ఆలోచించక పోవటమే ప్రధాన కారణం. సూర్య, చంద్రగ్రహణ కాలంలో ఉపాధ్యాయులు పాఠశాలలో ఒక రకంగా, ఇంట్లో వేరొక రకంగా ప్రవర్తిస్తున్నారు.

హేతువాదినైన నన్ను మీరు పూజలు పునస్కారాలు చేయరా, మీ స్త్రీలు భగవంతుడిని నమ్మరా అని ప్రశ్నిస్తారు. దానికి నేను మేము ఏ మతానికీ చెందిన వారము కాదని సమాధాన మిస్తాను. అయితే కొందరు భౌతికవాద మిత్రులకు కుటుంబసభ్యులు సహకరించిక పోవటం, సమాజంలో వ్యతిరేకులుగా ముద్రవేయించుకోవటానికి ఇష్టపడక మత సంప్రదాయాలనే విధి లేక పాటిస్తున్నారు. అందుకే వెంకటాద్రిగారి 'నాస్తికులున్నారు జాగ్రత్త' 'మనం ఏమి చేయాలి' అనే పుస్తకాలు చదివితే పరిణతిగా ఆలోచించవచ్చు. హేతువాదం ఒక ఆలోచనా విధానం కాన, నైతిక తను వ్యక్తి పరంగా పెంచుకోవాలి. కొందరు మిత్రులు రావిపూడిని రాజీలేని వ్యక్తిగా పేర్కొన్నా నాస్తికులను, ఇతరులను విమర్శించారు కాబట్టి హేతువాదులు ఎవరినీ నమ్మరు, ఇతరుల విశ్వాసాన్ని అంగీకరించరని విమర్శిస్తారు. హేతువాదం ఎవ్వరి ఆదేశంతో నడిచే సిద్ధాంతం కాదని, ఇతరుల స్వేచ్ఛకు భంగం లేకుండా సిద్ధాంత అవగాహనతో సభలు, సమావేశాల నిర్వహణ ద్వారా భావోద్యమాన్ని నడిపేదని నా సమాధానం.

పేద ప్రజలలో మానసికరోగులు పెరిగి కనబడ్డ ప్రతిరాతికీ మ్రొక్కుతూ, దేవుళ్ళు ప్రత్యక్షమయ్యారు. గుడి కట్టాలంటూ సాయిబాబా, అయ్యప్పల పేరుతో చందాలు పోగు చేసి సామాన్యులను మోసం చేస్తున్నారు.కొందరు ప్రభుత్వ యంత్రాంగ సహాయంతో బలవంతంగా చందాలు వసూలు చేస్తున్నారు. నాటు వైద్యులు, మంత్రగాళ్ళు, గళ్ళీబాబాలు తాయెత్తులతో ప్రజలను దోపిడి చేస్తూ మైకులతో దేవాలయాలలో హోరెత్తిస్తున్నా పట్టించుకునే వారే లేరు. ఇన్ని సంవత్సరాలనుండి ఎందరో దేవుళ్ళను కలిసి కానుకలు అర్పించినా ఎందరి కష్టాలు తీరాయో ఆలోచించాలి.

నేడు దేవాలయాలను తలదన్నే రీతిలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో దేవుని ఫోటోలనుంచి సరస్వతి పూజలు, గానాలతో పిల్లల మనస్సుల్లోనే నూరిపోస్తున్నాయి. ప్రభుత్వ

పాఠశాలలు కూడా తిధినక్షత్రాలను చూచుకొనే ప్రారంభిస్తున్నారు. కృష్ణపుష్కరాలు, గోదావరి పుష్కరాలు పేరుతో ప్రజలను ఆర్థికంగా దోస్తున్నారు. ప్రభుత్వానికి ఆదాయం తప్ప మంచి చెడులు పట్టటం లేదు. ఇదే స్థితి కొనసాగితే ముందు ముందు మతవాదుల ఆగడాలు అదుపులేకుండా పోతాయి. అవతార పురుషుల అవతారాలే ఓవింత. అయినా ఇంగిత జ్ఞానం లేకుండా యువత ప్రవర్తిస్తున్నది.

హేతువాదం జీవన విధానంగా ఆచరించక పోతే మన మనుగడే దెబ్బతినే అవకాశముంది. ఉద్యమాలంటే ఊపిరి తీసుకోవటం కాదు, ఆచరించాలి. చెప్పేదానికి, చేసేదానికి పొంతన ఉండాలి. కావున అవకాశం ఉన్న భౌతికవాదులంతా భావోద్యమానికి సహకరించాలి. చదువుకున్న వారు ఆలోచించాలి. జ్యోతిష్యం నిజమైతే మానవ ప్రయత్నం అవసరంలేదు. తల్లిగర్భంలో సౌలభ్యం కోసం కాళ్ళు, చేతులు బిగుసుకొని రేఖలు ఏర్పడతాయి. దానికోసం హస్త సాముద్రికం, నుదుటి వ్రాతలు చూయించుకోనవసరం లేదు. మానవ శరీర ధర్మాలు తెలిసిన డాక్టర్లు కూడా 99%మంది భగవంతుని పైనే భారం వేస్తారు. ఐ.ఎ.ఎస్., ఐ.పి.ఎస్. వారి నమ్మకాలు పశుకాపరులకంటే హీనం. అందుకే మనిషులని 3 రకాలుగా చెప్పాలి. 1.అక్షరాస్యులు, 2.నిరక్షరాస్యులు, 3.చదువుకున్న నిరక్షరాస్యులు. వీరితోనే తంటా. వితండవాదులు విశ్వపరిణామం తెలిసినా స్వర్గ నరకాలంటారు. లంచగొండులు లక్షలు సంపాదించి తిరుపతి హుండీలో కానుకలు వేసి అదే నీతి అంటారు. ఆస్తికుల దృష్టిలో దేవుడు త్రాగుబోతు, తిరుగుబోతు, వ్యభిచారి, లంచగొండి, మానవ గుణాలే లేనివాడు. మనుషులను కష్టపెట్టే స్వభావి. పై లక్షణాలు కలిగిన వారే ఆయనను పూజిస్తారు. దేవుడు వారిని క్షమించి ధనవంతులను చేస్తాడట. ఇంతకన్నా సిగ్గుమాలిన నీతిలేదు.

80% మంది దరిద్రంలో ఉండగా 20% మంది ఆర్థిక వ్యవస్థను ఆడిస్తున్నారు. ప్రజలు చెల్లించే పన్నులతో బ్రతికే ఉద్యోగులే ప్రజలని ఈసడించుకుంటున్నారు. మనం ఆలోచించాలి, నిర్లిప్తత వీడి సామాజికుల భావ దాస్య విముక్తికి మనవంతు కృషి చేయాలి. దానికి పార్టీలతో సంబంధం లేని నాస్తిక, హేతువాద ఉద్యమాలతో కదలాలి. వేల సంవత్సరాల నుండి పాతుకుపోయిన దైవ, కర్మ భావాలు అంత తేలికగా పోవు. కాని మన యత్నం ఆగకూడదు. మార్పు నెవ్వరూ ఆపలేరు.

? ? ?

మతాలన్నీ పుట్టినప్పుడు మంచి లక్ష్యాలతోనే పుట్టి ఉండవచ్చు. లక్ష్యం ఒక్కటే ప్రధానం కాదు. ఆ లక్ష్యాన్ని చేరడానికి అవలంబించే మార్గం కూడా ప్రధానమే.మార్గం అర్థం కావాలంటే ముందుగా ప్రపంచం అర్థం కావాలి. మనిషి అర్థం కావాలి. మనిషి సృష్టించుకున్న వ్యవస్థలు అర్థం కావాలి. అవి అర్థం కానిదే మంచి లక్ష్యాలను ఏర్పరచుకోడానికి కానీ, సన్మార్గాన్ని అవలంబించడానికి కానీ అవకాశం లేదు. "మతం మనిషికి" ఆ అవకాశం లేదు. ఎందుకంటే, అతనికి ప్రపంచం అర్థం కాలేదు. మనిషి అర్థం కాలేదు. మనిషి సృష్టించుకున్న వ్యవస్థలు అర్థం కాలేదు. ఈ ప్రపంచంలో నివసిస్తూ "మరో ప్రపంచం"కోసం కృషి చేయమని మనిషిని మతం ఆదేశించింది. మనుషుల్ని మనషులుగా కాక, మతాలకు,జాతులకు చెందినవారుగా చూచింది. అందుచేత, మతానికొకటి, జాతికొకటిగా నీతి కకావికలమైంది. మతంలో మనిషి స్థానం మనిషిగా శూన్యమైంది. తన కోసం తాను కాక, మరొకరికోసం తాను. తనను నడుపుకొనేది తానుకాదు, మరొకరు తనని నడపాలి. ఈ పరాధీనతా దృక్పధం ధారావాహికంగా సంప్రదాయం ద్వారా మనిషికి సంక్రమించింది. అందువల్ల, ఈనాడు కొద్ది మంది శాస్త్రజ్ఞులకు ప్రపంచం అర్థమైనా, వారిగొంతు వినిపించడంలేదు. అది వినిపించని దౌర్భాగ్యమే శాస్త్ర జ్ఞానాన్ని అపార్థం చేసుకొనే దశకు మనిషిని తోలుతున్నది. అందుచేత, ఈనాటి భయాందోళన స్థితికి కారణం శాస్త్రం కాదు. శాస్త్రీయదృక్పధాన్ని మనిషి వద్దకు చేరనీయని మత దృక్పధమే అందుకు కారణం. ఆర్వీ

# వేదాల్లో అంతా ఉందిష?

వైదిక సాహిత్యంలో వున్న భావాలు ఎంతో అస్పష్టమయిననీ, అసమగ్రమయిననీనిదానికి తోడు సంస్కృత భాషశాస్త్రాభిప్రాయం ప్రకటనకు పనికిరానిదైంది. అందువల్లనే ప్రపంచంలో ఏ యితర సాహిత్యంలోనూ లేనంతగా సంస్కృతంలో వ్యాఖ్యాన సాహిత్యం చోటుచేసుకుంది. పాతదస్తరాలకు కారికలూ, సూత్రాలూ - తిరిగి వాటిరి భాష్యాల దస్తరాలూ అవతరించిన్నై. అలా అవతరించిన వ్యాఖ్యానాలు పరస్పర విరుద్ధంగా ఉన్నాయి. కాబట్టే, వాటిమీద ఆధారపడి అనేక మతశాఖలు తలెత్తిన్నై. శాస్త్రీయ సత్యానికి బేధాలుండవు. అందువల్ల, ప్రాచీనుల ముడి శబ్దాలకు ఆధునిక విజ్ఞానశాస్త్రార్థాలు తీసే అవివేకాన్ని మన్నించడం శాస్త్రపద్ధతికాదు. వైదిక యుగంనాటి నుంచి నిన్న మొన్నటివరకు వచ్చిన యేవ్యాఖ్యాతకూ అర్థంకాని శాస్త్రాన్ని సాధించడానికి వీలుగా సంస్కరించబడ్డ సంస్కృతంలో చూపాలనే కుత్సిత ప్రయత్నం శ్రేయస్కరం కాదు.

"అయంగౌః పృశ్నిరిక్రమీత్
అసదన్మాతరం పురః
పితరంచ ప్రయస్స్వః (ఋగ్వేదం, 10-189)

అనే పాఠానికి సూర్యుడిచుట్టూ భూమీ, భుమిచుట్టూ చంద్రుడూ తిరుగుతున్నట్లు వేదాల్లో వుందని, అర్థం చెప్పే ప్రబుద్ధులు బయలుదేరుతున్నారీనాడు. రామాయణ, భారత, భాగవత, పురాణాది గ్రంథాల రచయితలకు కానీ - అర్యభట, వరాహమిహిర, బ్రహ్మగుప్త, భాస్కరాది ప్రాచీన భారతీయ ఖగోళ శాస్త్రజ్ఞులకుకానీ, వేదాల్లో వున్నట్లు ఫోర్జరీ పండితులు చెపుతున్న సూర్యకేంద్ర సిద్ధాంతం తెలియదు. వారు తమ గ్రంథాల్లో యెక్కడా యీ ప్రస్తావన తీసుకురాలేదు. వేదవిదులుగా చెప్పుకోబడే ప్రాచీన గ్రంథకర్తలకు వేదాల్లో యీ విషయం వున్నట్లు ఎందుకు తెలియలేదు? అనేది సామాన్యుడికైనా రావలసిన ప్రశ్న. వారెవ్వరూ వేదాలు చదవలేదా? చదివినా ఆ భాగాలువారికి అలా అర్థం కాలేదా? తమ గ్రంథాల్లో యెక్కడకానీ వారు సూర్కకేంద్ర సిద్ధాంతాన్ని వివరించకపోవడానికి కారణమేమిటి? మన ప్రాచీన ఖగోళ శాస్త్రజ్ఞులంతా భూకేంద్ర సిద్ధాంతాన్ని మాత్రమే అనుసరించి తమ గణితాలను కొనసాగించడానికి కారణమేమిటి? వేదకర్తల ఖగోళ విజ్ఞానాన్ని హేళన చేసిన బ్రహ్మగుప్తుడుకూడా వేదాలు చదవనట్లేనా? ఆధునిక విశ్వతత్వ దృక్పథంలో ఎంతో విప్లవకరమైన మార్పు తెచ్చిన సూర్యకేంద్ర సిద్ధాంతాన్ని గురించి వేదాల్లో, ఏక్కడో మారుమూలలలో, అర్థంలేని రీతిలో, ఒక్కవాక్యం మాత్రమే(!) వుండడానికి కారణమేమిటో? మాంసాన్ని గురించీ, మద్యాన్ని గురించీ, మగువను గురించీ వేలాది వాక్యాల్లో స్తోత్రాలు గుప్పించిన వేదవాక్కర్తలు సూర్యకేంద్ర సిద్ధాంతాన్ని విపులీకరించకపోవడానికి హేతువేమిటి? ఈ ప్రశ్నలు మన పండితులకురావు. ఎందుకంటే, అసలు ఆ వాక్యార్థమే అది కాదు. కృత్రిమంగా ఆ అర్థాన్ని సాధించడానికి ప్రయత్నించేవారు ఆ పనిని కుత్సిత బుద్ధితోనే చేస్తున్నారు. "అయంగౌః..." అన్న వేదవాక్యంలో 'గౌః' అంటే 'అవు'

అని మాత్రమే కాక, 'చంద్రుడు' అనే అర్థం కూడా వున్నది కాబట్టి - ఆ వాక్యంలో 'భూమి', 'సూర్య' శబ్దాలు లేకపోయినా 'మాతరం', 'పితరం' శబ్దాలున్నాయి. కాబట్టి - సూర్యుడి (పిత) చుట్టూ భూమి (మాత), భూమి (మాత) చుట్టూ చంద్రుడు (గౌః) తిరుగుతున్నాయని కృత్రిమ అర్థాన్ని సాధిస్తే, అది సైన్సు అవుతుందా? పైగా న్యూటన్ సాధించిన భూమ్యాకర్షణ శక్తి సూత్రాలు మన పూర్వులకు తెలుసునంటూ యీ వాక్యం నుంచి పెదర్థంలాగే ప్రబుద్ధులూవున్నారు. ఈ మతోన్మాద స్థాయివల్ల మంచి జరగదు.

వేదాలు ఒక్కరు వ్రాసినవికావు ఒక్కసారి వ్రాసినవికావు. అవిశ్రుతులైనా ఒక్కనాటివికావు. అందుకే వాటిలో ప్రకృతి వాస్తవికతలను గురించి అనేక రకాలైన ఉచ్చాటనలున్నాయి. "సకృద్ధః ద్యౌరజాయత సకృద్భూమి రజాయత" (ఋ. 6-48-22) అన్న వేదవాక్యం ప్రకారం భూమ్యాకాశాలు ఒకేసారి సృష్టి అయినై. "వియాస్తస్తంభ రోదశీ చిదుర్వీ" (ఋ. 7-86-1) అన్న వాక్యం ప్రకారం వరుణుడు ఆ భూమ్యాకాశాలను వేరు చేశాడు. "యేనే మా విశ్వా చ్యవనాకృతాని (ఋ2-12-4) అన్న వాక్యాన్ని బట్టి ఇంద్రుడు వస్తువులన్నటినీ పరిభ్రమించేటట్లు చేశాడు. "యాః పృధ్వీం వ్యధమానామ్ అధృంహత్" (ఋ. 2-12-2) అనే. వాక్యాన్ని బట్టి విడిపోవటం వల్ల చలిస్తున్న భూమిని ఇంద్రుడు కదలకుండా ఆపివేశాడు. "యెద్యామ్ అస్తభ్నాత్" (ఋ. 2-12-2) అన్న వాక్యం ప్రకారం భూమి ఆకాశాన్ని క్రిందపడిపోకుండా నిలబెట్టింది. (2222) ఇదీ ఆవేదాల్లో వున్న విశ్వతత్వం. లోతుల్లోకి వెళ్లితే యింకా చాలా దొరుకుతాయి. ఇలాంటి అమాయక భావాలను వెల్లడించిన వాక్యాలు. భూమ్యాకాశాలు రెండూ రెండుసగాలనీ (ఋ. 2-27-15). రెండూ సమానమైన కొలతలు కలవనీ (ఋ. 3-38-3), గిన్నెల్లాగా ఒకదాని మీద మరొకటి బోర్లించబడి వున్నవనీ (ఋ. 10-89-4; 3-55-20), భూమికి నాల్గుమూలలున్నవనీ (ఋ. 10-58-3), ఎనిమిది కొమ్ము (శృంగా) లున్నవనీ (ఋ. 1-25-8) రకరకాలుగా వేదవాక్యాలు చెపుతాయి. అది వరాహం ఆదిమ జలరాశి అడుగుభాగం నుంచి బురదను పైకి తీసుకువచ్చి తామరాకు మీద ఆరబెడితే భూమి అయిందనీ, అదితాబేలు ఆకారంలో వుంటుందనీ వర్ణించిన సందర్భాలు కూడా వున్నాయి. (22). శతపథ బ్రాహ్మణంలో ఒక చోట ద్యావాపృథ్వలు గుండ్రంగా వున్నాయనీ, మరొకచోట భూమికి నాలుగు కోణాలున్నావనీ, అది నీటిమీద తేలుతున్నదనీ రకరకాలుగా వర్ణించబడి వున్నాయి. (222). అలా వేదవాక్య రచయితలు యెవడికి తోచినట్లు వాడు వ్రాస్తే, మనకిప్పుడు అందులో ఆధునిక విశ్వతత్వమంతా వుందని ప్రగల్భించే పండితులు తయారైనారు. సొంత ఆలోచనలేని ఆధునికులుకూడా ఆ మోహనిద్రలో పడిపోతున్నారు. ఇలా మృత ప్రాకృతం నుంచి రకరకాల అర్థాలు తీయలేక సంస్కృత పండితులు సతమతమవుతుంటే - కొందరు శాస్త్రజ్ఞులు సైన్సు పరిశోధనల్ని తోలుబొమ్మలాట స్థాయిలోకి దిగజార్చటానికి ప్రయత్నించడం శోచనీయం. - రావిపూడి "విశ్వతత్వం" నుంచి - 1978-84)

# ఆలోచించండి

-తుమ్మా భాస్కర్

ఈనాడు వాస్తు, జ్యోతిష్యం, తిథులు, నక్షత్రాలను మత ఛాందసాలు పెద్ద విషయానికి, చిన్న విషయానికి చూడటం పరిపాటి అయింది. యజ్ఞాలు, శాంతి చేయడం మామూలు అయింది. ఇదొక వృత్తిగా మారింది. దేవుడిని నమ్మేవారే కాదు, కమ్యూనిస్టులు కూడా వీటిని నమ్ముతున్నారంటే ఆశ్చర్యమే.

ఎన్నికలలో, క్రీడా పోటీలు లాంటి పలురంగాలలో కూడా ఈ మధ్య ఇలాంటివి బాగా పుంజుకుంటున్నాయి. వాటిని చెప్పడం ఒక ఫ్యాషన్ అయింది. వాటి ఫలితాలు మాత్రం అవును, కాదు అన్నట్లుగా రెండే ఉంటాయి. కొందరు వీటినాధారంగా 'అవును' అని చెప్పగా, మరికొందరు 'కాదు' అని చెబుతారు. వీటిలో ఎవరిదో ఒకటి నిజమవుతుంది. అపుడు వారు'చూసారా! మేము ఎలా కరెక్ట్‌గా చెప్పామో' అని డంబాలు పలుకుతారు. అది ప్రచారంలో ఉంటుంది. అబద్ధం చెప్పినవారి విషయం మరుగున పడటమే గాక దానికి ప్రచారముండదు.

మన నిత్యజీవితంలో మన విషయంలోగాని, మన చుట్టూ ఉన్న వారిలోగాని జరుగుతున్న ఇలాంటి విషయాలను మనం గ్రహించినట్లయితే వాటిలో ఉన్న వాస్తవాలెంతో తెలుస్తుంది.

**ఇటీవల జరిగిన కొన్ని విషయాలను చూద్దాం**

1. పాకిస్థాన్‌లో భారత్ -పాకిస్థాన్ మధ్య ఇటీవల జరిగిన క్రికెట్ పోటీలలో భారత్ గెలవాలని భారతదేశంలో యజ్ఞాలు చేయగా పాకిస్థాన్‌లోని మసీదులలో పాకిస్థాన్ గెలవాలని ప్రార్ధనలు చేశారు. పాకిస్థాన్ విజయాన్ని ఆశిస్తూ ప్రజలు ముల్తాన్‌లోని హజ్రత్ బహాదిన్ జకారియా దర్గ వద్ద వందలాది మేకల్ని బలియిచ్చారు. ఈ టెస్ట్‌లో భారత్ జట్టు గెలిచింది.

2. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో రాష్ట్రమంత్రియైన మండవ వెంకటేశ్వరరావు ఇప్పటి వరకు నాలుగు పర్యాయాలు ఎన్నికలలో పాల్గొనగా ఒక బంధువుతో లెంపకాయలు తిని ఆశీర్వాదం పొందాడు. అలా చేస్తే తాను గెలుస్తాననే నమ్మకం. ఈ సారి కూడ డిచ్‌పల్లి అసెంబ్లీ నియోజక వర్గం నుంచి 27-3-2004న నామినేషన్ వేయడానికి ముందుగా అదే బంధువుతో మండవ భార్యాభర్తలిద్దరు లెంపకాయలు తిని, ఆశీర్వాదం పొంది, నామినేషన్ వేశాడు. తన విజయం ఖాయమనుకున్నాడు. ఎన్నికఫలితాలలో మండవ వెంకటేశ్వరరావు ఓటమి చవిచూసాడు.

3. ఎన్నికలలో తెలుగుదేశం విజయం కోసం శ్రీశైలంలో మల్లికార్జున దేవాలయంలో మంత్రి దండు శివరామరాజు సతీ సమేతంగా యాగం చేసారు.

అసెంబ్లీ, పార్లమెంటు రెండు ఎన్నికలలో తెలుగు దేశం పార్టీ ఘోరంగా పరాజయం పాలయింది.

4. తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రియైన చంద్రబాబునాయుడు తన పార్టీ, తను గెలవాలని, తిరిగి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని తన నామినేషన్ పత్రాలను తిరుపతిలోని వెంకటేశ్వరస్వామి దేవాలయంలో పూజలు చేయించి నామినేషన్ వేసారు. చంద్రబాబునాయుడు గెలిచాడు కాని తెలుగుదేశం పార్టీ ఘోరంగా పరాజయమైంది.

5. నల్లగొండ పార్లమెంటు స్థానానికి పోటీ చేసిన బిజెపి అభ్యర్ధి ఇంద్రసేనరెడ్డి రాహువుకాలం లేకుండా చూసుకొని గెలవాలని నామినేషన్ వేసాడు. కాగా, సి.పి.ఐ. అభ్యర్ధి సురవరం సుధాకర్‌రెడ్డి రాహువుకాలం ఉన్నదని తెలిసి కూడ నామినేషన్ వేసాడు. మరి, సురవరం ప్రతాపరెడ్డి గెలిచాడు.

6. విజయవాడ పార్లమెంటుకు పోటీ చేసిన టి.డి.పి. అభ్యర్ధి, సినీ నిర్మాత అశ్వనీదత్ తన ఓటును పోలింగ్‌బూత్‌లో ఉండి కూడ వెంటనే వేయకుండా ముహూర్తం చూసి ఓటు వేసాడు.

మరి, అశ్వనీదత్ ఓడిపోయాడు.

7. జ్యోతిష్యం చెప్పడంలో దిట్టయని అన్పించుకున్న మంత్రి మోహన్‌రెడ్డి ఈసారి కూడ తెలుగుదేశం పార్టీయే ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని, 13-5-2004న చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా తిరిగి ప్రమాణస్వీకారం చేయబోతున్నారని చెప్పారు.

కాని, తె.దే.పా. ఘోరంగా పరాజయం కావడమే గాక చంద్రబాబునాయుడు తిరిగి ముఖ్యమంత్రి కాలేదు. మంత్రి యైన మోహన్‌రెడ్డి ఓడిపోయాడు. కాంగ్రెసు పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

8. రాష్ట్ర సచివాలయానికి వాస్తు బాగులేదని ప్రధాన ద్వారాన్ని పూర్తిగా మరో రోడ్డుకు మార్చిన తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం మంత్రుల కార్యాలయాలలో కూడా మార్పులు చేర్పులు చేసింది. కాగా, ఈ ఎన్నికలలో తె.దే.పా. పరాజయం కావడమే గాక అనేక మంది మంత్రులు పరాజయం పాలయ్యారు.

9.ఒక మాజీ ఎం.ఎల్.ఏ. గత ఎన్నికలలో ఓడిపోయానని, ఈ సారి ఎన్నికలలోనైనా గెలవాలని తన ఇంటి కాంపౌండు ప్రధాన ద్వారాన్ని వాస్తు ప్రకారం మార్చాడు.

కాని, ఈ ఎన్నికలలో కూడా ఓటమి చవిచూసాడు.

10. కొందరు కమ్యూనిస్టు అభ్యర్థులు తమ గెలుపు కోసం తమ సిద్ధాంతాలకు తిలోదకాలిచ్చి ఇలాంటి మూఢవిశ్వాసాలకు లోనైన వారే. దేవాలయాలలో దేవునికి కొబ్బరి కాయలు కొట్టిన కొందరు ఉన్నారు. ఇట్టి విషయం ప్రధాన పత్రికలలో ఫోటోలతో సహా ఇచ్చారు. అందులో గెలిచినవారు కొందరే.

12.మత ఛాందస భావాలు వంటి నిండా పులుముకున్న జయ నేతృత్వంలోని ఎ.ఐ.డి.యం.కె. మత పార్టీయైన బి.జె.పి. రెండు కలిసి తమిళనాడులో పార్లమెంటు ఎన్నికలలో పొత్తుతో పోటీ చేసింది. ఎ.ఐ.డి.యం.కె అభ్యర్థులు బిచ్చగాళ్ళలా మోకాళ్ళపైన, వంగి వంగి దండాలు పెడుతూ జయలలితనుండి ఎన్నికల సీట్లను పొంది ప్రజాస్వామ్యానికి తీరని మచ్చ తెచ్చారు. ఎన్నికలలో తమిళనాడు పార్లమెంటు సీట్లలో ఒక స్థానాన్ని కూడా ఎ.ఐ.డి.యం.కె. గాని, బి.జె.పి. గాని గెలవలేదు.

ఈ విధంగా దాదాపు అన్ని పార్టీలు పోటీ చేస్తున్న అభ్యర్థులందరును ముహుర్తాలు, వాస్తు, జ్యోతిష్యం పై విశ్వాసం ముంచి నామినేషన్ వేసిన వారే. పూజాపునస్కారాలు దండిగ చేసారు. కాని, ఏ నియోజక వర్గంలోనైన గెలిచేది, గెలిచింది ఒక్కరే. మరి, మిగతా వారి ముహుర్తాలు, వాస్తు, జ్యోతిష్యం, పూజలు, యాగాలు ఏమయ్యాయి? ఈ విధంగా ఎన్నికలలోనే కాదు మిగతా రంగాలలో కూడా బేరీజు వేస్తూ పై వాటిలో ఎంత వాస్తవముందో తర్కిస్తు హేతుబద్ధత, శాస్త్రీయత కోసం వెదకడానికి ఆలోచించండి.

ఎన్నికలలో ఎవరెవరు ఖచ్చితంగా గెలుస్తారో చెప్పండని జ్యోతిష్కులకు నాస్తిక, హేతువాద సంఘాలు విసిరిన సవాలును స్వీకరించి చెప్పిన 250మంది జ్యోతిష్కుల ఫలితాల్లో ఏ ఒక్కటీ రైటు కాలేదు. మరి మంత్రాలకు చింతకాయలు రాలుతాయా?

జోక్: ఓడిపోయిన అభ్యర్థి: నా హస్త సాముద్రికం చూసి నేను ఎన్నికలలో గెలుస్తానన్నావు. మరినేను ఓడిపోయానెందుకు?

జ్యోతిష్కుడు: హస్తసాముద్రికం ననుసరించి ఎన్నికలలో నీ గెలుపు ఖాయమే. కాని, నీ పుట్టుమచ్చలు, తలలోని సుళ్ళను బట్టి గెలుపులేదు. మరి వాటిని ఎన్నికలకు ముందే చూపించక పోతివి.

# ఎన్నాళ్ళు చెబుతాం ఈ విశ్వతత్వం?

సంకలనం: రచన: 'ప్రఫుల్ల'

మనం ఎన్నాళ్ళు చెబుతాం ఈ విశ్వతత్వం గురించి? అని ఒక సహచర ఉద్యమకారుడి ప్రశ్న. ప్రశ్న తేలికగా కనపడినా, జవాబు అంత తేలికకాదు. నిజానికి ఏ ప్రశ్నయినా అంతే, జవాబులివ్వడమే కష్టం. మనం తెలుసుకుంటున్న కొద్దీ విశ్వం సరిహద్దులు విస్తరిస్తున్నాయి. ఒకనాడు మన పూర్వులు తమ దిసనేత్రాలతో పరిశీలించిన విశ్వం పరిమితం. ఆధునిక విజ్ఞానం ప్రసాదించిన దూరదర్శినులు, అంతరిక్ష రేడియో, దూరదర్శినుల సాయంతో మనకు 'దివ్య' చక్షువులు అమరాయి.వాటి సాయంతో మన అవగాహనలోకి వస్తున్న విశ్వం రోజు రోజుకు అపరిమితంగా పెరిగిపోసాగింది. గత రెండు మూడు సంవత్సరాలనుండి ఆధునిక ఖగోళ విజ్ఞానం తన పరిశోధనలతో అనంత విశ్వంలోకి తొంగిచూచి నమోదు చేసిన వివరాలను పరిశీలిద్దాం. ఆ వివరాలతో మన అవగాహన ఏ పాటిదో చూచుకుందాం. మనం ఏ మేరకు తెలుసుకుంటే మన అవగాహన సమగ్రంగా ఉంటుందో అంచనా వేసుకుందాం.

మన భూమికి 2500 కాంతి సంవత్సరాల దూరంలో ఉన్న, 'మోనోసెరస్' నక్షత్ర సమూహం. అక్కడున్న వాయుమేఘాన్ని (నెబ్యూలా) హబుల్ టెలిస్కోప్ మే, 11,2002న చిత్రీకరించింది.నియర్ ఇన్‌ఫ్రారెడ్ కెమెరా అండ్ మల్టీ సబ్జెక్ట్ స్పెక్టో మీటర్ (నిక్మాస్) అనే విధానం ద్వారా హబుల్ ఈ చిత్రాలు ఆవిష్కరించింధి. భూమి నుండి తీసిన ఈ చిత్రాల్లో ఈ నెబ్యూలా శంఖాకారంగా కనుపించింది. అందుకే దీన్ని కోన్‌నెబ్యూలాగా వ్యవహరిస్తున్నారు. దీని అంచు 'అర్థకాంతి సంవత్సరం పొడవు' ఉంది. ఆ నెబ్యూలాలో కొత్తగా ఏర్పడుతున్న యువ నక్షత్రాల నుండి వెలువడుతున్న రేడియేషన్ కారణంగా ఈ నెబ్యూలా కొంత మేర హరించుకుపోయింది. ఈ నెబ్యూలాలోని మరి నాల్గు ప్రకాశవంతమైన నక్షత్రాలను కూడా హబుల్ ఆవిష్కరించింది.

మనకు 2400 కాంతి సంవత్సరాల దూరంలో కె హెచ్ 15 డి అనే ఒక యువనక్షత్రాన్ని వెస్లియాన్ యూనివర్సిటికీ చెందిన విలియం హెర్బెస్ట్ జూన్,2002లో కనుగొన్నారు.యువ నక్షత్రమని ఎందుకంటున్నారంటే దాని వయస్సు కేవలం 30 లక్షల సంవత్సరాలు. మన సూర్యుడి కన్నాచిన్నది. (మన సూర్యుడి వయస్సు 5000 మిలియన్లు లేక5200 కోట్ల సంవత్సరాలు. మధ్య వయసు నక్షత్రం మరొక అంచనా ప్రకారం 4.6×10 సంవత్సరాలు) ఈ నక్షత్రం చుట్టూ రాళ్లూదుమ్మూ ధూళితో కూడిన,గోళాకారంగా రూపుదిద్దుకుంటున్న మేఘాలు తిరుగుతున్నట్లు విలియం హెర్బెస్ట్ బృందం కనుగొన్నది. ఫలితంగా గ్రహణాలు సంభవిస్తున్నాయి. బహుశ ఆ గోళాకార మేఘాలు ఇప్పుడుడిప్పుడే రూపు దాలుస్తున్న (ఆవిర్భవిస్తున్న) ఒక సరికొత్త గ్రహవ్యవస్థ తాలూకు ఆనవాళ్ళుగా శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. అదే గనుక నిజమైతే మన సౌరవ్యవస్థ పూర్తిగా రూపుదాల్చింది కనుక. దీని ఆవిర్భావ దశను పరిశీలించలేని శాస్త్రవేత్తలు కె హచ్ 15 డి తాలూకు సౌర వ్యవస్థ పరిశీలన ద్వారా ఆనాటి

దశను ఊహించవచ్చు. విశ్వతత్వాన్ని అర్థం చేసుకొనడానికి సౌరవ్యవస్థను ప్రామాణికంగా శాస్త్రవేత్తలు గ్రహిస్తారు కనుక, ప్రస్తుతం ఏర్పడుతున్న ఈ సరికొత్త గ్రహవ్యవస్థ మనకు విశ్వతత్వాన్ని మరింత సుబోధకం చేస్తుంది.

జూన్ 14న యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా,కార్నెగీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వాషింగ్టన్‌కు చెందిన శాస్త్రవేత్తలు సమాంతర సౌరవ్యవస్థలోని మన గురుగ్రహాన్ని పోలిన కొత్త గ్రహాన్ని కనుగొన్నారు. మన గురుగ్రహం కన్నా అయిదురెట్లు పెద్దది. వయస్సు 500కోట్లు సంవత్సరాలు. ఇదిభూమికి 41 కాంతి సంవత్సరాల దూరంలో కర్కాటకరాశిలో 55 కాంక్రి అనే నక్షత్రం చుట్టూ పరిభ్రమిస్తున్నది. ఇది సమాంతర సౌరకుటుంబానికి చెందిన 91వ గ్రహంగా శాస్త్రజ్ఞులు పేర్కొన్నారు.

అమెరికన్, డచ్, బ్రిటిష్ శాస్త్రవేత్తలు ప్రయోగించిన పరారుణ ఖగోళ ఉపగ్రహం కూడా ఇలాంటి సమాచారాన్నే వెల్లడించింది. అత్యంత కాంతి వంతమైన నక్షత్రాలలో నాల్గవదిగా చెప్పబడుతున్న వెగా నక్షత్రం చుట్టూ పరారుణ కిరణాల ఉనికిని ఈ ఉపగ్రహం సేకరించింది. వెగా నక్షత్రం మనకు 26 కాంతి సంవత్సరాల దూరంలో ఉంది. వెగా మన సూర్యుడి కన్నా యుక్తవయస్సులోనిది. సూర్యుడి వయస్సు 5000 మిలియన్ల సంవత్సరాలు కాగా, వెగా కొన్ని వందల మిలియన్ల సంవత్సరాలలోనే ఉంది. వెగా చుట్టూ పరుచుకున్న పరారుణ కాంతి కిరణాల రీతి గ్రహాల వంటి ఖగోళాలు బహిర్గతం చేస్తున్న మాదిరిగా ఉంది. అంటే, వెగా చుట్టూ తుది రూపు దిద్దుకుంటున్న ఓ గ్రహవ్యవస్థ ఉండి ఉండాలన్న అనుమానాన్ని రేకెత్తిస్తున్నది.

అలాగే 18న నవంబరు 2002న అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ 'నాసా' ఎన్.జి.సి.6240 అని నామకరణం చేసిన ఒక గ్యాలక్సీ చిత్రం విడుదలచేసింది. రెండు గ్యాలక్సీ కేంద్రంలో రెండు బ్లాక్‌హోల్స్ ఉన్నాయి. ఇంతకు ముందు మన పాలపుంత కేంద్రానికి సుదురాన గల ఒక గ్యాలక్సీ నుండి x కిరణాలు వస్తున్నట్లు శాస్త్రవేత్తలు కనుగొన్నారు. కాని, వాటి మూలం గుర్తించలేకపోయారు. ప్రస్తుతం ఈ రెండు బ్లాక్‌హోల్స్ నుండి ఆ x కిరణాలు వస్తున్నట్లుగా శాస్త్రవేత్తలు బుజువు చేశారు.

ఇంగ్లండ్, ఆస్ట్రేలియా దేశాల ఖగోళ పరిశోధకులు 2డిఎఫ్ అనే పరికరం తయారుచేశారు. దీనికి వందలాది మరచేతులు, ఆప్టిక్ ఫైబర్‌లు 'దూరదర్శినులు' ఇంకా రక రకాల యంత్రపరికరాలు అనుసంధానించారు. వీటి సాయంతో విశ్వాంతరాళంలోని వందలాది ఖగోళ వస్తువులు వివరాలు సేకరించ గలిగారు. ఇప్పటి వరకు రెండు దేశాలవారు 11వేల క్వాజార్ల వివరాలు గల మ్యాప్ తయారుచేశారు. సుదూరంగా ఉండే గ్యాలక్సీలోని వెలిగే కేంద్రాలు వాటిని చూడటమంటే విశ్వాంతరాళంలోకి కోట్లాది సంవత్సరాలు వెనక్కు చూడటమే. అంటే, అప్పటి కాంతి కనుపించడానికి ఇంతకాలం పడుతుందని వేరుగా చెప్పనవసరంలేదు. 2డిఎఫ్ బృందం 14 బిలియన్ల కాంతి సంవత్సరాల దూరం వరకు చూచి వివరాలు నమోదు చేశారు.

ఇంతకన్నా ఎక్కువదూరం గురించి కాలం గురించి ఆలోచించడం వీలుపడదు. ఇంతకు ముందు తెలిసిన దానికన్నా ఎక్కువగా గెలాక్సీలు కుప్పలుగా ఒకచోట గుమికూడి ఉన్నాయని తెలిసింది. విశ్వం ఆవిర్భావ కాలం నుండి ఈ గుంపులు ఉన్నట్లు వారి అంచనా. ఈ పరికరం సహాయంతో ఖగోళ శాస్త్రజ్ఞులు 1000 మిలియన్ కాంతి సంవత్సరాల ప్రకారం వివరాలు చూడగలుగుతున్నారు. మన దిసనేత్రాలతో కొన్ని అడుగుల మేర మాత్రమే చెప్పగలిగితే వారు 1000 మిలియన్ కాంతి సంవత్సరాల మేర చెప్పగలుగుతున్నారు. ఇప్పటికి 60%పూర్తయింది. మొత్తం సర్వే పూర్తయ్యేసరికి 25,000 క్వాజార్ల వివరాలు తెలుస్తాయని అంచనా. బహుశ ఈ బృందం విశ్వం పుట్టుక వివరాలు కనుగొన్నరన్నా ఆశ్చర్యం ఉండదు. ఎందుకంటే వారి పరికరాల శక్తి సామర్థ్యాలు అటువంటివి.

ఫోనిక్స్ నక్షత్ర సమూహంలో అతిపురాతనమైన నక్షత్రాన్ని ఖగోళ శాస్త్ర వేత్తలు ఇటీవలే కనుగొన్నారు.దీనిని 0170 - 5240 అని పిలుస్తున్నారు దీని నుండి విశ్వం ఆవిర్భావం గురించి కొన్ని ఆధారాలు లభిస్తాయని శాస్త్రవేత్తలు అంటున్నారు.

కోట్లాది సంవత్సరాల క్రితం మన సౌరవ్యవస్థ ఉన్న పాలపుంతను మరో చిన్నగెలాక్సి ఢీకొనడంతో పాలపుంత చుట్టూ నీలిరంగు వలయం ఏర్పడినట్లుగా కూడా కనుగొన్నారు. ఈ విషయం అమెరికన్ ఆస్ట్రోనామికల్ సొసైటీ సమావేశంలోనే ప్రకటించారు. ఈ విషయం ఎమ్- థియరీని కొంతవరకు బలపరుస్తుంది.

చిరకాలంగా సౌరకుంటుంబంలో ఉన్న గ్రహాలు తొమ్మిదేనన్న భావన ఉంది.ఖచ్చితంగా తొమ్మిదేనా అంటే ఇప్పుడు సందేహించాల్సిన అవసరమొస్తుంది. మార్చి 2004లో సూర్యుడికి 800 కోట్ల కిలో మీటర్ల దూరంలో ఉన్న 'సెడ్నా' అనే ఖగోళ వస్తువును గుర్తించారు.ప్లూటో కంటే కొంచెం సైజు తక్కువలో ఈ ఖగోళ వస్తువు గ్రహమని కొంతమంది శాస్త్రజ్ఞులూ, కాదని మరికొందరూ అంటున్నారు. ఇంకా మరికొందరు గ్రహశకలమని అంటున్నారు. మరికొందరు సౌరేతర కుటుంబానికి చెందిన ఊర్ట్‌మేఘానికి చెందిన భాగమని అంటున్నారు. ఇంకా పరిశోధనా వివరాలు అందితేగాని పూర్తి వివరాలు బయటపడవు.

సౌరేతర కుటుంబానికి చెందిన 110 గ్రహాలను శాస్త్రవేత్తలు గుర్తించారు. ప్రతి గ్రహం ఒక నక్షత్రం (మన సూర్యుని పోలిన) చుట్టూ పరిభ్రమిస్తుంది. మన గమనికలోనికి వస్తున్న విశ్వంలో మరిన్ని గ్రహాలు ఉండే అవకాశం లేకపోలేదు.దూరదర్శినుల, రేడియో దూరదర్శినుల సామర్థ్యం పెరుగుతున్న కొద్దీ వీటి అసంఖ్యాక వివరాలు మనకు అందుబాటులోకి వస్తున్నాయి. పైన పేర్కొన్నవి కేవలం గత రెండుమూడు సంవత్సరాలలో కనుగొన్న అతి ప్రధానమైన ఖగోళ పరిశోధనకు సంబంధించినవి మాత్రమే. మనం పైన పేర్కొన్న వివిధ దూరాలు కాంతి సంవత్సరాలలో ఉండటం గమనించాం.చాలా మందికి కాంతి వేగం, వాటి కథా కమామిషు తెలిసే ఉంటుంది. కాంతి వేగం సెకనుకు 1,86,000 మైళ్లయితే, దాని

ప్రకారం సంవత్సరానికి కాంతివేగం 365×24×60×60×1,86,000 గంటకు 600 మిలియనుమైళ్లు లేదా $5.4\times10^{12}$.ఇంతటి అనంత దూరాలను మన నేత్రాలు గమనించలేవు. శాస్త్రవిజ్ఞానం మన దృష్టిని అనంతంగా హెచ్చించింది టెలిస్కోల ద్వారా వాటిలో మరలా గ్రౌండ్‌బేస్‌డ్, స్పేస్ బౌస్‌డ్ అని రెండు రకాలు 1990లో ప్రారంభించిన హబుల్ మనకు రోదసిని పై విధంగా ప్రత్యక్షం చేసింది. భూమికి 450 మైళ్ళ దూరంలో కక్ష్యలో తిరుగుతూ 11 మిలియను కాంతి సంవత్సరాల దూరం నుండి వస్తున్న కాంతిని కూడా ఇది పసిగట్ట గలిగింది. అలాంటి కాంతి సంవత్సరాల లెక్కన మన ముంటున్న పాలపుంత గెలాక్సీ వ్యాసం లక్ష కాంతి సంవత్సరాలు. ఈ విశ్వంలో ఒక్కో గెలాక్సీ మధ్య కోట్లాది కాంతి సంవత్సరాలు దూరాలున్నాయి. ఒక లెక్క ప్రకారం ఈ విశ్వం 1250? కాంతి సంవత్సరాల దూరం వరకు విస్తరించి ఉంది. ఆ తరువాత అంతా అగోచరం. అంటే ఆదూరం తరువాత మనకు ఎలాంటికాంతి రావడంలేదు. ఇలాంటి అంచనాలు,దూరాలు మన ఊహలకు అందేవికావు ఒకప్పుడు. అయితే, అపారమైన మానవ జిజ్ఞాస అనంతదూరాలను అధిగమించింది, విశ్వ గవాక్షాల గుండా పయనించి మన జ్ఞానసంపదను అగణిత హద్దులకు ఎలా విస్తరించిందీ అంచనా వేసుకుంటే మనసు ప్రఫుల్లమౌతుంది. మానవుడి విశ్లేషణాత్మక సహేతుకత సృజనాత్మక భావావేశంగా ఎలా పరిణమిస్తుందో మనకవగత మౌతుంది.

ఇంతటి అనంత దూరాలను మన సౌలభ్యం కోసం కుదించి చూచుకుంటే మానవుడి అల్పత్వమూ, అతడు సాధించిన విజ్ఞాన అనంతత్వమూ మనకు అవగతమౌతుంది. విశ్వగతిని మొత్తం ఒక సంవత్సర కాలానికి కుదిస్తే (జనవరి 1 అర్ధరాత్రి నుండి - 31 డిసెంబరు అర్ధరాత్రి వరకు) మన సౌరవ్యవస్థ సెప్టెంబరు 1న ఆవిర్భవించినట్టవుతుంది. మనం నాశనమయ్యాయనుకుంటున్న డైనోసార్లు డిసెంబరు 30 పగలు 12 గంటల సమయంలో నాశనమైనట్లు, మొదటి మానవుడు ఆవిర్భవించినది డిసెంబరు 31 రాత్రి తొమ్మిదిగంటలకు, మానవ చరిత్ర అక్షరబద్ధమవడం ప్రారంభమయి కేవలం 10 సెకండ్లు మాత్రమే అయింది. అందువల్ల మనం ఎన్నాళ్ళు చెప్పుకుంటాం ఈ విశ్వతత్వం అంటే - దీనికి అంతమంటూ ఏది, మన ఎఱుకలోనికి వస్తున్న విశ్వం గురించి ఎల్లప్పుడూ చెప్పుకుంటూనే వుంటాం. మనం మనకు తెలిసిన దానిని ఇతరులకు తెలియచెప్పే ప్రయత్నం చేస్తాం. విశ్వతత్వమైనా అంతే, మరే శాస్త్రజ్ఞానమైనా అంతే. వాస్తవానికి అది హేతువాదు విశ్వం, విశ్వంలో మానవుడు ఉన్నంత కాలం విశ్వత త్వాన్వేషణ, విశ్వ తత్వాన్ని వివరించడం అవసరం, ఉపయోగకరం. హేతువాదులు సమాజాని కంటే, ముందుండి మార్గదర్శకత్వం వహించవలసిన అవరముంది. పనేకాదు. మానవ జిజ్ఞాస పరిణామ క్రమం. హేతుత్వ పరిణామ క్రమం.

# సాంఘిక న్యాయం

జి.సి.హెచ్. వీరాస్వామి

ఆదిలో ప్రకృతిని గురించి ఏమీ తెలియని పరిస్థితుల్లో మానవుడు దేవుణ్ణి పుట్టించాడు. అకస్మాత్తుగా ఉరుములు, మెరుపులు, మబ్బులు, వర్షాలు, చీకటి వెలుగు ఏమీ అవగాహన కావడంలేదు. సమాజం భయపడింది. సహజమేకదా. అందుకే ఒక సృష్టికర్తను అప్పుడే ఊహించుకొంది. ఆయన ఈ అనంత విశ్వాన్ని సృష్టించి సమస్త జీవకోటినినయిష్టానుసారం నడిపిస్తున్నాడని విపరీత శక్తివంతుడని అభిప్రాయ పడింది. ఆ అవగాహనా రాహిత్య సమాజంలో దైవత్వం తదనుబంధంగా పుట్టిన మతం, స్వర్గ, నరకాలు, పాపపుణ్యాలు, జన్మ పరం పరలు, వరాలు, శాపాలుయిత్యాదులన్నీ ఊహాజనితాలు, బూటకాలు - అంటే మానవుని అజ్ఞానం, భయం, నుండి పుట్టుకొచ్చాడు దేవుడు.

ప్రకృతి లక్షణాలు పరిణామక్రమం గూర్చి అవగాహనా పరిజ్ఞానం అభివృద్ధి చెంది, పరిశోధనలతో ఆ ఉరుములు, మెరుపులు, మబ్బులు,వర్షాలు యిత్యాదులు ఎలా ఏర్పడతాయో శాస్త్రజ్ఞులు వివరించి ఋజువు చేసినప్పుడు అవి ప్రకృతి లక్షణాలేగాని దైవసృష్టికాదని నమ్ముతాడు సామాన్యమానవుడు - అదే విధంగా ఏ ప్రకృతి లక్షణమైనా సరే కారణం తెలియనంత వరకు అది దైవసృష్టి అంటాడు. తెలిస్తే ప్రకృతి సహజ లక్షణం అనే భావం ఏర్పడుతుంది.

ప్రకృతి లక్షణాలు తెలుసుకోవడం ప్రారంభం కానంత వరకున్నూ ఆదిమ సమాజంలో ఎవ్వరికీ హాని చేయనంత కాలమున్నూ హాని చేయడానికి అవసరం లేనంత కాలమున్నూ దైవభావం దిన దిన ప్రవర్ధమానమై ప్రతి హృదయంలోను చోటూ చేసుకుంది. ఎవరూ కదపలేనంతగా బలపడింది. సమాజంలో నలుమూలలా వేళ్లూనుకొని మహా వృక్షమై నిలదొక్కుకొంది. కొంత కాలానికి పాడి పంటల పరిజ్ఞానం కలిగింది. సమాజంలో కొందరు ఒక గణం, మరికొందరు మరొక గణంగా విడిపోయారు. ఆ విధంగా గణాలు ఏర్పడ్డాయి. జీవ సహజ లక్షణమైన శారీరక సౌఖ్యం అనుభవించడానికి ఆటవిక దశలో ఏ ఆడదైనా ఏ మగాడితోనైనా సంభోగించడం జరిగేది. కాలక్రమంలో ఆ తీరు రద్దయింది. ఒక మగాడికి ఒక ఆడది అనే సాంఘిక నియమం ఏర్పాటయ్యింది. కుటుంబాలు రూపుదిద్దుకున్నాయి ఫలితంగా అప్పటి వరకు సాగిన మాతృస్వామ్యం అంతరించింది. పురుషుడు పాడి పంటల నిర్వహణ చేపట్టి శ్రమిస్తున్నాడు. ఆడది ఇంటి పనులు చక్కబెడుతూంది. పురుషాధిక్యతా సమాజం ప్రారంభమయ్యింది. దైవభావాన్ని అసరాగా తీసుకొని మేధశ్రమ గాని, శారీరక శ్రమగాని చేయకనే సమస్త భౌతికావసరాలకు వలయు సంపదను మిగతా సమాజం నుండి పొందవచ్చునని గ్రహించింది ఆనాటి సమాజంలో ఒక గుంపు. తదాది విస్తృత ప్రచారంతో భయ కల్పనలతో బూటకపు పునాదుల మీద దైవభావాన్ని నిలబెట్టి,బలపెట్టి అనేక కట్టు కథలతో జీవన ఉపాధిని పొందింది. ఈ నాటికీ పొందుతూంది. ఆ వర్గమే అగ్రవర్ణమయ్యింది. తత్ఫలితంగానే స్వామీజీలు, బాబాలు ఉద్భవించారు. 'గణాల మధ్య భూ ఆక్రమణలకు స్వాధీనాలకు వచ్చిన పోరాటంలో ఓడిన గణాలను బానిసలుగా జేసుకున్నారు గెల్చిన గణం వారు. అప్పుడే శ్రమ దోపిడికి శ్రీకారం చుట్టబడింది. ఫలితంగా వ్యక్తిగత ఆస్తులు వారసత్వపు హక్కులు రూపుదిద్దుకున్నాయి. తదుపరి మరొక గుంపు దైవభావం శ్రమదోపిడికి విపరీత ప్రయోజనకరం అని సామాజిక భౌతికావసరాలకు వలయు సంపదను ఉత్పత్తి చేయడానికి శ్రమ విభజనలో పాల్గొనకనే శ్రమ దోపిడితో అన్ని భౌతిక సుఖాలు అనుభవించ వచ్చునని అనుభవపూర్వకంగా గ్రహించింది. ఆ గుంపే శ్రమదోపిడీ వర్గం. ఆ వర్గీయులే ఆస్థిపరులై

అధినేతలుగా రూపొంది నాయకత్వం వహించి, దైవభావం సన్నగిల్లకుండా సుస్థిరముగా చిరకాలము అమలు జరిగేటట్లు చేయడానికి అగ్రవర్ణం చేపట్టే కార్యకలాపాలకు తోడయ్యారు. తర్వాత తర్వాత వారే రాజులు, మహారాజులయ్యారు. ఇంకే ముంది దేవుళ్లను, మతాలను, స్వర్గ నరకాలను, జన్మ పరంపరలను కర్మలను జనానికి కల్లబొల్లి కబుర్లతో వివరించి, దైవభావం బలహీన పడకుండా తమ తమ యావత్‌శక్తిని వినియోగించి స్థిరంగా ఉండేలా అనుక్షణం యిరు వర్గాలు కృషిచేశాయి. ఇప్పుడు కూడ కృషి చేస్తున్నాయి. బూటకాల్ని ఎంతో గాఢంగా నమ్మించగల్గుతున్నారు. సామాన్య శ్రామికజనాన్ని దైవధిక్కారానికి భయపడేటంతటి దుస్థితికి తెచ్చారు. మౌఢ్యంలో ముంచారు. సామాన్య శ్రామిక జనాన్ని శూద్రులుగా విభజించి అనేక కులాలను రూపొందించన ఘనత వారిదే. "అంతే గాదు, ప్రత్యక్షంగా కనిపించే ప్రకృతి జీవజాలం జీవితం, వాస్తవంగా ఉన్నది". అన్నవాడు- లేదన్నవాడు అని అర్థం వచ్చే నాస్తికుడట- క్షణక్షణానుభవంతో ప్రత్యక్షంగా చూస్తూ ఇదంతా మాయ -"ఏమీ లేదు" అన్నవాడు - ఉన్నదన్నవాడు అని అర్థం వచ్చే "ఆస్తికుడట" శోచనీయంగాలేదూ?

భాషకే తలవంపులు తెచ్చిన మహానుభావులు వారు. విచిత్రమేమిటంటే - అలా వారు అనడటమేకాదు, అందరూ అలా వ్యవహరించే అనేలాగున అంటే సమాజంలో వాస్తవవాదులను "నాస్తికులు" బూటకపు వాదులను "ఆస్తికులు" అనే లాగున స్థిర పెట్టగల్గారు- విడ్డూరంగా లేదూ" కాని జాగ్రత్తగా పరిశీలిస్తే జనంలో ఉండే శారీరక జబ్బులు, జీవనంలో ఉండే ఆకలిబాధలు, సమస్యలు యిత్యాదులే ప్రధానంగా దేవుని నిలబాటుకు మతం ఉనికి మూలాధారం అని మనకు నిర్ధారణ గోచరిస్తుంది. అయితే శాస్త్ర పరిజ్ఞానంతో శారీరక నిర్మాణము, జబ్బులకు కారణము నివారణోపాయము తెలుసుకొని చికిత్సచేసి శారీరక జబ్బులు నివృత్తి చేసే కొద్ది దైవభావం సన్నగిల్లిపోతూ ఉంటుంది. అదే విధంగా ప్రస్తుత వ్యవస్థలో శ్రమచేయని సోమరిపోతు దోపిడి వర్గం ఏనాడో ఏర్పాటు చేసిన సాంఘికేతర న్యాయనియమాలు రద్దుచేస్తే సామాన్య శ్రామిక జన ఆకలిబాధలు, సమస్యలు నివారణవుతాయి. అప్పుడు దైవభావం అంతర్ధానమై పోతుంది. ఆపేరులో శాస్త్రజ్ఞానం అభివృద్ధి చెందే కొద్ది దైవభావం నశిస్తూ ఉంటుంది.

కాని ఆ బాధలకు వాస్తవ కారణాల్ని మరుగునబెట్టి బూటకపు కారణాలు చెప్పి బాధానివారణకు మార్గం ప్రత్యక్ష సామాజిక వాస్తవ పరిస్థితుల్లో వివరించకుండా జనం దృష్టిని పరలోకం వైపుకు మళ్లించి కష్ట సుఖాలకు కారణం అదృష్ట దురదృష్టాలని, పాపపుణ్యాలని, పూర్వజన్మసుకృత, అకృతాలని ఋజువుకందని నిర్హేతుక సంగతులు చెబుతారు. ఆ ఉభయ వర్గాలు వారు అది వారు చేసే ఘనకార్యం. అంతేనా దేవదూషణ చేస్తేకళ్లు పోతాయట.దరిద్రా వస్థకు లోనవుతారట.చచ్చిన తర్వాత నరకలోకానికి పోతారట. అక్కడ యమధర్మరాజు సల సల.మరిగే నూనెలోవేసి మరిగిస్తాడట. ఆహా! ఎంత శోచనీయంగా ప్రచారం సాగిస్తున్నారు! కళ్లు పోవడానికి ఆరోగ్యానికి సంబంధముంటుందని కాని, యిత్యాది వాస్తవ ఋజువు పూర్వక హేతువులు చెప్పరే, నిరాధార మాటలు చెప్పి చెప్పి ప్రజల్లోని శ్రామిక వర్గాన్ని నమ్మించి వాళ్ల బాధలు, కష్టాలు నిరంతరం కొనసాగేలాగ మాత్రమే కాదు, దినదినం అభివృద్ధి అయ్యేలా చేస్తారు. శ్రామిక వర్గంనుండి సోమరిపోతు దోపిడివర్గం గుంజుకుంటున్న శ్రమ దోపిడి వారికి తెలియకుండా కప్పిపుచ్చుకుంటూ జాగ్రత్త పడుతుంది.

ఈ దేశంలో దైవభావం మతం సోమరిపోతు దోపిడి వర్గానికి ప్రయోజనకరమె కూచుతుంది.

# ఆత్మజ్ఞానం

సృష్టి స్థితి లయకారకులు
బ్రహ్మవిష్ణు మహేశ్వరులే అంటే - కాబోసనుకుంటావ్
గుళ్ళో వాళ్లున్నారంటే- గుడ్డిగానమ్మేస్తావ్
చూడు, తరచి తరచి పరిశీలిస్తే
మరి తను పుట్టించిన ప్రతిప్రాణి చస్తుంటే
ఆచతుర్ముఖునకు ఇసుమంతయినా చలనములేదు
తను కాపాడే ప్రతిప్రాణికి కష్టాలెదురైతే
ఆ హరికసలు ఆరాటమేలేదు
తను చంపినప్రతిజీవీ మళ్లీ పుడుతుందనుకుంటే
ఆ శివునిలో ఏమీ స్పందనలేదు
అంటే
ఆ జరిగేవన్నీ ప్రాకృతధర్మాలేగాని
ఎవరెవరి ప్రమేయం లేదని
తెలియుటలేదా-
ఏ దిక్కులేక గుళ్లో స్తంభంలాగా వాళ్లుంటే
వాళ్లే నా దేవుళ్లని నువ్వంటావ్
ఆ రాళ్లే నా దేవుళ్లని  పూజిస్తావ్
అయితే అంతా వాడి దయేనని నమ్ముతావ్
కాకపోతే వాడి దయకోసం తపిస్తావ్
తమ్ముడా!
"జే" కొట్టినా ఆ రాయి ఉలకదు
"గీ" పెట్టినా ఆ రాయి పలకదు
కోపం వచ్చి కొట్టినా ఆ రాయి కదలదు
ఆరాధనతో నైవేద్యం పెట్టినా ఆరాయి నవ్వదు
నాయనా నిజమైన దైవత్వమక్కడలేదయ్యా
దైవత్వమంటే మంచికి మారుపేరుగాని మరేమీ కాదు
తోటి జీవిపై ప్రసరించే
నీ ప్రేమలో దైవత్వముంది, ద్వేషం లేదు
అనురాగంలో ఉంది, అసహ్యతలోలేదు
మైత్రిలో ఉంది,మాత్సర్యములో లేదు
అయితే - మరి అన్నా!
దైవత్వాన్ని తెలుసుకోవాలంటే
ఆత్మజ్ఞానం కావాలన్నారే

ఆత్మజ్ఞానం అంటేనట
మమతా మమకారాలు సున్న
సంతోష విచారాలు సమం
సుఖానికి సంతోషంలేదు, కష్టానికి విచారంలేదు
దూషణ భూషణ భేదంలేదు
"జేజే"లకు పొంగడు, "ఛీఛీ"లకు లొంగడు
ముద్దూ మొద్దూ ఒకటే
మనోహరదృశ్యం చూడాలనే మక్కువలేదు
మధురస్వరం వినాలని మనస్సులేదు
ఆకలి గురించి ఆలోచనలేదు
వాసనభేదం అసలే తెలియదు
అంటే -
అన్నింటికి అతీతంగా ఉంటే
"ఆత్మజ్ఞాని" అంటారట
ఆహ్హాహ్హా
నీ వన్నదే ఆత్మజ్ఞానమైతే
తమ్ముడా!
అది అర్థం పర్థంలేని అజ్ఞానం
ఆచరణకు నోచని విజ్ఞానం
ఆకలిబాధను అణుచుకోవడమే
ఆత్మజ్ఞానమైతే అదెందుకయ్యా మనకు
మనోహర దృశ్యంపట్ల మక్కువ కూడదనేదే
అత్మజ్ఞానమైతే దాన్నక్కడే వదిలేయ్
వాసన భేదం వంటపట్టగూడదనేదే
ఆత్మజ్ఞానమైతే, అదిమనకక్కర్లేదు
మధురస్వరాల కోసం మనసుండగూడదనేదే
ఆత్మజ్ఞానమైతే అవ్వ! దానిజోలికే పోవద్దు
ముద్దుమురిపం మొట్టుమట్టు అన్నీ ఒకటేననేదే
ఆత్మజ్ఞానమంటే అది జ్ఞానశూన్యతకాదా
దూషణ భూషణ భేదంలేదని చెప్పేదే
ఆత్మజ్ఞానమంటే, అది జీవచ్ఛవాల జడత్వం
క్షణ క్షణానుభవం
భౌతికమంతా భ్రమయని చెప్పేదే

ఆత్మజ్ఞానమంటే
అది అంగీకరించడానికి నేను గంగిరెద్దునుకాదు
కళ్లకు కట్టినట్లు కనిపించేదంతా
కల అని చెప్పేదే ఆత్మజ్ఞానమంటే
అదిఒప్పుకొనే వెర్రివెంగళప్పనుకాలేను నేను
ఇదంతాఆత్మజ్ఞానమేనంటే
ఆచరించడానికి నేను ఆయోమయంగాణ్ణికాదు
నిజం -నిజం నాకుతెల్సు
నే చచ్చేవరకు జీవిస్తాను
జగతిని ప్రేమిస్తాను
అవును-అవును నాకుతెల్సు
జీవించినంతకాలం నే జీవినే
జీవలక్షణాలు నా జీవితానికి రక్తి
అందుకే
సుఖానికి సంతోషిస్తా - కష్టానికి విచారిస్తా
జే జేలకు పొంగుతా-ఛీఛీలకు కుంగుతా
కలిమిని కాంక్షిస్తా, లేమిని తరిమేస్తా
సర్వ జీవలక్షణాలకు సహజంగానే స్పందిస్తా
జీవితం నా లక్ష్యం-అనుభవం నాఆంతర్యం
జనుడు మరల మరల జన్మించడమే నిజమనుకొంటే
ఎన్ని జన్మలైనా ఎత్తాలని
ఆశిస్తా, ఆకాంక్షిస్తా, ఆక్రోశిస్తా
అందుకే
ఆత్మజ్ఞానిని నేనని
ఎవ్వరిని దగా చేయను ఆత్మవంచన చేసుకోను
అనుక్షణం భౌతికాన్ని అనుభవిస్తూనే
"ఆత్మజ్ఞానాన్ని"
నేనని ఎవరైనా అంటే
అచ్చంగా అతడు పిచ్చివాడే అంటాను
లేదంటే వాడు కపటే
-కరుడు కట్టిన కపటి-

జి.సిహెచ్.వీరాస్వామి.

ప్రశ్నోత్తరాలు :

## హేతువాదమా, నాస్తికత్వమా, ఏదిముందు?

ప్రశ్న: హేతువాది అయిన తరువాత నాస్తికుడవుతాడా? నాస్తికుడయిన తరువాత హేతువాది అవతాడా? అనే ప్రశ్న నల్లగొండజిల్లా హేతువాద సంఘ కార్యవర్గ సమావేశంలో చర్చకు వచ్చింది. వివరిస్తారా? - సంకతాల రామయ్య.

సమాధానం: ఈ సమస్యపై నేను కనీసం డజను గ్రంథాల్లోనే కాక"హేతువాది"లో అనేక వ్యాసాల్లో వివరించాను. అసలు సమస్య హేతువాదమంటే నాస్తికత్వమనే అపార్థాన్ని కొంత మంది మతవాదులు, మతేతరులు పోషించడమే.

హేతువాదమనేది సిద్ధాంతం కాదు. సిద్ధాంతాలకు దారితీసే ఆలోచనా విధానం మెథడాలజీ, కాగా, నాస్తికత్వం ఒక సిద్ధాంతం. ప్రాయికంగా అది నిరీశ్వరవాదం. దానికి మరెన్ని అర్థాలు, నిర్వచనాలు చెప్పుకున్నా, అది దేవుడు లేడనే వాదంగా స్థిరపడింది. "నాస్తికోవేదనిందకః" అన్న మనుస్మృతి వేదాన్ని వ్యతిరేకించే వాడల్లా నాస్తికుడన్నది. బైబిలులోని హీదెన్లూ, ఖురాన్‌లోని కాఫిర్లు అలా ఆ మత గ్రంథాలను అంగీకరించనివారే అయినా, పాషండుల్ని అన్ని మాతాలూ నాస్తికులుగానే పరిగణించాయి. ఇప్పుడు దేవుడు లేడనే నాస్తికత్వంగా ప్రసిద్ధమైంది.

దేవుడు లేడన్నంతవరకు బాగానే ఉంది కాని, మరి ఉన్నదేమిటి అన్న విషయంలో నాస్తికుల మధ్య ఏకీభావం లేదు. గోరా ప్రకారం విశ్వం లేదు, పదార్థం లేదు, పరిణామం లేదు. ఇలాంటి లేదు లింకా చాలా వున్నాయి. మార్క్సిస్టులు నాస్తికులే కాని, వారిదృష్టిలో కార్మిక నియంతృత్వం ప్రధానం. వ్యక్తి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు చోటులేదు. జర్మన్ అస్తిత్వవాది హీడెగ్గర్ గొప్పనాస్తికుడు. ఆయన ఫాసిజానికి కొమ్ము కాశాడు. అందువల్ల నాస్తికుల తాత్విక భూమిక ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు.

హేతువాదం కార్యకారణత ఉన్న జ్ఞానానికి అన్వయించు కొని నిర్ణయాలు తీసుకుంటుంది.కార్య కారణతపై ఆధారపడటమంటే, స్వతంత్రంగా, స్వేచ్ఛగా ఆలోచించడమే. ఏ గ్రంథ ప్రమాణాన్నీ అది అంగీకరించదు. ఏ వ్యక్తినీ సర్వజ్ఞుడుగా అది పరిగణించదు. నానాటికి మనిషి జ్ఞాన సంపన్నుడయ్యే కొలదీ హేతువాద నిర్ణయాలు వికసించి పురోగమిస్తాయి.

కార్యకారణాలు విశ్వం లోపలివే కాని, వెలుపలివికావు. అవి విశ్వ సంఘటనలతో ముడిపడి ఉంటాయి. సంఘటనలు నిరంతరాయంగా జరుగుతూనే ఉంటాయి. ముందటి సంఘటనను కారణంగా, వెనుక జరిగే సంఘటనను కార్యంగా మనం అర్థం చేసుకుంటాం. విశ్వం వెలుపల కారణాలు వెదకిన వారు ఆస్తికులయ్యారు. విశ్వానికి వెలుపల కారణాలు వెదకని హేతువాదులు నాస్తికులవతారు. అయితే హేతువాదులకు నాస్తికత్వం పరమావధికాదు. అది వారికి ఒక మజిలీ మాత్రమే. వారు విశ్వం వాస్తవికతను అంగీకరిస్తారు. అది ఎలా ఉన్నదో, ఎలా పనిచేస్తున్నదో శాస్త్ర విజ్ఞానం ద్వారా గ్రహిస్తారు. విశ్వ పదార్థం పరిణామం

చెందుతున్నదని గుర్తిస్తారు. భౌతిక వాదులవుతారు. ఇంగ్లీషులో మీద నుంచి వచ్చిన Matter అనే పదానికి కొన్ని వర్గాల వారి నుంచి కొన్ని అభ్యంతరాలు రావడం వల్ల దాన్నే భౌతిక వాస్తవిక వాదమంటారు. ఇది హేతువాదం యొక్క రెండవ మజిలీ. Materialism నాస్తికులైన మార్క్సిస్టులు భౌతిక వాదాన్ని గతి తార్కి భౌతికవాదం పేరుతో అంగీకరిస్తారు కాని, నాస్తికులైన గోరా భౌతిక వాదాన్నే అంగీకరించరు. నిజానికి హేతువాద ఆలోచనను దేవుడికి అన్వయించి నపుడు నాస్తికత్వానికి, ప్రకృతికి అన్వయించినపుడు భౌతిక వాదానికి దారి తీస్తుంది.

ఐతే, హేతువాదాన్ని మనిషికీ, అతను సృష్టించుకున్న సమాజానికీ, జీవన రంగాలకూ అన్వయించనవసరం లేదా? - అంటే ఉన్నది. మనిషి జ్ఞానం ఆర్జిస్తున్నాడు. ఎందుకు? సత్యమేమిటో నిర్ధారణ చేసుకోడానికి. మరిసత్యమెందుకు? సత్యాన్ని తెలుసుకోవడం ద్వారా మనకు ప్రకృతిలోను, సమాజంలోను ఎదురయ్యే నిర్బంధాలనుంచి స్వేచ్ఛను పొందడానికి; మనుషుల మధ్య సహృద్భావాలను నెలకొల్పుకొని నైతిక జీవనం గడపడానికి. అంటే, హేతువాదం మానవవాద లక్ష్యానికి దారి చూపుతుంది. ఇది హేతువాదానికి చివరి మజిలీ, ఈ మజిలీకి మనం దగ్గరయ్యే కొలది అది ముందు ముందుకు జరిగిపోతుంది. ఈ ఫుల్‌స్టాప్ లేని గమనం వైపు హేతువాదం ప్రయాణిస్తుంది. జ్ఞానానికీ ఫుల్‌స్టాప్‌లేదు.

నిజానికి, చార్వాకులు నాస్తికులు కాదు. వారు భౌతికవాదులు. లోకాయతులు. మతం వారిని నాస్తికులుగా మన తరానికి పరిచయం చేసింది. మత దౌష్ట్యం, మౌఢ్యం నచ్చని వారు తొలుత నాస్తికులవతారు. అలా చాలా మంది అయ్యారు. ఆ దౌష్ట్యాన్ని, మౌఢ్యాన్ని ఏ ప్రమాణంతో వారు కొలిచారు అన్ని ప్రశ్నించుకుంటే, హేతువాదంతో తప్ప మరిదేనితోనూ సాధ్యం కాదని మనం అర్థం చేసుకోవాలి. కాన, 'ఆ నాస్తికత్వాన్ని' మనం తప్పుపటటం, హేతువాదం అంతటితో ఆగరాదని మాత్రమే అంటాం. (దీనిపై మరింత వివరణ రావిపూడి రచనలు సంపుటం - 1 "హేతువాదం" సంపుటం -2 "నాస్తికత్వం"లో చూడవచ్చు. సంపుటం-1"హేతువాదం" వెలువడింది సంపుటం 2. "నాస్తికత్వం" త్వరలో వెలువడుతుంది.).

కార్యకారణాలన్నీ ప్రకృతిలోనివే కాన, దానికి వెలుపలి కారణాలు లేవు. ప్రకృతి ఉంది. దేవుణ్ణి జగత్ కారణుడుగా పరిగణించిన ఆస్తికులు దేవుణ్ణి కార్యంగా పరిగణించి, దాని కారణం కోసం తపించలేదు. అందుకే చార్వాకులు జగత్తుకు కారణం దేవుడైతే, దేవుడికి కారణమేమిటి అన్ని ప్రశ్నించారు. నిజానికి జగత్తును స్వయం కారణంగా కూడా పరిగణించ నవసరం లేదు.ఎందుకంటే, **జగత్తు పరోక్షంలో కార్యకారణాల ప్రసక్తిరాదు.** అంటే, జగత్తులో ఏదయినా, ప్రవర్తన అయినా అపసవ్యంగా నయినా, హేతుబద్ధంగా రూపొందవలసిందే మజిలీలయినా అంతే, మార్గాలయినా అంతే. సిద్ధాంతాలకు పరిమితులుంటాయి. ఆలోచనా విధానమైన హేతువాదం జ్ఞానం మేరకు ఎప్పటికప్పుడు వికసిస్తూ ముందుకు సాగుతుంది. అందువల్లనే హేతువాదం మతంగా మారే ప్రమాదం ఉండదు.

- రావిపూడి.

# ఒకే ఒక్కరు

సమాజంలో ఎన్నో అసమానతలుంటాయి. వాటిని ప్రకృతో,కాలమో సరిచేస్తుంది. అందుకు కొంత కాలవ్యవధి పట్టవచ్చు. అయితే ఆలోచనా జీవి అయిన మానవుడు అంతకన్నా ముందుగానే పరిష్కార మార్గాలు ఊహిస్తాడు. అందుకనుగుణంగా ఉద్యమిస్తాడు. అసమానతలకు ప్రతిగా తిరుగుబాట్లు చేస్తాడు. అవే ఉద్యమాలుగా రూపుదిద్దుకుంటాయి. ఆ ఉద్యమాల నుండి నాయకులు పుట్టుకొస్తారు. వారే ఉద్యమ నిర్మాతలుగా చలామణీ అవుతారు. అదొక క్రమం. కానీ ఉద్యమాల్నే సృజించి వాటికి రూపురేఖలు దిద్ది, దిశానిర్దేశం చేసే వ్యక్తులు కూడా ఉంటారు. వారు చాలా అరుదు. అటువంటి వారే నిజమైన ఉద్యమ నిర్మాతలు. ఆంధ్రప్రదేశ్‌లో హేతువాద- మానవవాద ఉద్యమాలకు తాత్విక భూమిక లేర్పరచి, దిశానిర్దేశం చేస్తూ ఎనిమిది పదులు దాటిన వయస్సులో కూడా హేతువాద-మానవవాద పథంలో అవిశ్రాంత పథికుడుగా పయనిస్తూ భావోద్యమాలకు జవజీవాలు పోస్తున్నవారు ఒకరున్నారు.

హైస్కూలులో చదివే రోజులో అగ్రవర్ణ దురహంకారానికి భారత సమాజం కకావికలై అల్లడ తల్లడం కావడాన్ని గుర్తించడంతో ప్రారంభమైన ఆయన నిరసన, కళాశాల సంచికలకు వ్రాయడంతోను, సీతపాతివ్రత్యం మీద లఘుకావ్యం రచించి పెద్దల సలహా మేరకు ప్రచురించకుండా ఆపడంతోను, అనంతరం కవిరాజు రచనలకు ప్రభావితుడై, కవిరాజు మరణాంతరం, ఆయన స్మృతి చిహ్నంగా నాగండ్లలో 'కవిరాజాశ్రమం' స్థాపించి హేతువాద భావ ప్రసారం చేయడంతోను, 1946 నుండి రచనా వ్యాసంగాన్ని చేపట్టి హేతువాద మానవవాద గ్రంథాలు ప్రచురించడంతోను ఆయన కృషి ఊపందుకుంది. ఆ ప్రస్థానాన్ని అలానే కొనసాగిస్తూ భావ విప్లవోద్యమాలలో అక్షర జగత్తుకూ, ఉద్యమ నిర్మాణానికి, ఆచరణకు ఎనలేని కృషి సాగిస్తూనే ఉన్నారాయన. ప్రాయికంగా కళాకారుడు, మేధావి అయిన ఆయన వాటిని జీవిక కోసం కాక, ఉద్యమం కోసమే సంపూర్ణంగా వినియోగిస్తూ, జీవితాన్నే ఉద్యమంగా, ఉద్యమాన్నే జీవనంగా మార్చుకున్న ఉద్యమ నిర్మాత ఆయన ఒక్కరే.

మంచిరూపం, విశుద్ధ గాత్రం కలిగిన ఆయన వాస్తవానికి మంచినటుడు. హైస్కూలు రోజుల నుండి ఇంటర్మీడియట్ వరకు నాటకాలు ఆడారు. ఆ రంగంలో ఉంటే ఆయన నాటకాలలోనో, చలనచిత్రాలలోనో రాణిస్తుండేవారేమో! యాధృచ్ఛికంగా భావోద్యమ సాహిత్య సృజనశీలి కాలేదాయన. భావోద్యమాల భూమిక ఉద్యమ సాహిత్యమేనంటూ, రచనా వ్యాసంగాన్ని భావోద్యమ దీప్తికోసం స్వయంగా వరించి, తన జీవన యానంగా మార్చు కున్నారాయన. ఇప్పటికి డెబ్బది పైగా హేతువాద - మానవవాద వైఖరిని తేటతెల్లం చేసే తాత్విక గ్రంథాలు, మతం పైన, లౌకిక వాదం మీద, మార్క్సిజం పైన, రాజకీయం మీద, ఉద్యమాల పైన నిర్మాణంపైన, ఆచరణపైన వ్రాశారు. ఉద్యమానికి జవం-జీవం చేకూర్చేందుకు, ఉద్యమ భావ వాహినిని ఉద్యమ కారుల్లో పంచేందుకు ఒక బలమైన అంగం ఉండాలనే ఉద్దేశంతో 1982లో ఒక పత్రిక స్థాపించి నేటికీ తన సంపాదకత్వాన కొనసాగిస్తూనే ఉన్నారు.

ఉద్యమ నిర్మాతగా ఆయన అనేక బాధ్యతలు నిర్వర్తించారంటే చాలదు. హేతువాదమంచే కేవలం దేవును లేదనడం కాదు, నాస్తిక వాదం కాదు, హేతువాదమంటే నిరసనలు, ఆందోళనలు

చేయడం కాదు, అదొక జీవన వైఖరి, జీవనానికి మానవవాద మలుపు నిచ్చే ఒక తాత్విక వైఖరి అంటూ హేతువాదానికి భాష్యం చెప్పింది ఆయనే. మొదట చెప్పుకున్నట్లు ఉద్యంలోనికి ఆయన దూకలేదు. ఉద్యమాన్నే ఆయన సృజించారు. ప్రణాళికలు గీచారు, పునాదులు కట్టారు. హేతువాద ఉద్యమ నిర్మాణానికి వ్యాప్తికి అనేక సంస్థలు నెలకొల్పి నిర్వహిస్తున్నారు. కవిరాజు మరణాంతరం ఆయన స్థాపించిన కవిరాజాశ్రమం ద్వారా పాఠశాలను నిర్వహించారు. వయోజన విద్య బోధించారు. సంస్కరణ వివాహాలు జరిపించారు. పలు ఉపన్యాసాలు ఏర్పాటు చేశారు. అంతేకాక ఆయన స్వయంగా మంచి వక్త. ఆయన స్వరం భాస్వరమే. అయినా సుస్వరమే. విషయాన్ని ఎంత తేటతెల్లంగా స్పష్టంగా చెబుతారో స్వయంగా ఎవరైనా వినవలసిందే. ఆ వాగ్ధాటికి ఎదురుండదు. అలా ఆయన చెప్పుకుంటూ పోతే ఆ ఉపన్యాసానికి అంతుండదు. అంతే గాక ఆ రోజులలోనే ఆయన కవిరాజాశ్రమం తరపున అనేకగ్రంథాలు వ్రాసి ప్రచురించి ప్రజలలో భావ ప్రసారం చేశారు. 1979 మేలో భారత హేతువాద సంఘానికి అనుబంధంగా ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘం స్థాపించి తెలుగునాట హేతువాద ఉద్యమానికి ఊపిరి పోశారు. హేతువాదానికి దిశానిర్దేశం చేశారు. మొదటి సారిగా దాంతోనే హేతువాద ఉద్యమం తన సంస్థాగత కృషిని ఆరంభించింది. ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘానికి 10యేళ్లు అధ్యక్షులుగా పనిచేసి, అనంతరం భారత హేతువాద సంఘాధ్యక్ష పదవి చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ మానవ వాద సంఘం స్థాపించి దానికి అధ్యక్షులుగా కొనసాగారు. ఉద్యమ సాహిత్యం కోసం హేతు వాద ప్రచురణలు (హేమాపబ్లికేషన్స్) స్థాపించి తాను, ఉద్యమ సహచరులు రచించిన 100 దాకా గ్రంథాలను ప్రచురించారు. ఆ గ్రంథ సంచయమంతా హేతువాద - మానవాద ఉద్యమాలకు బలమైన తాత్విక పునాదులేర్పరచాయి. కొన్ని గ్రంథాలు పరభాషలలో కూడా అనువాదమై ఆయా రాష్ట్రాలలో ప్రాచుర్యం పొందాయి. ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘం సృజించిన ఉద్యమ సారస్వతం భారతదేశంలో మరే హేతువాద ఉద్యమంగాని, రాష్ట్ర సంఘాలు గాని ప్రచురించ లేదంటే అతిశయోక్తి కాదు. ఉద్యమానికి ఆర్థికపరమైన ఒడిదుడుకులు తగల కూడదనే ఉద్దేశ్యంతో హేమా ఫౌండేషన్ స్థాపించి, దాని ఆర్థిక సౌష్టవానికి కృషి చేస్తున్నారు. ఇన్ని సంస్థలు స్థాపించి ఇంతటి బహుముఖమైన కృషి కొనసాగిస్తున్నవారు ఒకే ఒక్కరున్నారు.

ఇకాయన రచనా వ్యాసంగం. ఆయన బిరుదల కోసమో - బహుమానాల కోసమో వ్రాయలేదు. కీర్తి ప్రతిష్ఠల కోసమో - సన్మానాల కోసమో వ్రాయలేదు. ఉద్యమాలకు తాత్విక భూమికలు సంతరించడానికే వ్రాశారు. ఆయన రచనలు బహుశాస్త్రాభినివేశంతో నిండి, ఆత్మాభివ్యక్తి నుండి అనంతంగా సాగినవే. ఆయన సృజించిన ఉద్యమ సారస్వతం అవగాహన చేసుకుంటే హేతువాద - మానవవాద ఉద్యమాల లోతుపాతులు తెలుస్తాయి. ఆయన మేధోనైశిత్యం ఎలాంటిదో ఆయన విమర్శను విశ్లేషించుకుంటేనే మనకు తెలుస్తుంది. ఆయన వైజ్ఞానిక రచనలు విశ్లేషించుకుంటేనే ఆయన లోతు మనకు తెలుస్తుంది. ఆయన వైజ్ఞానిక రచనలు అధ్యయనం చేస్తే శాస్త్రతత్వం సుబోధకమౌతుంది. ఆయన తులనాత్మక రచనలను అధ్యయనం చేస్తే మతవాదం, భౌతిక, నాస్తిక, అజ్ఞేయాది వాదాలకు హేతువాదానికి ఉన్న బేధం తెలుస్తుంది. వాస్తవానికి ఆయన సాగించిన రచనా వ్యాసంగం ఆయనకు పేరుప్రతిష్టలు

తేలేదు, హేతువాద ఉద్యమానికే పేరుప్రతిష్ఠలు తెచ్చిదంటే అతిశయోక్తి కాదు, అతివాస్తవం. ఉద్యమాల కోసం అంత విస్తార సాహిత్యాన్ని ఎవ్వరూ సృజించలేదు. అలా సృజించగలిగింది, సృజించిందీ ఒకే ఒక్కరు.

ఉద్యమం పట్ల స్పష్టమైన అభిప్రాయాలు వెల్లడించే ఆయన ఉద్యమ భావాలను తన రచనలలో అలానే స్పష్టపరిచారు. రచనలన్నీ సూటిగా స్పష్టంగా ఉంటాయి. ఉద్యమ రచనలన్నీ సత్యాన్నే ప్రవచించాలి అంటారాయన. చదివిన దానిని అనుభూతి పొందడం, పొందిన అనుభూతిని తనదైన బాణీలో వెల్లడించడం ఆయన రచనా ప్రసంగ వైచిత్రి. అనుభూతుల్లో ఆయన పొందిన అన్ని భావాలు మనలను ముప్పిరిగొంటాయి. ఆయన రచనలు చదివినా, ప్రసంగాలు విన్నా, ఇంతా చేసి ఇదంతా సత్యానికి పట్టం కట్టడానికే అంటారాయన. ఎలాంటి మొగమాటాలకు తావివ్వకపోవడం ఆయన రచన లక్షణం. అందుకోసం ఆయన ఉపయోగించిన పదునైన భాష, విపక్షాలకు, విమర్శకులకు కోపం తెప్పించేది. అలా విమర్శలు, చేసిన వారిలో సహోద్యమకారులేకాక, విజ్ఞులైన పత్రికా సంపాదకులు, పుస్తక సమీక్షకులుసైతం ఉన్నారు. పలుమార్లు పత్రికా సంపాదకులు, సమీక్షకులు సైతం 'అంత దూకుడుగా చెప్పాలా? మెత్తగా చెప్పకుడదా?, అనేవారు. అయితే ఆ రచనల నేపథ్యాన్ని వారు పరిగణనలోనికి తీసుకొనక పోవడంవల్ల అలాంటి ఇబ్బంది తలెత్తుతుందని ఆయన చెప్పారు. అంతేకాక ప్రతి రచనకు ఓ నిర్మితి, ఓ వ్యవస్థ ఉండితీరుతుంది. రచనకో ఉద్దేశ్యం ఉంటుంది. కేవలం ఉద్వేగమే సామాజిక ప్రయోజన సాధనమని భావించడం సరికాదు. విమర్శకులు రచనల్లోని ఉద్వేగాన్ని మాత్రమే పరిగణనలోనికి తీసుకొనరాదు. వివేచనను ముందుగా అంచనా వేయాలి అంటారాయన. విషయం కూడా ప్రధాన పాత్ర వహిస్తుంది. తాత్విక సమస్యల గురించి చర్చించేటప్పుడు సమాధానం తాత్వికంగానే ఉంటుంది. సమాజ సౌష్ఠవాన్ని భగ్నం చేసే గతానుగతికమైన మతాలగతాన్ని ప్రశ్నించేటప్పుడు ఒకధిక్కారసర్వం అవసరమౌతుంది. ప్రశ్న వైజ్ఞానికమైతే జవాబు వైజ్ఞానికంగానే ఇవ్వాలి. విపక్షంవారు సంధించే తలాతోకా లేని ప్రశ్నలు, వేధించడానికి వేసే ప్రశ్నలకు వారిని నిరుత్తరులను చేసే ప్రత్యుత్తరాలే ఇవ్వవలసి వుంటుందంటారాయన. ఆయన పాఠశాలల్లో ప్రసంగించినా, విశ్వవిద్యాలయాలలో ప్రసంగించినా, సామాన్య జనం ఏర్పాటు చేసుకున్న వేదికమీద నుండైనా, విద్వత్సభలలోనైనా ఆయన ధోరణి మారేది కాదు.

ఆయన రచనల మాదిరే ఉద్యమనిర్మాణం పట్ల కూడా స్పష్టమైన వైఖరి ప్రదర్శించేవారు. ఎక్కడా రాజీపడేవారు కారు. అత్యయిక స్థితి నేపథ్యంలో హేతువాదఛత్రం నీడన చేరిన కొందరు వామపక్షవాదులు మార్క్సిజాన్ని విమర్శించరాదనే బలమైన వాదంతో ముందుకు వచ్చినప్పుడు -హేతువాదానికే కాదు, నాకే కాదు ఎవరికైనా, ఏ విషయంలోనైనా విమర్శించే హక్కుంటుంది. అలాంటి హక్కులేదనడం మౌలికంగా మానవస్వామ్యానికి గొడ్డలిపెట్టు. ఏ మనిషి భావప్రకటనా స్వేచ్ఛనూ మరొకరు అడ్డగించరాదు, అంటూ కుండ బద్దలు కొట్టినట్లు చెప్పారాయన. దాంతో ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘంలో చీలికవచ్చింది. అలా విమర్శలు చేసినవారు తమకిష్టమైన గూళ్ళకు తిరిగి చేరుకున్నారు. అయితే ఈనాటివరకు ఆయన మార్క్సిజం మీద చేసిన విమర్శకు జవాబు లేదన్నది గమనార్హం. అలాంటి మేధోనైశిత్యం ఆయన స్వంతం.ఆ ఒక్కరు ఎవరు?

సిద్ధాంత రాహిత్యాన్ని ఆయన ఎన్నడూ అనుమతించలేదు. సిద్ధాంత విషయాలలో ఛాలా కరుగ్గా ఉండేవారు. ఉద్యమ విద్రోహులను ఆయన ఎన్నడూ క్షమించలేదు. రాజీమార్గాలను ఎన్నడూ అనుమతించలేదు. ఉద్యమంలో అన్ని పార్శ్వాలు పట్టిచూచిన ఆయన సైద్ధాంతిక నిబద్ధత దేనికీ తలవొగ్గనిది. ఇతర ఉద్యమాలను, ఆందోళనలను తులనాత్మకంగా అంచనా వేసారు. అందుకొక సాక్ష్యం మద్యపాన నిషేధ ఉద్యమమే. అది ఎంత మేలు చేకూర్చేది అయినా ప్రజలలో దానిపట్ల సరైన అవగాహన లేనిదే, ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేనిదే విజయవంతంకాదన్నారు, ఉద్యమ సహచరులు ఆ ఉద్యమంపట్ల అత్యుత్సాహం ప్రదర్శించి, మనం తోడ్పాటు ఇవ్వకూడదా అంటే, దానికి ఆయనిచ్చిన విశ్లేషణ ఇదే. అక్షరాలా అది కొంతకాలానికే విఫలమయింది. అలానే ఉద్యమసహచరులు స్వాములవార్లముందో, జ్యోతిష్కుల ముందో, దేవాలయాల ముందో ఊరేగింపులు చేస్తామంటే, అందువల్ల ఒనగూడే ఫలితాలు తక్కువనీ–పైగా హింసకు దారితీయవచ్చనీ హితబోధ చేశారు. పెడధోరణులను ఎదుర్కొనడంలో తిరుగులేని వైఖరి ప్రదర్శించారు. ఉద్యమానికి ఎదురయ్యే విచ్ఛిన్నకర ధోరణులను ఏమాత్రం సహించేవారు కారు. ఉద్యమానికి వెన్నుపోటుదారులై, ఉద్యమంనుండి వైదొలిగిన వారు తమ అవసరార్థం పదవులకోసమో, కీర్తికండూతి కోసమో, మరే స్వలాభం కోసమో బయటకు వెళ్ళారని కఠినంగానే విమర్శించారు. అందుకెన్నో చారిత్రక ఉదాహరణలిచ్చారు. కాలగతిలో అవే నిజమయ్యాయి. ఉద్యమం నుండి దూరంగా జరిగినవారు ఇతర ఉద్యమాలలో చేరి వారు ఆశించినవి పొందగలిగారు. వారి సైద్ధాంతిక నిబద్ధత అంటువంటిదంటారాయన. అయితే వారి స్వేచ్ఛను గౌరవించేవారు. వారి నిర్ణయాధికారం వారికే వదిలేవారు. ఆ నిర్ణయంలోని లోటుపాట్లను వారికే చెప్పేవారు. అలానే ఉద్యమంలోని సహచరులకు చెప్పారు. అందుకు పుంఖాను పుంఖాలుగా వ్యాసాలు వ్రాశారు. అవన్నీ ఉద్యమనిర్మాణం కోసం, కేడర్‌కోసం వ్రాసినవే. అలాగే ఇతర ఉద్యమాలకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరవుతున్నారని, వారి సంఖ్యా బలం అధికంగా వుందని ఉద్యమ సహచరులు బాధపడినప్పుడు – ఉద్యమాలు సామాజిక అవగాహనలో భాగంగా, చారిత్రక అవసరంగా వస్తాయని, అవితీరగానే అదృశ్యం అవతాయని ప్రజా ఉద్యమాల పట్ల ఆకర్షణ ఎలాంటిదంటే ఉద్యమంలో పనిచేసేవారు వరదలాగే వస్తారు, అలానేపోతారు. ప్రజా ఉద్యమాలపట్ల విమర్శనాత్మకంగా ఉండటమే భావోద్యమాల లక్షణమని ఆయన చెప్పారు. భావోద్యమాలు తరం తరం నిరంతరం కొనసాగేవని, అందువల్ల వీటికి సంఖ్యాబలం ప్రధానం కాదని, భావవ్యాప్తి ప్రధాన అవసరమని అంటారాయన. అలా అనగలిగింది ఆయనొక్కడే.

హేతువాద – మానవవాద ఉద్యమాలు – ఇతర ఉద్యమాల పట్ల ఆయన భావం స్పష్టం. మనం మౌనంగా ఉండాలి. మనం (ప్రజలు) ముందుగా భావవిప్లవాలకు నిబద్ధులమయితే తరువాత ప్రజలు వారికి కావలసిన విప్లవాలకు వారే సన్నద్ధులౌతారు. సంపూర్ణ మానవ వికాసాన్ని ఆకాంక్షించే మన వెంబడి తక్కిన ఉద్యమాలు నడవాలేకాని, మనం ఏదో పార్శ్వాన్ని పట్టిచూచే తక్కిన ఉద్యమాల వెంట మనం పరువులెత్తనాదు. వ్యక్తుల జీవితాలనూ, సాంఘిక వ్యవస్థల తీరుతెన్నులనూ నిర్దేశిస్తున్న భావనలు, స్థితిగతులు, ప్రమాణాలను జతపరచి అంతరంగంలోనేకాక బాహ్యంగానూ మార్పుకు ప్రేరేపిస్తున్నామంటే, అవి భావవిప్లవం తాలూకు అడుగుజాడలే అంటారాయన. హేతువాద వైఖరి మనిషి అంతరంగాన్ని స్వచ్ఛపరుస్తుంది.

వ్యక్తికి సంబంధించిన నైతిక విలువలకూ, సమాజంలోని ఆర్థిక రాజకీయాది వ్యవస్థలకు సంబంధించిన సామాజిక విలువలకూ ఓ స్పష్టమైన మానవోచితమైన రూపం ఇవ్వడానికి మనం హేతువాద పథముగాములం కావాలి. ఆ పథం మీదుగానే మనం మానవవాద లక్ష్యం చేరాల్సింది అంటారాయన. అలా అన్నది ఆయనొక్కరే.

ఉద్యమ రచయితలు, మేధావులు, కార్యకర్తలు ప్రక్కప్రక్కన నడవాలేకాని ఇందులో ఒకరెక్కువ, మరొకరు తక్కువ అన్న బేధభావం చూడరాదు. ఆదర్శాల, ఆశయాల విషయంలో రాజీ అన్నదే లేదు. రాజీపడితే ఆశయాలు, ఆదర్శాలు అధోగతేకదా? అప్పుడు ఉద్యమాల సంగతేమవుతుంది? వ్యక్తుల పట్ల, సంఖ్యపట్ల ఆకర్షితులు కావడమూ, కలుపుకుపోవడాలు, ఐక్యవేదికలు మొదలైనవి సిద్ధాంతరాహిత్యానికి దారితీస్తాయని, అవి కేవలం బలహీనత లేనని, వాటిని సరైనవిగా చూసే ప్రయత్నాలు ఎన్నడూ చేయరాదనే వారు. హేతువాద సంఘంలో చీలికలు తెచ్చినా, పదవుల కోసం వ్యక్తులు ఉద్యమాలకు ఎసరు పెట్టచూచినా, సహోద్యమకారులు ఇతర ఉద్యమాలలోనికి వలస వెళ్ళినా, అక్కడ పనిచేస్తామన్నా ఆయన వారిని ఆటంక పరచలేదు. ఈ ఉద్యమస్వరూప స్వభావాలను మరొక మారు స్పష్టం చేసి ఊరుకున్నారాయన. అభిప్రాయాలను బలవంతంగా రుద్దడం హేతువాద వైఖరికి విరుద్ధం అంటారాయన. ఇతరుల భావప్రకటనా స్వేచ్ఛకు మనం ఆటంకం కలిగించరాదు. ఆయనకు స్వేచ్ఛ పట్ల అపరిమిత విశ్వాసం. ఆయన రచలన్నీ స్వేచ్ఛాగాన మాధుర్యంతో నిండి సత్యావిష్కరణ చేస్తాయి. ఇతరుల స్వేచ్ఛ పట్ల కూడా ఆయనకు అపరిమిత విశ్వాసం. ఎదుటివారిస్వేచ్ఛను ఎన్నడూ కాదనలేని స్వేచ్ఛా ప్రియుడాయన. ఆయనలా నొక్కి చెప్పిన వారుమరొకరు లేరు. అలా చెప్పింది ఆయన ఒక్కడే.

ఆయన జీవనయానంలో ఎంచుకున్న హేతుశీలం నిత్యచైతన్య శీలం. ఆయన ఎనుకున్న కార్యక్షేత్రమూ హేతువాద ఉద్యమ క్షేత్రమే. అదే ఆయన జీవనక్షేత్రమయింది. భావోద్యమ విమర్శకులపై నిరంతరం శంసంధానం చేస్తూనే వున్నారు. ఉద్యమద్రోహులను, విపక్షాలను భావపరంగా చీల్చి చెండాడటంలో వెనుకంజ వేయలేదు. శాస్త్రానికి ఎప్పుడు మతాన్నుండి సవాళ్ళు ఎదురైనా ఆయన శాస్త్రానికి దన్నుగా ఉండేవారు. పాశ్చాత్య దేశాలనుండి దిగుమతైన యాంటీసైన్సు వాదం, ఆధునికానంతరవాదం, మానవానంతర వాదం అనే పేర్లతో రంగం మీదకొచ్చినపుడు ఆ క్రొత్తబొంతలు తొడుక్కుని రంగం మీదకొచ్చిన మతవాదులు, ప్రచ్ఛన్నహేతువాదులైన ఆధునిక కుమారిలభట్లకు దీటుగా జవాబిచ్చారు. ఆయన ఎన్నుకున్న మార్గం అసాధ్యమనిపించినా ఆయన వెనుకాడలేదు. ఆయన ఉద్యమ సహచరులు నిరుత్సాహపరచినా కాలగమనంలో ఆయన ఎంపిక ప్రాశస్త్యాన్ని వారు గ్రహించారు. ఆ విధంగా ఆయన సైద్ధాంతిక నిబద్ధత సాటిలేనిది. అంతటి నిబద్ధత కలవారెవరైనా ఉన్నారా?

